


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 30 బుధవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 226
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# భూదాన్ లాండ్ స్కాం

- ఈడీ సంచలన ప్రకటన
- మనీలాండరింగ్ వ్యవహారంలో హైదరాబాద్‌లోని 5 చోట్ల సోదాలు
- వ్యక్తిగత ప్రయోజనాలకై ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతంపై విచారణ
- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు
- మహేశ్వరం మండలం నాగారంలో ఉన్న భూములు అన్యాక్రాంతం
- ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సైతం భూదాన్ భూముల విక్రయం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
భూదాన్ భూముల వ్యవహారంపై ఈడీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో హైదరాబాద్ లోని ఐదు చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయడంపై విచారణ చేస్తున్నామని స్పష్టం చేసింది. ఆ ప్రకటనలో.. ' నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించడంపై ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులపై .. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నాం.
మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో ఉన్న భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించాము. ఖాదర్ ఉన్నిసా పూర్వీకుల ఆస్తిగా చెప్పి రెవెన్యూ రికార్డులను మోసపూరితంగా మార్చేశారు. కొంత మంది దళారులతో కలిసి భూమిని వివిధ సంస్థలకు విక్రయించారు. ఈ మధ్యవర్తులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అమ్మకాలు చేశారు. అందుకోసం నకిలీ పత్రాలను సృష్టించి, భూ రెవెన్యూ రికార్డులను మార్చినట్లు విచారణలో తేలింది. నిషేధిత

# కొనసాగుతున్న కగార్ ఆపరేషన్

- చరిత్రలో అతి పెద్ద ఆపరేషన్..
- 1000 మంది మావోయిస్టుల కోసం 24 వేల మంది జవాన్లు
- మావోల పతనమే లక్ష్యంగా జవాన్లు అరణ్యంలో సెర్చ్ ఆపరేషన్
- జవాన్ల అధీనంలో 800 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న కర్రెగుట్ట

2



**బీజాపూర్-నవభూమిబ్యూరో:** ఈ కాల్పుల్లో ఏప్రిల్ 24వ తేదీన ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయారు. వారి బాడీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ముగ్గురి కంటే ఎక్కువ మంది మావోయిస్టులు చనిపోయి ఉంటారని తెలుస్తోంది.
మార్చి 31, 2026లోగా దేశంలో మావోయిజాన్ని లేకుండా చేస్తామని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా బలంగా అడుగులు ముందుకు సాగుతున్నాయి. మావోయిస్టుల పతనమే లక్ష్యంగా జవాన్లు అరణ్యంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. తెలంగాణ- ఛత్తీష్‌ఘర్ సరిహద్దు ప్రాంతంలోని కర్రెగుట్టలో మావోయిస్టుల కోసం భారీ సెర్చ్

## చర్చల ద్వారా పరిష్కరించాలి:సీతక్క

2

ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క రియాక్షన్

**వరంగల్-నవభూమిబ్యూరో:** ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని మంత్రి సీతక్క సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జ

# చిత్రం..విచిత్రం

- తెలంగాణాలో విచిత్ర వాతావరణం..
- ఆ జిల్లాల్లో వానలు, ఈ జిల్లాల్లో ఎండలు!
- రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాలలో వర్షాలు కురుస్తాయని
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడి
- ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు గంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ రాష్ట్రంలో ఈ సంవత్సరం ఎండా కాలం ఎండలు మండిపోతాయి అని వాతావరణ శాఖ అధికారులు చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఈ సంవత్సరం ఎండాకాలంలో ప్రస్తుతం విచిత్ర వాతావరణ నెలకొంది. ఒకపక్క తీవ్రమైన ఎండలు మరొక పక్క అకాల వర్షాలతో తెలంగాణ ప్రజానీకం ఉక్కిరి బిక్కిరి అవుతుంది. చాలా జిల్లాలలో భానుడి ఉగ్రరూపం కనిపిస్తుంది. ఒకపక్క ఎండలు, మరోపక్క వానలు భరించలేని ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. వడగాలుల దెబ్బకు ప్రజలు అల్లాడుతున్నారు. పలువురు వృద్ధులు వడదెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో అకస్మాత్తుగా కురుస్తున్న అకాలవర్షాలు కూడా ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. మామిడి తోటలు కాపుకు వచ్చి పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్ల వానలు కురుస్తూ ఉద్యాన పంటల సాగు చేస్తున్న రైతన్నలకు తీవ్ర దుఃఖాన్ని మిగులుస్తున్నాయి. ఈ జిల్లాలలో వర్షాలు ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాలలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, సిద్ధిపేట, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్ ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ

# ఆ 41 మందికి నో ఛాన్స్

- ఏపీలో 41 మంది కూటమి ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత
- వాళ్లకు టికెట్లు ఇస్తే మళ్లీ గెలిచే ఛాన్స్ నిల్
- ప్రవీణ్ పుల్లట్ల తాజా సర్వే సంచలనం
- 92 శాతం వన్ టైమ్ ఎమ్మెల్యేలు మొదటిసారి, చివరి సారి అంటూ మరో కామెంట్




**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలైంది. ఈ 10 నెలల్లో ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో కాస్త పక్కనబెడితే ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం క్షేత్రస్థాయిలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నేరుగా కేబినెట్ భేటీల్లో, కూటమి పార్టీల భేటీల్లో పదే పదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోవడం లేదని మరోసారి నిరూపణ అయింది. తాజాగా వెలువడిన ఓ సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసారి కూటమి కచ్చితంగా ఘన విజయం సాధిస్తుందని చెప్పిన సర్వే నిపుణుల్లో ప్రవీణ్ పుల్లట ఒకరు. ఆయన చెప్పిన అంచనాలు ఎన్నికల్లో దాదాపు నిజమయ్యాయి. దీంతో కూటమి ఘన విజయం సాధించింది. అయితే గెలుపు తర్వాత కూటమి పనితీరు ఆశాజనకంగా లేదని ఇప్పటికే పలుమార్లు ట్వీట్ల రూపంలో వెల్లడించిన ప్రవీణ్ పుల్లట తాజా గణాంకాల ప్రకారం ఈసారి 41 మంది కూటమి ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ రాదని, వచ్చినా ఓడిపోతారని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. దీంతో ఆయన ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. కూటమి ప్రభుత్వానికి సంవత్సరం పూర్తికావస్తున్న తరుణంలో త్వరలో మరిన్ని సంచలనాలు బయటపెడతానంటూ ప్రవీణ్ పుల్లట మరో ట్వీట్ చేశారు. 92 శాతం వన్ టైమ్ ఎమ్మెల్యేలు మొదటిసారి, చివరి సారి అంటూ మరో కామెంట్ కూడా పెట్టారు. అయితే ఇది ఎవరి గురించి అన్న విషయం మాత్రం చెప్పలేదు. దీంతో త్వరలో ప్రవీణ్

## అందాల పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- మే 10న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమావేశం
- అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష
- భద్రతా చర్యలు, సాంస్కృతిక ప్రదర్శనలపై చర్చ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఈవెంట్‌కు వేదిక కానుంది. మిస్ వరల్డ్ - 2025 అందాల పోటీని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. అధికారులతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వేంపల్లి నరేందర్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సమీక్షలో మే 10న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి పలు అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ మేరకు కార్యక్రమం కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పట్టణ అభివృద్ధి సహా పలు అంశాలపై సమగ్రంగా చర్చ జరిపారు. ఈ పోటీల కోసం విదేశాల నుంచి వచ్చే కంటస్టెంట్స్, గ్లోబల్ అతిథులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేయాలని సీఎం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి హెూటళ్ల వరకూ ప్రత్యేక వీఐపీ వాహనాలు, వెల్కమ్ టీంలను ఏర్పాటు చేయాలని, గెస్ట్‌లు గమ్యం చేరే సమయానికి ప్రతి విషయాన్ని ప్రొఫెషనల్‌గా నిర్వహించాలని

# ఎన్డీఎస్ఏ నివేదికపై సిగ్గుపడని బీఆర్ఎస్ నేతలు

- కాళేశ్వరంలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ వక్రభాష్యాలు
- ఎన్సీఎసీఏ' ఎవరు నివేదిక ఇవ్వడానికి అని కించపరిచేలా మాట్లాడుతున్నారు
- ఎన్సీఎసీఏ' 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది.అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైందని బీఆర్ఎస్ నేతలకు తెలియదా?
- కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి విమర్శించారు. 'ఎన్సీఎసీఏ' ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే. ఇప్పటికే రూ. లక్ష కోట్లు దాటిపోయిందన్నారు.
"వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక ! రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఎన్డీఎస్ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ అత్యున్నత బోర్డు, దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్డీఎస్ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు.
అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్డీఎస్ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలు పెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థి అనూహ్య ఎంపిక

- వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ
- బీజేపీ పార్టీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్,సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణ ఎంపిక



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన ఎంపీ స్థానానికి కూటమి అభ్యర్థి ఖరారయ్యారు. ఈ స్థానంలో కూటమి తరపున ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని నిర్ణయించడంతో ఆ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ అయిన సీనియర్ నేత పాకా వెంకట సత్యనారాయణను అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ప్రకటన చేసింది. ఏపీ రాజ్యసభ అభ్యర్థి ఖరారు కోసం సమావేశమైన పార్టీ ఎన్నికల కమిటీ పలు చర్చల తర్వాత రాజ్యసభ అభ్యర్థిగా బీజేపీ నేత పాక వెంకటసత్యనారాయణను ఎంపిక చేసింది. రేపు మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో తర్జనభర్జనల తర్వాత పాకా వెంకట సత్యనారాయణకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. బీజేపీ ఏపీ కోర్ గ్రూప్ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు.ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి యూరప్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీలో సాధారణ కార్యకర్తకు అవకాశం ఇవ్వాలనే పాగాను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా పాక వెంకట సత్యనారాయణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముందు నుంచి ఆర్ఎస్ఎస్ తో ఉన్న సంబంధాలు ఆయనకు కలిసి వచ్చాయని పార్టీ

# తాగర అన్నా..తాగి ఊగర అన్నా

- ఎండల దెబ్బకు బీర్లకు డిమాండ్
- ప్రతిరోజు 3లక్షల బీర్ కేసులు అమ్ముడవుతున్నట్లు ఆబ్కారి లెక్కలు
- గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 5.48 కోట్ల కేసుల బీర్ల విక్రయం
- నిరుడు కంటే కోటిన్నర కేసుల బీర్లు ఎక్కువ అమ్మాలని ఎక్సైజ్ శాఖ యోచన

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో
రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సంవత్సరం ఎండలు బాగా ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఇక ఈ వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి చాలామంది చల్ల చల్లని బీర్లను ఆశ్రయిస్తున్నారు. ఎండల దెబ్బను తట్టుకోవాలంటే బీర్ తాగాల్సిందే అని భావిస్తున్న మద్యం ప్రియులు కేసులకు కేసులు బీర్లు ఖాళీ చేస్తున్నారు. తెలంగాణలో డిమాండ్‌కు తగ్గట్టు బీర్ల ఉత్పత్తి రాష్ట్రంలో సమ్మర్ సీజన్లో బీర్‌లకు షార్టేజ్ లేకుండా డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రొడక్షన్ చేయాలని ప్రభుత్వం బేవరేజెస్ కంపెనీస్‌కి ఇంతకుముందే అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఒకపక్క ప్రజల డిమాండ్‌కు

## చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

2



కామారెడ్డి-నవభూమిబ్యూరో
చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం రూపొందించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా షట్పల్లిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న మంచి పనులు చూడలేక మాజీ సీఎం కేసీఆర్కు దుఃఖం వస్తోందన్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూన్

## చైనా రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం

22 మంది దుర్మరణం

2

**బీజింగ్-నవభూమిబ్యూరో:** చైనాలోని లియానింగ్ ప్రావిన్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్లో మంటలు చెలరేగటంతో 22 మంది చనిపోగా .. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఈ దారుణ సంఘటన చోటుచేసుకుంది. చైనా అధికార మీడియా క్లిన్‌క్షువ న్యూస్ తెలిపిన వివరాల మేరకు.. చైనా, లియానింగ్ ప్రావిన్స్‌లోని ఐయావోయాంగ్ సిటీలో ఓ ప్రముఖ రెస్టారెంట్ ఉంది. మంగళవారం మధ్యాహ్నం 12.25 గంటల ప్రాంతంలో ఆ రెస్టారెంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 22 మంది చనిపోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు.
అగ్ని మాపక దళంతో పాటు రెస్క్యూ టీమ్‌కు కూడా సమాచారం

# పహల్గాం ఉగ్రదాడికి నిరసగా పెద్దపల్లి బంద్.. తెరచుకోని దుకాణాలు



**పెద్దపల్లి-నవభూమి:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి వ్యతిరేకంగా పెద్దపల్లిలో బంద్ నిర్వహిస్తున్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతిచేకూరాలని కోరూతూ పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. ఒక్క షాపు కూడా తెరచుకోకపోవడంతో వీధులన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. పెద్దపల్లి కూరగాయల మార్కెట్ జెండా చౌరస్తా కామన్ రోడ్‌లో బంద్ సంపూర్ణంగా జరుగుతున్నది. ఉగ్రదాడితో అప్రమత్తమైన ప్రభుత్వం.. పెహల్‌గామ్ ఉగ్రదాడితో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయ్యింది. కశ్మీర్ లోయలో భద్రతను కట్టుదిట్టం చేసింది. ఉగ్రవాదుల కోసం ఐదు రోజులుగా వేట కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే కశ్మీర్ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. కశ్మీర్‌లోని పలు పర్యాటక ప్రాంతాలను మూసివేసింది. పెహల్‌గామ్ ఉగ్రదాడిపై ఆగ్రహంతో ఉన్న సైన్యం.. కశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఇళ్లను ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు ప్రతీకారంతో రగిలిపోతున్న ముష్కరులు.. పెద్ద ఎత్తున దాడులు, హత్యలకు ప్లాన్ చేస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు వస్తున్నాయి. కశ్మీర్ లోయలో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా సంస్థల హెచ్చరికలతో అప్రమత్తమైన ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కశ్మీర్‌లో మొత్తం 87 పర్యాటక ప్రాంతాలుండగా.. అందులో 48 ప్రాంతాలను మూసివేసింది. ఆ ప్రాంతాల్లో సాయుధ బలగాలతో భద్రత కల్పించిన తర్వాతే వాటిని తిరిగి ఓపెన్ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టూరిస్ట్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.



# తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్ రానున్నారు. ప్రస్తుత డీజీపీ జితేందర్ సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయనుండటంతో.. ఆయన స్థానంలో కొత్త డీజీపీని నియమించనున్నారారు. ఈ మేరకు ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను ప్రభుత్వం యూపీఎస్సీకి పంపింది. తుది జాబితా నుంచి కొత్త డీజీపీని నియమించనున్నారు. ఈ రేసులో సీనియర్ అధికారులు రవి గుప్తా, సీవీ ఆనంద్ ముందు వరసలో ఉన్నారు. సీనియారిటీ, సర్వీస్ రికార్డుల తెలంగాణ సీఎస్ శాంతి కుమారి ఈనెలాఖరున పదవీ విరణ చేయనున్న విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కొత్త సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ రామకృష్ణారావును నియమించారు. ఇక రాష్ట్రానికి త్వరలో కొత్త పోలీస్ బాస్ కూడా రానున్నారు. ప్రస్తుత డీజీపీ డాక్టర్ జితేందర్ సెప్టెంబర్ 6న పదవీ విరమణ చేయనునుండగా.. కొత్త డీజీపీని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పోలీస్ శాఖలో అత్యున్నత పదవి అయిన డీజీపీ ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపింది. యూపీఎస్సీ వారి అర్హతలు, పనితీరు, సర్వీస్ రికార్డులను పరిశీలించి ముగ్గురు సీనియర్ అధికారుల పేర్లతో తుది జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనుంది. ఆ జాబితా నుంచే కొత్త డీజీపీని ఎన్నుకోనున్నారు.ప్రస్తుతానికి డీజీపీ పదవి కోసం ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం యూపీఎస్సీకి పంపిన జాబితాలో 1990 బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, బి.శివధర్ రెడ్డి, డాక్టర్ సౌమ్య మిశ్రా, శిఖా గోయల్ ఉన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే రవి గుప్తాను డీజీపీగా నియమించగా.. ఆ తర్వాత ఆయన స్థానంలో జితేందర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రవి గుప్తా హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పోటీలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారుల పదవీ విరమణ తేదీలను పరిశీలిస్తే.. కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఈ ఏడాది ఆగస్టులో, రవి గుప్తా డిసెంబర్‌లో, సీవీ ఆనంద్ 2028 జూన్‌లో, ఆప్టే వినాయక్ ప్రభాకర్ 2029 అక్టోబర్‌లో, బి.శివధర్ రెడ్డి 2026 ఏప్రిల్‌లో, డాక్టర్ సౌమ్య మిశ్రా 2027 డిసెంబర్‌లో, శిఖా గోయల్ 2029 మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఈ రేసులో సీనియారిటీ ప్రకారం..రవిగుప్తా, సీవీ ఆనంద్, శివధర్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరిని కొత్త డీజీపీగా నియమిస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. శివధర్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ నిఘా విభాగం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీవీ ఆనంద్ హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్నారు.

# రవీంద్ర భారతిలో మధ్యాహ్నం ఒంటి గంటకు 'పది' ఫలితాలు విడుదల



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను రవీంద్ర భారతి వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం ఒంటి గంటకు విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ అధికారికంగా ప్రకటించారు.ఈ సారి కొత్తగా మార్కులతో పాటు సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్స్ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి ఫలితాలను %త్అవ‌ష‌ం.ఔశీ‌వ% వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు.ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమాల(కో కరిక్యులర్ యాక్టివిటీస్)లో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

# ఈ జిల్లాలకు వర్ష సూచన.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ..



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహమూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. మరో వైపు రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఎండ పెరిగింది. దాంతో జనం తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందిపడు తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో లేని పేరు.. వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకు పైగా లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులు విడుదల చేస్తున్నారు. అయితే అర్హత ఉన్నా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నేతల కారణంగానే తమ పేర్లు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో మనస్తాపానికి గురైన కనకయ్య అనే వ్యక్తి గ్రామంలోని నీటి ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

బాధితుడు కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. అతడి మాటలు నమ్మిన కనకయ్య అతనికి విడతల వారీగా రూ.20 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. అయితే.. తాజాగా విడుదలైన లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో కనకయ్య తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం గ్రామంలోని నీటి ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కనకయ్యను బుజ్జగించే ప్రయత్నం చేశారు. సుమారు గంటపాటు నచ్చజెప్పిన అనంతరం కనకయ్యను క్షేమంగా కిందికి దించారు. అనంతరం పోలీసులు కనకయ్య నుంచి వివరాలు సేకరించి.. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడుపై వచ్చిన లంచం ఆరోపణలపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన వెలుగుపల్లి గ్రామంలో కలకలం రేపింది.కాగా, ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒక నిరంతర ప్రక్రియ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఇళ్ల నిర్మాణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో లంచం తీసుకున్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ.. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా లంచం అడిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కండక్టర్ దగ్గర్నుంచి చిల్లర తీసుకోకుండానే బస్సు దిగారా..? ఇలా చేస్తే మీ డబ్బులు మీకు వచ్చేస్తాయి..!



**హైదరాబాద్-నవభూమి:** కిరాణా కొట్టుకు వెళ్లి సరుకులు తీసుకురమ్మని అమ్మ చెప్పినప్పుడు ఉప్పో, పప్పో మర్చిపోయి దాదాపుగా అందరూ తిట్లు తినే ఉంటరు. హెూం వర్క్ చేయడం మర్చిపోయి బెత్తం దెబ్బలు రుచి చూడని వారు ఉండరు అంటే నమ్మడం కష్టమే. ఇంకొంచెం పెద్దయ్యాక బస్సులో చిల్లర డబ్బులు మరిచిపోనివారు ఎంతమంది ఉంటరు చెప్పండి అసలు..? టిక్కెట్టుకు సరిపడా చిల్లర ఇచ్చి కండక్టర్‌కు సహకరించగలరని ప్రతి బస్సులో రాసి ఉంటది. కానీ, మనకు కాదులే చెప్పేది అన్నట్టు పది రూపాయల టిక్కెట్టుకు కూడా ఐదు వందల నోటిచ్చి ధీమాగా కూర్చుంటం. కానీ, అప్పుడు ఆ కండక్టర్ ఇచ్చే లుక్కు చూడాలి..! మొహం మీద ఉమ్మేసినట్టు ఉంటది! అంతేకాదు అందుకు శిక్షగా టిక్కెట్టు వెనకాల మనకు రావాల్సిన అమౌంట్ రాసి వస్తే ఇస్తా.. లేకుంటే నువ్వే ఇచ్చి తీసుకో అని చేతిలో పెడతడు.అప్పుడు చేసేదేం లేక.. ఎక్కడ మర్చిపోతామో అని పదే పదే గుర్తుచేసుకుంటూ ఉంటం. మన దరిద్రం కొద్దీ మర్చిపోయామే అనుకో.. ఆరోజు ఇగ ముద్ద గొంతులోకి దిగదు. కంటికి నిద్ర పట్టదు. వందల రూపాయలే కాదు ఒక్కోసారి ఐదు, పది రూపాయలు కూడా మర్చిపోతం. అప్పుడు కూడా అంతే బాధ పడతం అది వేరే విషయం అనుకో. కానీ మనం మర్చిపోయిన పైసలు మళ్లీ మన జేబులోకి వస్తే ఎంత బాగుంటుంది. అది కూడా మనం బస్సు దిగి ఇంటికి పోయి, టిక్కెట్టు పడేద్దాం అనుకున్నప్పుడు చిల్లర డబ్బులు రావాలి కదా అని గుర్తొచ్చాకా తిరిగి వస్తే ఆ ఆనందమే వేరు కదా..!

మతిమరుపు మానవులకు తియ్యటి వార్తే ఇది. అలాంటి వారి కోసం మన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇలా కూడా ఉపయోగపడుతోంది. ఫోన్ చేసి అడిగితే డబ్బులు తిరిగి పంపే కండక్టర్ ఉంటే ఎంత బాగుంటుంది కదా.బస్సులో చిల్లర డబ్బులు మరిచిపోయి, మళ్లీ తన డబ్బులు తనకు వచ్చినట్టు ఓ ప్రయాణికుడు 'ఎక్స్'లో పంచుకున్న అతడి అనుభవం అందరినీ ఆకట్టుకుంటోంది. అసలు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే కండక్టర్ నెంబర్ ఇస్తరు ఓ సర్వీస్ ఉందని మనలో కూడా చాలామందికి తెల్వదు. అలా తెల్వక టిక్కెట్లు పడేసి ఎన్నో కొన్ని డబ్బులైతే పోగొట్టుకొనే ఉంటం. కానీ, ఇలా కూడా మన పైసలు తిరిగి పొందవచ్చనే వార్త వింటే కాస్త ఊరటగా ఉంటది కదా.

# తాగర అన్నా..తాగి ఊగర అన్నా

**(1వపేజీ తరువాయి)** తగ్గట్టు బీర్ల ఉత్పత్తి సంస్థలు సప్లై చేసేందుకు బీర్ల ఉత్పత్తిని పెంచినప్పటికీ రాష్ట్రంలో మాత్రం వైన్స్ లో, బార్ షాపులలో బీర్లు క్షణాలలో విక్రయం అవుతున్నాయి. భారీగా పెరిగిన బీర్ల అమ్మకాలు ప్రస్తుతం రాష్ట్రంలో పెళ్లిళ్ల సీజన్ కూడా జోరుగా సాగుతున్న క్రమంలో వివాహ వేడుకలకు సంబంధించిన పార్టీలకు కూడా బీర్ల వినియోగం పెరిగింది. రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు భారీగా పెరగడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుంది. ఈ సీజన్లో ఎక్సైజ్ శాఖ అంచనాలకు తగ్గట్టు భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతేడాది కంటే కోటిన్నర కేసుల బీర్లు ఎక్కువగా అమ్మాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ప్రతీరోజూ ఎంత తాగుతున్నారంటే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు దాదాపు మూడు లక్షల బీర్ కేసులు అవుతున్నాయని సమాచారం. ఈ సీజన్ తప్ప మిగతా సాధారణ రోజులతో పోలిస్తే ఇది రెట్టింపు స్థాయిలో ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ దాదాపు 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్మితే, ఈ సంవత్సరం ఇది మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్, నారా లోకేష్, వైఎస్ జగన్ ఏమన్నారంటే గతేడాది కంటేఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఏది ఏమైనప్పటికీ ప్రతిరోజు 3లక్షల బీర్ కేసులు అమ్ముడవుతున్నాయి అంటే మన వాళ్ళు ఏ రేంజ్ లో బీర్ లను ఖాళీ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పోటీ పడి మరీ బీర్లు తాగేస్తున్న మందు బాబులు ఈ సీజన్ లో గతేడాది కంటే ఎక్కువ ఆదాయాన్నే ప్రభుత్వానికి అందించేలా ఉన్నారు.

# కొనసాగుతున్న కగార్ ఆపరేషన్

**(1వపేజీ తరువాయి)** ఆపరేషన్ కొనసాగుతోంది. దాదాపు 24 వేల మంది జవాన్లు కర్రెగుట్టను చుట్టుముట్టారు. 800 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతం మొత్తం జవాన్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది. గుట్టలో తలదాచుకున్న 1000 మంది మావోయిస్టుల కోసం జవాన్లు వెతుకుతున్నారు.

లొంగిపోవాలని.. లేకపోతే ముప్పు తప్పదని గుట్టలో దాక్కున్న మావోయిస్టులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ అయ్యాయి. జవాన్లు కర్రెగుట్టలోని పలు మావోయిస్టుల స్థావరాలను కనిపెట్టారు. గత వారం రోజుల నుంచి మావోయిస్టులు, జవాన్ల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ కాల్పుల్లో ఏప్రిల్ 24వ తేదీన ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయారు. వారి బాడీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ముగ్గురి కంటే ఎక్కువ మంది మావోయిస్టులు చనిపోయి ఉంటారని తెలుస్తోంది. భద్రతా దళాలు అత్యాధునికమైన టెక్నాలజీని ఉపయోగించి ముందుకు సాగుతున్నారు. మావోయిస్టులు, నక్సల్స్ ఉచ్చుల నుంచి తప్పించుకుని సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ తెలంగాణ స్టేట్ కమిటి ది పీపుల్స్ లిబరేషన్ గొరిల్లా ఆర్మీ బెటాలియన్ నెంబర్ వన్‌తో పాటు మిగిలిన మావోయిస్టుల గ్రూపుల్ని తుదముట్టించడమే లక్ష్యంగా ఈ సెర్చ్ ఆపరేషన్ సాగుతోంది. 800 చదరపు కిలోమీటర్ల పరిధిలోని ఏరియా మొత్తం మావోయిస్టు ఫ్రీ జోన్ అయ్యే వరకు ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగనుంది. ఈ సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా కమాండో బెటాలియన్ ఫర్ రెసల్యూట్ యాక్షన్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌లకు చెందిన ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. ఐఈడీ పేలుళ్లు సంభవించటంతో వారికి గాయాలు అయ్యాయి. డీ హైడ్రేషన్ కారణంగా మరో ఆరుగురు జవాన్లు ఆస్పత్రి పాలయ్యారు. మావోయిస్టు కదలికలను గుర్తించేందుకు డ్రోన్లు సైతం రంగంలోకి దిగాయి.

# చర్చల ద్వారా పరిష్కరించాలి:సీతక్క

రిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నానని తెలిపారు.

మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగలవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. తెలంగాణ, చత్తీస్గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు.

అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటున్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ బృందం కలిసింది.

కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు.

# భూదాన్ లాండ్ స్కాం

**(1వపేజీ తరువాయి)** జాబితా నుండి పేర్కొన్న భూమిని డి-నోటిఫై చేయడంతో పాటు కొన్ని ప్రైవేట్ పార్టీలకు విక్రయించారు.

ఖాదేరునిస్సా, మహమ్మద్.. మునావర్ ఖాన్, మహమ్మద్.. లతీఫ్ షర్ఫాన్, మహమ్మద్.. అక్తర్ షర్ఫాన్, మహమ్మద్.. సుకూర్‌లు ప్రభుత్వ భూమిని మోసపూరితంగా అమ్మకాలు, కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశాము. 23 లక్షల రూపాయల నగదు, విదేశీ కరెన్సీ 12000 దిర్హామ్ సీజ్ చేశాము. మహమ్మద్ ఫామ్‌హౌస్లో 45 కార్లు స్వాధీనం చేసుకున్నాము. ఈ కేసుకు సంబంధించి ఇంకా విచారణ కొనసాగుతుంది' అని అన్నారు.

# చిత్రం..విచిత్రం

**(1వపేజీ తరువాయి)** చేసింది. ఈ జిల్లాలలో వడగాలులు... జాగ్రత్త ఈ జిల్లాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ఉత్తర తెలంగాణ జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కొమరం భీం, ఆసిఫాబాద్ జిల్లాలలో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. %ూశ్రీంశీ =ఝు‌ం% ఎండల దెబ్బకు బీర్లకు డిమాండ్.. తెలంగాణాలో రోజుకు ఎంత తాగుతున్నారో తెలుసా? రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు ఈ జిల్లాలలో ప్రజలు ఎండ సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదని సూచించారు. ఇక ఇప్పటికే ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ అకాల వర్షాల వల్ల పంట నష్టం జరుగుతుందని రైతులలో ఆందోళన కనిపిస్తుంది.

# అందాల పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**(1వపేజీ తరువాయి)** సూచించారు. అంతే కాకుండా పోటీలలో పాల్గొనేవారికి తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే విధంగా హెూటళ్లలో 'వెల్కమ్ కిట్స్', స్పెషల్ మెనూలు, పర్సనలైజ్డ్ హాస్పిటాలిటీని అందించాలన్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు హెూటళ్ల వద్ద ప్రత్యేక భద్రతా బలగాలు, మహిళా పోలీస్‌లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ప్రణాళికలు రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. పోలీస్ శాఖ అధినేతలతో సమన్వయంతో సీసీటీవీలు, ఫేస్ రికగ్నిషన్ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగించాలన్నారు. మరోవైపు తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఎన్డీఎస్ఏ నివేదికపై సిగ్గుపడని బీఆర్ఎస్ నేతలు

**(1వపేజీ తరువాయి)** ఏర్పాటు చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్ లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్ కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయింది" అని ఉత్తమ్ మండిపడ్డారు.

# చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం

**(1వపేజీ తరువాయి)** 2 వరకు పైలట్ ప్రాజెక్టు మండలాల్లోని భూసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు మాట వినలేదని కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేశారని విమర్శించారు. పది రోజుల్లోనే గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# చైనా రెస్టారెంట్లో భారీ అగ్ని ప్రమాదం

**(1వపేజీ తరువాయి)** వెళ్లింది. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ టీమ్ సిబ్బంది గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. అగ్ని మాపక దళాలు మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశాయి. పోలీసులు చనిపోయిన 22 మంది మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంపారు. ఇక, ఈ సంఘటనపై చైనా అధ్యక్షుడు క్షి జిన్‌పింగ్ స్పందించారు. గాయపడ్డవారికి సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయితే, రెస్టారెంట్లో మంటలు చెలరేగడానికి కారణం ఏంటన్నది తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బీజేపీ రాజ్యసభ అభ్యర్థి

**(1వపేజీ తరువాయి)** వర్గాలు తెలియజేశాయి. ఇప్పటికే భూపతిరాజు శ్రీనివాసవర్మ రూపంలో సాధారణ కార్యకర్తకు ఎంపీగా, కేంద్రమంత్రిగా అవకాశం కల్పించిన బీజేపీ.. ఇప్పుడు పాకా సత్యనారాయణ ఎంపికతో మరో మెసేజ్ పంపినట్లవుతోంది. మరో మూడున్నరేళ్లు ఆయన ఎంపీగా కొనసాగబోతున్నారు. ఎమ్మెల్యేల కోటాలో పాకా సత్యనారాయణ ఎంపీ కావడం లాంఛనమే.

# ఆ 41 మందికి నో ఛాన్స్

**(1వపేజీ తరువాయి)** పుల్లట్ల పూర్తిస్థాయిలో సర్వే బయటపెడతారా లేక ఇలా హింట్స్ తో సరిపెడతారా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో భారీ అంచనాలతో 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత మాత్రం అంచనాలకు తగినట్లుగా పనిచేయలేకపోతోందన్న చర్చ రాష్ట్రంలో జరుగుతోంది. ముఖ్యంగా గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్ని పూర్తి స్థాయిలో అటకెక్కించేయడం, దీనిపై ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం వంటివి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతున్నాయి. గతంలో ప్రవీణ్ పుల్లట కూడా తన ట్వీట్ లో పల్లెల్లో డబ్బులు రొటేషన్ కావడం లేదని, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడమే దీనికి కారణమని వెల్లడించారు.

## ఇంటర్ చదివిన వ్యక్తితో కూతురి ప్రేమ..

**ముంబై-నవభూమి:** కిరణ్ కూతురు త్రిప్తి ఎంబీబీఎస్ చదివింది. ఆమెకు అవినాష్ వాగ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ విషయం త్రిప్తి ఇంట్లో తెలిసింది. అవినాష్ ఇంటర్ మాత్రమే చదవటంతో కిరణ్ వారి పెళ్లికి ఒప్పుకోలేదు.అందరినీ కాదని అతడితో వెళ్లిపోయింది. పెళ్లి చేసుకుని సంతోషంగా జీవిస్తోంది. ఇలాంటి సమయంలో తండ్రి రాక్షసుడిలా మారాడు. కూతుర్ని తుపాకితో కాల్చి చంపేశాడు. అల్లుడిపై కూడా కాల్పులు జరిపి గాయపరిచాడు. ఈ సంఘటన నార్త్ మహారాష్ట్రలోని చోప్డ తెహ్సిల్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల దర్యాప్తులో ఆ తండ్రి కూతుర్ని ఎందుకు చంపాడో తేలింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
బుధవారం
30 । ఏప్రిల్ । 2025



## దివ్యాంగుల కేంద్రానికి హెడ్గేవార్ పేరు..రణరంగంగా మారిన కౌన్సిల్ సమావేశం



**తిరువనంతపురం-నవభూమి:** పాలక్కాడ్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మంగళవారంనాడు రణరంగంగా మారింది. దివ్యాంగుల కేంద్రం కోసం ప్రతిపాదిత స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌కు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేబీ హెగ్డేవార్ పేరు పెట్టాలనే తీర్మానంపై సమావేశంలో తీవ్ర గందరగోళం తలెత్తింది. ఈ ప్రతిపాదనను కాంగ్రెస్, వామపక్ష సభ్యులు వ్యతిరేకించారు. పాలక్కాడ్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన అధికార బీజేపీ సభ్యులకు, యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ కౌన్సిలర్లకు మధ్య వాగ్వాదం చెలరేగింది. ఇది ఘర్షణగా మారడంతో సభ్యులు ఒకరిపై మరొకరు చెప్పులతో దాడి చేసుకున్నారు. ఈ గందరగోళం మధ్యే తీర్మానాన్ని బీజేపీ ఆమోదించింది. ఈ చర్య విపక్ష కౌన్సిలర్లను మరింత ఆగ్రహానికి గురిచేసింది. ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్నారుఈ ఘటనను పాలక్కాడ్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, బీజేపీ నేత కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఉద్దేశపూర్వకంగానే సభా కార్యక్రమాలను అడ్డుకున్నారని ఆరోపించారు. దివ్యాంగుల కోసం స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రం ప్రారంభించాలని పాలక్కాడ్ మున్సిపాలిటీ నిర్ణయించిందని, దానిని కూడా కాంగ్రెస్, బీజేపీ సభ్యులు అడ్డుకున్నారని చెప్పారు. చర్చల కోసం మంగళవారంనాటి కౌన్సిల్ సమావేశానికి అన్ని పార్టీలను చైర్మన్ ఆహ్వానించారని, చర్చలో పాల్గొనడానికి బదులుగా విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి చైర్మన్‌పై చేయి చేసుకునేందుకు, మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

## పాకిస్థాన్‌కు ఆర్థికంగా ఉచ్చు బిగిస్తున్న భారత్.. ఆ దేశ దిగుమతులపై కన్ను..!




**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి తో భారత్-పాకిస్థాన్ ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో దాయాదికి తగిన బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమైంది. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ దేశాన్ని అన్నివైపుల నుంచి దిగ్బంధించేలా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఎగుమతి చేసే ఔషధాలు, ఫార్మా ఉత్పత్తులు వివరాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సేకరిస్తోంది. ఆ వివరాలను అత్యవసరంగా పంపాలని ఫార్మా ఎక్స్‌పోర్ట్ బాడీ ఫార్మెక్సిల్‌ను కోరింది. తాము పాకిస్థాన్‌కు ఎగుమతి చేస్తున్న ఫార్మా ఉత్పత్తుల డేటాను కోరామని, ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆ దిశగా పనిచేస్తోందని, త్వరలో ఆ వివరాలు పంపనుందని డిపార్టుమెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి జాతీయ మీడియాకు తెలిపారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. భారత ఫార్మా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న 219 దేశాల్లో పాకిస్థాన్ 38వ స్థానంలో ఉందని అన్నారు.పాకిస్థాన్‌కు దుబాయ్ ఒక ప్రధాన వాణిజ్య కేంద్రమని, భారత్ నుంచి యూఏఈకి ఎగుమతి అయ్యే ఔషధాలను తిరిగి పాకిస్థాన్ దిగుమతి చేసుకుంటుందని, భారత్ ఈ వాణిజ్య సంబంధాలను తెంచుకోవడం ద్వారా పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం పడనుందని మరో అధికారి అంచనా వేశారు. కాగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తీవ్ర ఒత్తిడికి గురికావడం ఇదే తొలిసారి కాదు. బాలాకోట్ వైమానిక దాడులు, ఆర్టికల్ 370 రద్దు తర్వాత కూడా ఈ పరిస్థితులు కనిపించాయి.మరోవైపు పాకిస్థాన్‌కు ఎలక్ట్రానిక్స్, ఈ-కామర్స్ వస్తువుల ఎగుమతిని కూడా పరిమితం చేయాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాటిపై ఆంక్షలు విధించే దిశగా యోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య డెరెక్ట్ వాణిజ్యం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండదు. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ తదితర దేశాల నుంచి భారత్ వస్తువులు పాకిస్థాన్‌కు చేరుతుంటాయి. వాటిలో బంగారం, విలువైన రంగురాళ్లు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్ ఉత్పత్తులు ఉన్నాయి.గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ డేటా ప్రకారం.. ఈ థర్డ్ కంట్రీస్ ద్వారా పది బిలియన్ డాలర్లకుపైగా విలువైన భారత వస్తువులు దాయాదికి ఎగుమతి అవుతున్నాయి. ఈ నెల 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.

## కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో ఉండాలి.. ఉగ్రదాడి ఘటనపై హీరో అజిత్



**న్యూఢిల్లీ-నవభూమి:** పెహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటనపై కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ తాజాగా స్పందించారు. పర్యాటకులపై జరిగిన ఆ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అజిత్ పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. అనంతరం అజిత్ మాట్లాడుతూ.. పెహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండించారు. ప్రజలంతా ఒకరినొకరు గౌరవించుకోవాలని సూచించారు. కుల, మతాలకు అతీతంగా ఐకమత్యంతో ఉండాలన్నారు. పెహల్‌గామ్ వంటి దారుణమైన ఘటనలు దేశంలో మరోసారి జరగకూడదని ఆశిస్తున్నట్లు చెప్పారు. పద్మ అవార్డుల కార్యక్రమంలో సాయుధ దళాలను కలిసినట్లు చెప్పారు. వారి త్యాగాలను మెచ్చుకున్నారు. వారందరి కారణంగానే మనం ప్రశాంతంగా నిద్ర పోగలుగుతున్నాం అంటూ అజిత్ చెప్పుకొచ్చారు.

## కస్టడీ డెత్ కేసులో మాజీ ఐపీఎస్‌కు బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** మాజీ ఐపీఎస్ ఆఫీసర్ సంజీవ్ భట్‌కు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టునిరాకరించింది. ఓ కస్టడీ డెత్ కేసులో అతను జైలుశిక్ష అనుభవి స్తున్నారు. బెయిల్ కోసం పెట్టు కున్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో తీర్పును ఇచ్చింది. బెయిల్ ఇవ్వకున్నా.. ప్రాధాన్యత ఆధారంగా అభ్యర్థనపై విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. సంజీవ్ భట్‌కు బెయిల్ ఇచ్చేందుకు ఆసక్తిగా లేమని, బెయిల్ అప్పీల్‌ను తిరస్కరిస్తున్నామని, అయితే కేసులో విచారణ కొనసాగుతుందని బెంచ్ తెలిపింది.1990లో జామ్‌నగర్ జిల్లాకు అదనపు ఎస్పీగా ఉన్న సమయంలో కస్టడీ డెత్ ఘటన జరిగింది. టాడా చట్టం కింద 133 మందిని అప్పట్లో అరెస్టు చేశారు. రథయాత్ర చేస్తున్న అద్వానీని అరెస్టు చేయడంతో.. బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలు అక్టోబర్ 30వ తేదీన బంద్‌కు పిలుపుఇచ్చారు. అయితే అరెస్టు అయిన వ్యక్తుల్లో ప్రభుదాస్ వైష్ణాని కస్టడీ నుంచి రిలీజైన తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. కస్టడీలో ఉన్న సమయంలో భట్ పెట్టిన టార్చర్ వల్లే ప్రభుదాస్ చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ ఘటనలో భట్‌పై కేసు నమోదు చేశారు. ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు కానిస్టేబుళ్లపై ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నారు.జామ్‌నగర్‌లోని సెషన్స్ కోర్టు భట్‌తో పాటు ఇతర పోలీసులకు జీవిత ఖైదు శిక్ష వేసింది. జనవరి 2024లో భట్ అప్పీల్‌ను గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో అతను సుప్రీంను ఆశ్రయించాడు. భట్‌పై మరో రెండు కేసులు కూడా ఉన్నాయి. 1996 డ్రగ్స్ కేసుతో పాటు 1997 కస్టడీ డెత్ కేసులున్నాయి.


# పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాక్ ఆర్మీ.. వెలుగులోకి సంచలన నిజాలు!



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించి తాజాగా సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ సైన్యం హస్తం ఉందన్నట్లుగా కొన్ని ఆధారాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరుల్లో ఉన్న ఒక వ్యక్తి.. ఒకప్పటి పాకిస్తాన్ ఆర్మీ ప్రత్యేక దళాల్లో పారా కమాండర్‌గా ట్రైనింగ్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడే ఒకప్పటి పాక్ పారా కమాండో హాషీమ్ మూసా అని తెలుస్తోంది. ఇక దాడి తర్వాత ఉగ్రవాదులు తప్పించుకున్న విధానాన్ని బట్టి చూస్తే వారికి హై లెవల్ ట్రైనింగ్, స్కిల్స్ ఉన్నాయని భద్రతా బలగాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. పహల్గామ్‌లో మారణహోమం సృష్టించిన ముగ్గురు ఉగ్రవాదుల్లో హాషీమ్ మూసా ఒకడని భావిస్తున్నారు.పహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు.. అత్యాధునిక ఎం 4 రైఫిల్స్‌ను ఉపయోగించడం కూడా ఈ అనుమానాలు మరింత బలపడేలా చేస్తున్నాయి. వారికి హాషీమ్ మూసా ట్రైనింగ్ ఇచ్చారనే అనుమానాలు మరింత ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి అత్యాధునిక ఆయుధాలను వినియోగించేందుకు ఉగ్రవాదులకు ప్రత్యేక శిక్షణ అవసరమని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం హాషీమ్ మూసా లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తున్న ఒక కరుడుగట్టిన ఉగ్రవాది అని తెలుస్తోంది. భారత్‌లోని భద్రతా దళాలు, పౌరులపై దాడులు చేయడానికి లష్కరే తోయిబా సంస్థ అతడిని జమ్మూ కాశ్మీర్‌కు పంపించిందని పలు నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ పహల్గామ్ ఉగ్రదాడి మాత్రమే కాకుండా గతంలో కాశ్మీర్‌లో జరిగిన 3 కీలక దాడుల్లో కూడా హాషీమ్ మూసా సూత్రధారిగా ఉన్నాడని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. అతడి వ్యూహాత్మక ఆలోచనలు, ఆయుధ శిక్షణ అతడిని అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదిగా మార్చాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా అతడిని కనిపెట్టాలని భద్రతా దళాలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగానే ప్రస్తుతం హాషీమ్ మూసా కదలికలపై గట్టి నిఘాను ఉంచాయి. అతడిని పట్టుకోవడం ద్వారా కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఈ పహల్గామ్ ఉగ్రదాడి ఘటనతో కాశ్మీర్ ప్రాంతంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు.

# జమ్ముకశ్మీర్‌లో భయం భయం

## ఆ 48 పర్యటక ప్రాంతాలు మూసివేత.. ఎందుకంటే?



**జమ్ము కశ్మీర్:నవభూమి:** ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు మొత్తంగా 26 మంది అమాయక పర్యటకుల ప్రాణాలు తీయగా.. భద్రతా బలగాలు అప్రమత్తం అయ్యాయి. టెర్రరిస్టులను పట్టుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్నాయి. ముఖ్యంగా ఉగ్రవాదుల ఇళ్లను పేల్చేస్తున్నారు. దీంతో ముష్కరులు సైతం అప్రమత్తమై మరిన్ని పర్యటక కేంద్రాలపై దాడులకు పాల్పడేందుకు ప్రణాళికలు రచిస్చున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. ఈక్రమంలోనే అప్రమత్తమైన అధికారులు జమ్ము కశ్మీర్‌లోని 48 పర్యటక ప్రాంతాలను మూసివేసారు. అవి ఏయే ప్రాంతాలు, పహల్గాం ఉగ్రదాడితో భారత సైన్యం అప్రమత్తమైంది. ముఖ్యంగా దాడికి పాల్పడిన ముష్కరులను పట్టుకునేందుకు తీవ్రంగా గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు చేతికి చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నారు ఉగ్రవాదులు. చిక్కటి అడవుల్లోకి వెళ్తూ భద్రతా బలగాలపై కాల్పులకు కూడా తెగబడ్డారు. మరోవైపు ఉగ్రవాదుల ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న భారత సైన్యం.. వాటిని పేల్చేశాయి. దీంతో ప్రతీకారంగా వారు మరిన్ని ఉగ్రదాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాలకు తెలిసింది. దీంతో అప్రమత్తమైన అధికారులు స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు.
స్థానిక ప్రజలతో పాటు పర్యటకులు సైతం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే.. భద్రతా బలగాలకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ముందస్తు భద్రతా చర్యల్లో భంగాగా కశ్మీర్‌లో ఉన్న 48 పర్యటక కేంద్రాలను మూసివేశారు. మొత్తంగా ఇక్కడ 87 టూరిస్ట్ ప్రాంతాలు ఉండగా.. అందులో 48 మూసేశారు. మరో 39 మాత్రమే ప్రస్తుతం తెరిచి ఉన్నాయి. ముఖ్యంగా కశ్మీర్‌లోని ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలు సహా పలు సున్నితమైన పర్యటక ప్రదేశాల్లో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకునేందుకు తీవ్ర చర్యలు చేపట్టారు.మరోవైపు పహల్గాం ఉగ్రదాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు సాగిస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన పలు వీడియోలు, సమాచారం అందగా.. వాటి ఆధారంగానే ఉగ్రవాదులను గుర్తించడానికి విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఉగ్రదాడి ప్రదేశంలో సీన్ రీక్రియేట్ చేస్తున్నట్లు రీడా తెలుస్తోంది. ముఖ్యంగా ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న పర్యాటకులు, స్థానిక ప్రజలను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోలను కూడా క్షణ్ణంగా పరిశీలిస్తున్నారు. అందులో ఏ ఒక్క చోటైనా ఉగ్రవాదులు కనిపించే అవకాశం ఉండండతో నిశితంగా చూస్తున్నారు. దీని వల్ల ఉగ్రవాదులకు సంబంధించి పూర్తి విషయాలు తెలిసే అవకాశం ఉంది.

## పహల్గాం దాడిలో పాల్గొన్న ఆ ఉగ్రవాది పాకిస్థాన్ మాజీ కమాండో..!



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి లో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడు పాకిస్థాన్ (మాజీ సైనికుడని తెలిసింది. హాషీమ్ మూసా అనే ఉగ్రవాది గతంలో పాకిస్థాన్ సైన్యంలోని ప్రత్యేక దళంలో పారా కమాండోగా పనిచేశాడని దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు తెలిపాయి. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. లష్కరే తోయిబా సూత్రధారులే మూసాను కశ్మీర్‌కు పంపినట్లు తెలిపాయి.ఇప్పటికే ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో భారత సైన్యం వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వారిలో 15 మంది టెర్రరిజం ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. 'హిషీమ్ మూసా పాకిస్థాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలిసింది' అని దర్యాప్తు బృందానికి చెందిన ఓ అధికారి మీడియాతో అన్నారు. ఉగ్రవాదులకు, పాకిస్థాన్ సైన్యానికి మధ్య ఉన్న సంబంధాలకు ఇది నిదర్శనమని చెప్పారు.కాగా పాకిస్థాన్ పారా కమాండోలు అత్యాధునిక శిక్షణ పొందుతున్నారు. వీరు సంప్రదాయేతర యుద్ధతంత్రం, కోవర్ట్ ఆపరేషన్లలో దిట్టలు. శిక్షణ సమయంలోనే వీరిని మానసికంగా, శారీరకంగా బలోపేతం చేస్తారు. దాంతోపాటు యుద్ధరంగంలో ఎత్తుగడలు నేర్పిస్తారు. అత్యాధునిక ఆయుధాల వినియోగంలోను, నేరుగా చేతులతో పోరాడటంలోను వాళ్లు నిపుణులు. పహల్గాం దాడిలో పాల్గొన్న వారిలో కొందరు గతంలో గగన్‌నగర్, గందేర్‌బల్ అడవుల్లో ఆరుగురు స్థానికేతరులు, ఒక డాక్టర్‌ను, ఇద్దరు సైనిక పోర్టర్లను హత్య చేసిన ఘటనల్లోనూ పాల్గొన్నారు. హాషిమ్ మూసా మాత్రం ఈ మూడు దాడుల్లోను పాల్గొన్నాడు. ఇక జునైద్‌భట్, అర్బాజ్ మిర్ కూడా పాకిస్థాన్‌లో శిక్షణ పొందినట్లు గుర్తించారు.పహల్గాంకు చేరుకునేందుకు ఉగ్రవాదులు దాదాపు 22 గంటలపాటు ట్రెక్కింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ ప్రణాళికను అమలుచేసేందుకు కోకెర్నాగ్ అడవుల నుంచి బైసరన్ లోయ వరకు కాలి నడకన వచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఉగ్రవాదులు సైనిక శిక్షణ పొందారనడానికి ఇది కూడా ఒక నిదర్శనం. ఈ ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు భారత సైన్యం ముమ్మరంగా వేటాడుతోంది. వాళ్లు భద్రతా దళాల నుంచి నాలుగుసార్లు త్రుటిలో తప్పించుకున్నారు. త్వరలోనే వాళ్ల కథ ముగుస్తుందని అధికారులు చెబుతున్నారు.

## ముంబైలో భారీ అగ్నిప్రమాదం.. క్రోమా షోరూమ్‌లో ఎగసిపడిన మంటలు

**ముంబై-నవభూమి:** ముంబైలోని బాంద్రాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున బాంద్రా వెస్ట్‌లోని లింక్ స్క్వేర్ షాపింగ్ మాల్ బేస్‌మెంట్‌లో ఉన్న క్రోమా షోరూమ్‌లో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి షో రూమ్ మొత్తం వ్యాపించడం తో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. మంటలు క్రమంగా మాల్ మొత్తానికి విస్తరించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగలు అలముకున్నాయి. సమా చారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 12 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్ని స్తున్నారు.ఉదయం 4.11 గంటలకు అగ్నిప్రమాదానికి సంబంధించిన సమాచారం అందిందని ముంబై ఫైర్ బ్రిగేడ్ వెల్లడించింది. రెండు గంటల్లోనే మంటలు బిల్డింగ్ మొత్తానికి ప్రమాదకర స్థాయికి వ్యాపించాయన్నారు. జీం3గా ఉన్న షాపింగ్ మాల్ భవనంలో మొదటి మూడు అంతస్తుల్లో క్రోమా షోరూమ్ ఉన్నదని చెప్పారు.

# పహల్గామ్ దాడిపై టూరిస్ట్ వీడియో వైరల్



**జమ్ము కశ్మీర్:నవభూమి:** ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది గాయపడ్డారు. అయితే, ఈ దాడికి సంబంధించి ఓ పర్యాటకుడి వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. పర్యాటకుడు జిప్‌లైన్‌పై రైడ్ ఎంజాయ్ చేస్తుండగా.. అతడికి తెలియకుండానే ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్న దృశ్యాలు వీడియోలో రికార్డ్ అయ్యాయి. గుజరాత్‌కు చెందిన పర్యాటకుడు రిషి భట్ తీసిన జిప్‌లైన్ వీడియోలో ఉగ్రదాడి దృశ్యాలు ఈ కేసులో కీలక ఆధారంగా మారాయి. రిషి భట్ ప్రకారం.. జిప్‌లైన్ ఆపరేటర్ 'అల్లాహు అక్బర్' అని అరవగానే ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు ప్రారంభించారు. దీంతో దర్యాప్తులో ఇప్పుడు జిప్‌లైన్ ఆపరేటర్‌పై ఫోకస్ పెట్టారు.

ఎవరీ రిషి భట్?

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరానికి చెందిన రిషి భట్.. తన, కుమారుడితో కలిసి పహల్గామ్‌లోని బైసరన్ లోయ సందర్శనకు వెళ్లారు. అదే సమయంలో ఉగ్రదాడి జరిగింది. ముష్కరుల దాడి నుంచి తన కుటుంబం ఎలా తప్పించుకున్నారో అతడు వివరించారు. జిప్‌లైన్ చేస్తున్న సమయంలో ఆపరేటర్ 'అల్లాహు అక్బర్' అని మూడుసార్లు అరించిన తర్వాత కాల్పులు ప్రారంభమయ్యాయని భట్ అనుమానం వ్యక్తం చేశారు.'నా ముందు తొమ్మిది మంది జిప్‌లైన్ చేశారు. అప్పటివరకు ఆపరేటర్ ఏమీ చెప్పలేదు.. నేను జిప్‌లైన్ చేస్తుండగా అతను అరవగానే కాల్పులు మొదలయ్యాయి. అతడిపై నాకు అనుమానం ఉంది' అని ఆయన అన్నారు. 20 సెకన్లలోనే ఇది ఉగ్రదాడి అని గ్రహించామని, ఐదారుగురు కాల్చి చంపడం నేను చూశాను' అని ఆయన చెప్పారు.వెంటనే తన జిప్‌లైన్ బెల్ట్ తీసేసి, భార్య, కుమారుడిని వెంటబెట్టుకుని దూరంగా పరుగెత్తి.. ఉగ్రవాదులకు కనిపించకుండా ఓ లోతైన గుంట దగ్గర దాక్కుని ప్రాణాలు దక్కించుకున్నామని భట్ తెలిపాడు

భయపడేది లేదు.. పహల్గామ్‌కు మళ్లీ

పర్యాటకుల తాకిడి'మా ముందు ఉన్న రెండు కుటుంబాలలోని పురుషులను మతం ఏదని.. ముస్లిం అయితే కల్మా చదవాలని అడిగి, తక్షణమే కాల్చి చంపారు. ఇది నా భార్య, కుమారుడు కూడా చూశారు. వారు భయంతో అరవడం మొదలుపెట్టారు.. కాల్పులు 8-10 నిమిషాలు కొనసాగాయి. కాసేపు నిశ్శబ్దం తర్వాత మళ్లీ కాల్పులు ప్రారంభమయ్యాయి.. మా కళ్లముందే 15-16 మంది పర్యాటకులను కాల్చి చంపారు' అని ఆయన పేర్కొన్నారు.గేట్ వద్దకు వచ్చేసరికి స్థానిక ప్రజలు అప్పటికే భయంతో పరారయ్యారని, భారత సైన్యం 20-25 నిమిషాల్లో అక్కడికి చేరిందని రిషి భట్ అన్నారు. 'భారత సైన్యం వచ్చి మాకు రక్షణ ఇచ్చింది. అప్పుడే మాకు కొంచెం భద్రంగా అనిపించుకుంది. భారత సైన్యానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని రిషి భట్ అన్నారు.

# ప్రపంచంలోనే ఐదో ప్లేస్.. పాక్ కంటే భారత్ రక్షణ బడ్జెట్ ఎన్ని రెట్లు ఎక్కువంటే?



**జమ్ము కశ్మీర్:నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లోని అనంత్ నాగ్ జిల్లా పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకుంది. ఈ తరుణంలో ఇరు దేశాల రక్షణ రంగం కోసం ఎంత ఖర్చు చేస్తున్నాయి.. సైనిక బలబలాలు ఏంటి? అనేది చర్చ జరుగుతుంది. అయితే, సైన్యం కోసం అధికంగా ఖర్చు చేస్తోన్న దేశాల్లో ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. పాకిస్థాన్ చేసే వ్యయం కంటే తొమ్మిది రెట్లు అధికంగా ఖర్చు చేస్తోంది. అయితే, పొరుగున ఉన్న మరో అణ్వాయుధం దేశం చైనాతో పోల్చితే ఈ వ్యయం తక్కువే. భారత్ కంటే చైనా రక్షణ రంగంపై దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ ఖర్చు పెడుతోంది. కోల్డ్‌వార్ ముగిసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయాలు ఏటా అత్యధిక వృద్ధితో రికార్డుస్థాయిలో 2,718 బిలియన్ డాలర్లకు చేరాయి. కొనసాగుతున్న యుద్ధాలు, భౌగోళిక-రాజకీయ అస్థిరతే దీనికి కారణం. ఈ క్రమంలో అమెరికా, చైనా, రష్యా, జర్మనీల తర్వాత ఐదె స్థానంలో భారత్ నిలిచింది.స్టాక్‌హోల్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం. 2024లో ప్రపంచ సైనిక ఖర్చు వాస్తవ విలువలో 9.4% పెరిగింది. ప్రపంచ మొత్తం సైనిక వ్యయంలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న దేశాల వాటా 60% (అంటే 1,635 బిలియన్ డాలర్లు).పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య నియంత్రణ రేఖ వెంబడి ఉద్రిక్తతలు, తూర్పు లడఖ్‌లో చైనా కొంత వెనక్కి తగ్గినా వాస్తవాధీన రేఖ వద్ద సుమారు 1 లక్ష మంది సైనికుల మోహరింపు కొనసాగిస్తోంది.
ఓ సీనియర్ ఆర్మీ అధికారి టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. "రెండు అణ్వాయుధ పొరుగు దేశాలతో ఇంకా పరిష్కారంకాని రెండు క్రియాశీలమైన సరిహద్దులతో ఉన్న ఏకైక దేశం భారత్ కావచ్చు. మేము ఇరుదేశాల ముప్పును దృష్టిలో ఉంచుకుని సిద్ధంగా ఉండాలి' అని చెప్పారు.
SIPRI% ప్రకారం, టాప్ 10 సైనిక వ్యయం దేశాలు:

1. అమెరికా (997 బిలియన్ డాలర్లు)
2. చైనా (314 బిలియన్ డాలర్లు)
3. రష్యా (149 బిలియన్ డాలర్లు)
4. జర్మనీ (88 బిలియన్ డాలర్లు)
5. భారత్ (%వి%6 బిలియన్ డాలర్లు- రూ.6.5 లక్షలు కోట్లు)
6. యుకే (82 బిలియన్ డాలర్లు)
7. సౌదీ అరేబియా (80 బిలియన్ డాలర్లు)
8. ఉక్రెయిన్ (65 బిలియన్ డాలర్లు)
9. ఫ్రాన్స్ (65 బిలియన్ డాలర్లు)
10. జపాన్ (55 బిలియన్ డాలర్లు)

ఈ జాబితాలో పాకిస్థాన్ 29వ స్థానంలో ఉంది. దాని సైనిక వ్యయం 10 బిలియన్ డాలర్లు.
భారత్ పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా, పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో తగినస్థాయిలో సమర్థవంతమైన ప్రతిఫలాన్ని పొందడంలో మాత్రం వెనుకబడుతోంది. ఉదాహరణకి 2025-26 సంవత్సరానికి రూ.6.8 లక్షల కోట్ల (80 బిలియన్) వార్షిక రక్షణ బడ్జెట్‌లో కేవలం 22% మాత్రమే కొత్త ఆయుధ వ్యవస్థలు, ప్లాట్‌ఫారమ్‌ల కొనుగోలుకు కేటాయించబడింది. మిగతా మొత్తం జీతాలు, రోజువారీ కార్యకలాపాలకు (34 లక్షల మందికి పైగా మాజీ సైనికులు, భద్రతా అధికారుల పెన్షన్ చెల్లింపులకు) ఖర్చవుతోంది.
భారత్ తన %+ఖా%లో కేవలం 1.9% మాత్రమే రక్షణకు కేటాయిస్తోంది, కానీ చైనా, పాకిస్థాన్ ముప్పులను ఎదుర్కొనడానికి కనీసం 2.5% ఖర్చు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా, స్వదేశీ రక్షణ పరిశ్రమ బలహీనంగా ఉండడం వల్ల భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉంది. దీని వల్ల భారత్ తన భౌగోళిక-రాజకీయ ఆశయాలకు అనుగుణంగా సైనిక సామర్థ్యాలను నిర్మించేందుకు దీర్ఘకాలిక, చక్కటి ప్రణాళికలు రూపొందించడంలో వెనుకబడుతోంది.
దీని ఫలితంగా, యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్లు, హెలికాప్టర్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, యాంటీ-ట్యాంక్ మిసైళ్లు, రాత్రి సమయంలో యుద్ధ సామర్థ్యాలు వంటి అనేక ముఖ్యమైన రంగాల్లో భారత సైనిక బలగాలు ఇంకా ప్రధాన సమస్యలతో సతమతమవుతున్నాయి.
ఇదిలా ఉండగా, చైనా తన రెండు మిలియన్ల బలగాలతో భూ, వాయు, సముద్రం వంటి సాంప్రదాయ రంగాల్లోనే కాకుండా, అణు, అంతరిక్షం, సైబర్ రంగాలలో కూడా వేగంగా ఆధునికీకరణ సాగిస్తోంది. 2024లో చైనా తన సైనిక బడ్జెట్‌ను ఏడాది ప్రాతిపదికన 7% పెంచింది, ఇది 2015 తర్వాత నమోదైన అతిపెద్ద పెరుగుదల.
సిప్రీ తెలిపిన ప్రకారం.. 2024లో చైనా అత్యాధునిక యుద్ధ విమానాలు, డ్రోన్లు, యాంత్రిక జలాంతర్గామి వాహనాలు లాంటి ఆధునిక సాంకేతికతలను అభివృద్ధి చేసింది. చైనా తన అణు ఆయుధ భండారాన్ని వేగంగా విస్తరించడమే కాకుండా, అంతరిక్ష, సైబర్ యుద్ధ సామర్థ్యాలను కూడా బలోపేతం చేసింది. 2024లో చైనా ప్రత్యేకంగా ఏరోస్పేస్ , సైబర్‌స్పేస్ బలగాలను ఏర్పాటు చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
బుధవారం
30 । ఏప్రిల్ । 2025



## భారత 'గూఢచారి డ్రోన్'ను కూల్చేశామన్న పాక్



**కెనడా-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కశ్మీర్ ప్రాంతంలో గూఢచర్యం చేస్తున్న భారత డ్రోన్ ను కూల్చేసినట్టు పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించుకుంది. కశ్మీర్‌లో లైన్ ఆఫ్ కంట్రోల్‌ను అతిక్రమించిన మానవ రహిత డ్రోన్‌ను కూల్చేశామని పాక్ భద్రతా వర్గాలను ఉటంకిస్తూ పాక్ టెలివిజన్ ఒక వార్తను ప్రసారం చేసింది.సరిహద్దుల వద్ద నిఘా కోసం చిన్న చిన్న డ్రోన్‌లను ఉపయోగించడం, వాటిని కూల్చేసినట్టు ఇరువైపు సైనిక వర్గాలు ప్రకటించుకోవడం రివాజే. అయితే ఈసారి రెండు దేశాల మధ్య సంబంధాలు బాగా క్షీణించిన క్రమంలో భారత డ్రోన్‌ను కూల్చేసినట్టు పాక్ ఆర్మీ ప్రకటించడం సంచలనమవుతోంది.

యుద్ధానికి అవకాశం ఉందిదీనికి కొద్ది గంటలకు ముందే పాకిస్థాన్ రక్షణ శాఖ ఉన్నతాధికారి ఒకరు భారత్‌తో యుద్ధానికి అవకాశం ఉందని హెచ్చరించారు. రాబోయే కొద్ది రోజులు చాలా కీలకమని రక్షణ శాఖ మంత్ర ఖ్వాజా మహమ్మద్ ఆసిఫ్ 'జియో న్యూస్'తో మాట్లాడుతూ చెప్పారు. ఏదైనా జరిగితే అది రెండు మూడ్రోజుల్లో జరగవచ్చని, తక్షణ ముప్పు పొంచి ఉందని అన్నారు. అయితే ఘర్షణల నివారణకు చైనా, సౌదీ అరేబియా, గల్ఫ్ దేశాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. కాగా, మహమ్మద్ ఆసిఫ్ వ్యాఖ్యలపై భారత ఆర్మీ స్పందించలేదు.

## అమెరికన్ క్యాంపస్‌లలో భయోత్పాతం

అమెరికన్ విద్యా సంస్థలలో ఉన్న విదేశీ విద్యార్థులంతా ఇప్పుడు చాలా భయపడిపోతున్నారు. వాళ్ళని ఎత్తుకుపోవచ్చు లేదా వాళు ళ్ళుంటున్న ప్రదేశాలకు వందలాది మైళ్ళ దూరంలో ఉండే నిర్బంధ కేంద్రాలకు వాళ్ళని తరలించవచ్చు. అక్కడ ఎంతకాలమైనా నిర్బంధించవచ్చు, ఆ తర్వాత వాళ్ళని వాళ్ల స్వదేశాలకు పంపేయవచ్చు.అక్కడి చట్టాలను ఉల్లంఘించినందుకు కాదు. కేవలం అక్కడి అధికారులు వాళ్ళకి తోచినట్టు వ్యవహరించడమే కారణం. కచ్చితమైన అంచనాలు లేవు కాని కనీసం 1500 మంది విద్యార్థులకు ఇప్పటిదాకా వీసాలు రద్దయ్యాయి. వారందరినీ త్వరలో వారి వారి దేశాలకు వెనక్కి పంపేయనున్నారు. ఆ విద్యార్థులలో ఎక్కువమంది "యూదు వ్యతిరేకత"ను కనబరచినందుకుగాను వారిని లక్ష్యంగా చేసుకున్నామని అధికారులు అంటున్నారు. అయితే ఈ "యూదు వ్యతిరేకత" అంటే ఏమిటన్నది ఎవరు తేలుస్తారంటే అదంతా అక్కడి అధికారుల ఇష్టమే. ఏ యే కార్యకలాపాలు "యూదు వ్యతిరేకత"గా పరిగణించబడతాయో నిర్దేశించే నిబంధనలు కాని, పరిధులు కాని ఎక్కడా లేవు.

టఫ్ట్స్ యూనివర్సిటీ అని ఒకటుంది. అక్కడి విద్యార్థులు 'టఫ్ట్స్ డైలీ' అనే పత్రికను నడుపుతారు. ఆ పత్రికలో ఇజ్రాయిల్ నుండి పెట్టుబడులను ఉపసంహరించాలని యూనివర్సిటీని కోరుతూ ఒక సంపాదకీయ వ్యాసం మరొకరితో కలిసి రాసినందుకు ఒక విద్యార్థిని లక్ష్యంగా చేసుకున్నారు. మరొక విద్యార్థికి ఒక బంధువు ఉన్నారు. ఆ బంధువు హమాస్ కి సలహాదారుగా పని చేశారు. ఒక దశాబ్దం కిందట ఆ పదవిని వదిలేశారు. పైగా 2023లో హమాస్ చేసిన దాడిని విమర్శించారు కూడా. అయినా సరే ఈ విద్యార్థిని లక్ష్యంగా చేసుకున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు కూడా విద్యార్థులను ఇక్కట్లపాలు చేయవచ్చు. విద్యార్థుల సోషల్ మీడియా పోస్టులన్నింటినీ ఇప్పుడు అక్కడ అధికారులు పరిశీలిస్తున్నారు. వాటిని బట్టి ఎవరిని ఎత్తుకుపోవచ్చు, ఎవరిని నిర్బంధించబచ్చు, ఎవరిని వారి స్వదేశాలకు తిప్పి పంపవచ్చు అన్నది నిర్ధారించనున్నారు. దాంతో భయపడిపోతున్న విద్యార్థులు వాళ్ళ సోషల్ మీడియా పోస్టుల్ని డిలీట్ చేసే పనిలో పడ్డారు.

ఇంతకూ "యూదు వ్యతిరేకత"ను వ్యక్తం చేయడం అనేది చట్ట విరుద్ధం అని ఎక్కడా చెప్పలేదు. దానిపై చర్యలు తీసుకోవచ్చునని కూడా ఎక్కడా చెప్పలేదు. తాము లక్ష్యంగా చేసుకుని శిక్షిస్తున్న విద్యార్థులంతా అమెరికన్ విదేశాంగ విధానానికి విరుద్ధంగా పని చేస్తున్నారని మాత్రమే అధికారులు చెప్తున్నారు. అమెరికా ప్రపంచవ్యాప్తంగా యూదు వ్యతిరేకత అనేది లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని కలిగివుంది. ఆ విధానాన్ని విమర్శించే విధంగా ఏ విదేశీ విద్యార్థి అయినా మాట్లాడినా, సోషల్ మీడియా పోస్టులు పెట్టినా ఆ విద్యార్థిని వెనక్కి పంపేస్తాం అన్నది అమెరికా పాలసీగా ఇప్పుడు ఉంది.కోట్లాది మంది పాలస్తీనియన్లను నిర్వాసితులుగా మార్చి వారి భూభాగాలను స్వాధీనం చేసుకుని అక్కడ ఇజ్రాయిల్ అనే దేశాన్ని ఏర్పాటు చేసిన "ఆక్రమణ వలసవాదాన్ని" గురించి కాస్సేపు మరిచిపోదాం. గాజాలో ఒక జాతినే ఉనికిలో లేకుండా చేయడానికి ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధం, అది మానవత్వ విలువలను ఎంత ఘోరంగా నాశనం చేస్తున్నప్పటికీ, దానినీ కాస్సేపు పక్కన పెడదాం. ఈ నరమేధానికి వ్యతిరేకంగా అనేకమంది యూదు విద్యార్థులే గొంతెత్తి నిరసనలలో భాగస్వాములౌతున్నారన్న వాస్తవాన్నీ పక్కన పెడదాం. నెతాన్యహు ప్రభుత్వం గాజాలో సాగిస్తున్న దుర్మార్గాన్ని ఇజ్రాయిల్ లోని మెజారిటీ ప్రజానీకం సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నదీ పక్కన పెడదాం. "యూదు వ్యతిరేకత" వేరు. "యూదు జాత్యహంకార విస్తరణవాదం" వేరు అన్న దాన్నీ పక్కన పెడదాం. ఇక్కడ విషయం ఏమంటే అమెరికన్ ప్రభుత్వం ఎవరినైనా, ఏదో ఒక సాకుతో వెనక్కి పంపేసే హక్కు తనకు ఉన్నట్టు వ్యవహరిస్తోంది. యూదు వ్యతిరేకత అన్నది ఒక సాకు మాత్రమే. అమెరికన్ ప్రభుత్వ విధానాలతో, చర్యలతో విభేదించే ఏ అంతర్జాతీయ విద్యార్థినైనా వాళ్లు తమ దాడులకు లక్ష్యంగా చేసుకుంటున్నారు.ఇప్పుడు విదేశీ విద్యార్థుల మీద, విదేశీ ప్రొఫెసర్ల మీద-వాళ్ళు గ్రీన్ కార్డు హోల్డర్లు అయినప్పటికీ- దాడులు సాగిస్తున్న అమెరికన్ ప్రభుత్వం రేపు తన స్వంత పౌరుల మీద కూడా ఇదే మాదిరిగా దాడులు చేయదన్న గ్యారంటీ ఏమైనా ఉందా? అమెరికన్ రాజ్యాంగం లోని మొదటి అమెండ్‌మెంట్ వాక్ స్వేచ్ఛను గ్యారంటీ చేస్తుంది. గ్రీన్ కార్డు కలిగివున్న వాళ్ళకి ఇది వర్తిస్తుందా అన్న సందేహం ఉండొచ్చు. కాని ఈ రోజు గ్రీన్ కార్డు కలిగినవారి స్వేచ్ఛను నిరాకరించగలిగిన ప్రభుత్వం రేపు అమెరికన్ పౌరులకు కూడా నిరాకరించదన్న గ్యారంటీ ఏముంది? వాళ్ళు కూడా "అమెరికా వ్యతిరేకులతో" చేతులు కలుపుతున్నారన్న సాకుతో శిక్షార్హులుగా పరిగణించబడతారు కదా?

1960-70 దశకాల్లో అమెరికన్ యూనివర్సిటీల్లో వాతావరణం ఏవిధంగా ఉండేదో, దానితో పోల్చి ప్రస్తుత వాతావరణాన్ని పరిశీలిద్దాం. అమెరికాలోను, ఇతర దేశాల్లోను యూనివర్సిటీల్లో వియత్నాం మీద అమెరికా సాగిస్తూండిన యుద్ధానికి వ్యతిరేకంగా భారీ నిరసనలు తలెత్తాయి. ఎక్కడ చదువుకుంటున్న విదేశాల విద్యార్థులు అక్కడ యూనివర్సిటీల్లో జరిగిన నిరసన ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆ విదేశీ విద్యార్థులను ప్రత్యేకించి లక్ష్యం చేసుకుని బెదిరించినదీ లేదు, నిర్బంధించినదీ లేదు. మరి అప్పటికి, ఇప్పటికి వచ్చిన తేడా ఏమిటి? ఎందుకు ఇప్పుడు ఈ విధంగా విదేశీ విద్యార్థులను భయోత్పాతానికి గురిచేస్తున్నారు?

సామ్రాజ్యవాదం స్వభావంలో మార్పు వచ్చినదేమీ లేదు. అప్పుడెంత నిర్దాక్షిణ్యంగా సామ్రాజ్యవాదం ఉండేదో, ఇప్పుడూ అంతే నిర్దాక్షిణ్యంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో బలహీన పడిన సామ్రాజ్యవాదం ఆ తర్వాత కాలంలో కోలుకుని మళ్ళీ పుంజుకుంది. వియత్నాం యుద్ధంలో అమెరికా ఓడిపోయినా, సామ్రాజ్యవాదం మొత్తంగా చూసినప్పుడు తన బలాన్ని కూడగట్టుకోగలిగింది. ఒక పక్క సోవియట్ యూనియన్ నుండి సామ్రాజ్యవాదానికి తీవ్రమైన సవాలు ఎదురౌతూనే వుండేది. అయినా, ఆ సవాలును తాను తట్టుకోగలను అన్న ధీమా సంపాదించుకుంది సామ్రాజ్యవాదం. అప్పటి వైరుధ్యాలను తాను ఎదుర్కొని తనకు అనుగుణంగా మలుచుకోగలదన్న ధీమా అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఉండేదని పాల్ బేరన్, పాల్ ఎం స్వీజీ, హెర్బర్ట్ మార్కస్ వంటి మార్క్సిస్టు మేధావులు భావించారు.అప్పటి పరిస్థితికి ఇప్పటి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. అమెరికన్ సామ్రాజ్యవాదం, దానితోబాటు మొత్తం సామ్రాజ్యవాద శిబిరం ఒక సంక్షోభంలో పూర్తిగా దిగబడిపోయివుంది. ఈ పరిస్థితుల్లో తనకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా, వారందరినీ ఎలాగైనా వదిలించుకోవాలనే యావ ఈ సంక్షోభ కారణంగానే సామ్రాజ్యవాదానికి పట్టుకుంది. ఆ వ్యతిరేకత యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఉండే మేధావుల నుంచే భావాల రూపంలో వచ్చినా, దానిని సైతం సహించే పరిస్థితి సామ్రాజ్యవాదానికి లేదు. అమెరికన్ విద్యా సంస్థల క్యాంపస్‌లన్నీ ఉదారవాదులతో, వామపక్ష మూకలతో నిండిపోయి వున్నాయని, వారందరినీ వదిలించుకోవాలని ట్రంప్ ప్రభుత్వం బహిరంగంగానే ప్రకటించింది.

## ఆయుష్మాన్ భారత్: ఆరోగ్య భారతావని దిశగా అలుపెరుగని యాత్ర - డిజిటల్ వెలుగులో నవ పథం!



ఆరోగ్యమే మహా భాగ్యం అంటారు. కానీ దేశంలో కోట్లాది మందికి ఆ భాగ్యం అందని ద్రాక్షగానే మిగిలింది. స్వాతంత్ర్య ఫలాలు అందినా, వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన దయనీయ స్థితిని ఎందరో అనుభవిస్తున్నారు. ఈ దుస్థితికి తెరదాలుస్తూ, పేదరికం వైద్యానికి అడ్డుకాకూడదనే దృఢ సంకల్పంతో భారత ప్రభుత్వం ప్రారంభించిన అభినందనీయమైన పథకం ఆయుష్మాన్ భారత్ యోజన. ఇది కేవలం ఒక ఆరోగ్య బీమా పథకం కాదు. ప్రతి పౌరుడి ఆరోగ్య భద్రతకు భరోసా ఇస్తూ నవ భారత్ నిర్మాణంలో వేసిన ఒక విప్లవాత్మక అడుగు. ఏప్రిల్ 30న జరుపుకునే ఆయుష్మాన్ భారత్ దివాస్ ఈ మహత్తర లక్ష్యాన్ని గుర్తుచేస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ఒక సువర్ణావకాశం.

ఆవశ్యకత: ఆర్థిక భారం లేని ఆరోగ్య భద్రత ఆర్థిక అసమానతలు ఆరోగ్య సంరక్షణ లభ్యతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నాణ్యమైన వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యం ఒక శాపంగా పరిణమిస్తోంది. ఈ సవాలును అధిగమించి జాతీయ ఆరోగ్య విధానం 2017 సిఫార్సుల మేరకు యూనివర్సల్ హెల్త్ కవరేజ్ సాధించాలనే దార్శనికతతో ఆయుష్మాన్ భారత్ రూపుదిద్దుకుంది. "ఎవరినీ వదిలిపెట్టకూడదు" అనే స్థిరమైన అభివృద్ధి లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకం దేశ జనాభాలో అత్యంత బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది.

**ప్రారంభం, విస్తరణ:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య హామీ 2018 సెప్టెంబర్ 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జార?ండ్‌లోని రాంచీలో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు, అది ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన గానూ పిలువబడే ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య బీమా పథకంగా చరిత్ర సృష్టించింది. ఆరోగ్య సేవల పంపిణీలో సమగ్ర విధానాన్ని అవలంబిస్తూ, ప్రాథమిక స్థాయి నుండి తృతీయ స్థాయి వరకు (నివారణ, ప్రోత్సాహం, వైద్య సంరక్షణ) వ్యవస్థను బలోపేతం చేయడం దీని లక్ష్యం. ఆయుష్మాన్ భారత్ రెండు ప్రధాన భాగాలతో కూడిన నిరంతర సంరక్షణ స్వరూపం:




ఆరోగ్య వెల్నెస్ కేంద్రాలు:
ఫిబ్రవరి 2018లో ప్రారంభించిన ఈ కేంద్రాలు, ఇప్పటికే ఉన్న ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా రూపాంతరం చెందిస్తున్నాయి. సుమారు 1.5 లక్షల కేంద్రాల ఏర్పాటు లక్ష్యంతో, ఇవి మాతా, శిశు ఆరోగ్య సేవలు, ఉచిత మందులు, రోగ నిర్ధారణ సేవలు, అంటువ్యాధి కాని వ్యాధుల నిర్వహణతో సహా విస్తృత శ్రేణి సేవలను అందించడం ద్వారా ప్రజల ఇళ్లకు వైద్య సేవలను చేరువ చేస్తున్నాయి. ఆరోగ్య ప్రచారం, నివారణపై దృష్టి సారించడం ద్వారా ప్రజలను ఆరోగ్యంగా ఉంచడమే వీటి ప్రధాన ఉద్దేశ్యం.

ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన: ఆయుష్మాన్ భారత్ రెండవ, కీలక భాగం ఇది. దేశ జనాభాలో అట్టడుగున ఉన్న 40% మంది పేద, బలహీన కుటుంబాలకు (సుమారు 12 కోట్లకు పైగా కుటుంబాలు, అనగా 55 కోట్లకు పైగా లబ్ధిదారులు) ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రి చికిత్సల కోసం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ?5 లక్షల ఆరోగ్య కవరేజీని అందిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక-ఆర్థిక, వృత్తిపరమైన ప్రమాణాల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారు.

**లక్ష్యాలు:**
- దేశంలోని అత్యంత పేద, బలహీన వర్గాలకు ఆరోగ్య భద్రతను కల్పించడం.
- ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ?5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సను అందుబాటులోకి తేవడం.
- ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రి చికిత్సల భారాన్ని తగ్గించడం.
- ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తేవడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.
- 1.5 లక్షల ఆరోగ్య, సంరక్షణ కేంద్రాల ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడం.

సాధించిన ప్రగతి - విజయపథంలో మైలురాళ్లు:
ప్రారంభించిన స్వల్పకాలంలోనే ఆయుష్మాన్ భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. డిసెంబర్ 20, 2024 నాటికి, 55 కోట్లకు పైగా లబ్ధిదారులు ?5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీని పొందుతున్నారు. ఏప్రిల్ 3, 2025 నాటికి, 31,846 ఆసుపత్రులు (ప్రభుత్వ, ప్రైవేట్) ఈ పథకం కింద నమోదయ్యాయి. 40 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు జారీ చేయబడ్డాయి, 8.50 కోట్లకు పైగా ఆసుపత్రి ప్రవేశాలు నమోదయ్యాయి. సీనియర్ సిటిజన్లు (70 ఏళ్లు పైబడినవారు), ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా ఈ పథకం పరిధిలోకి వచ్చారు. ఆసుపత్రిలో చేరడానికి ముందు 3 రోజుల ఖర్చులు, డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల ఖర్చులు కూడా పథకం పరిధిలోకి వస్తాయి.

డిజిటల్ స్పర్శ: ఆరోగ్య సంరక్షణలో నవ శకం. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఈ పథకానికి సరికొత్త డిజిటల్ రూపాన్నిచ్చింది. ఇది రోగులు, వైద్యులు, ఆసుపత్రులను అనుసంధానించే ఒక ఏకీకృత డిజిటల్ ఆరోగ్య పర్యావరణ వ్యవస్థ. ఆరోగ్య రికార్డులను డిజిటల్‌గా నిర్వహించడం, ఆరోగ్య నిపుణులు, సౌకర్యాల నమోదు ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా ఇది పారదర్శకతను, లభ్యతను పెంచుతుంది. ఏప్రిల్ 5, 2025 నాటికి, 76 కోట్లకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు సృష్టించబడ్డాయి. 5.95 లక్షలకు పైగా ఆరోగ్య సంరక్షణ నిపుణులు, 3.86 లక్షలకు పైగా ఆరోగ్య సౌకర్యాలు దీని కింద నమోదయ్యాయి. 52 కోట్లకు పైగా ఆరోగ్య రికార్డులు డిజిటల్‌గా అనుసంధానించబడ్డాయి.

**అమలు, నిధులు:** జాతీయ సంకల్పానికి ప్రతిబింబం
ఈ పథకాన్ని అమలుపరిచే బాధ్యత కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ హెల్త్ అథారిటీ పర్యవేక్షిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ?86,175 కోట్లు కేటాయించింది, ఇది ఆరోగ్య రంగానికి గణనీయమైన ప్రోత్సాహం. పథకం విజయవంతమైన అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం తప్పనిసరి. కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు అమలులో ముందంజలో ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా తమ పరిధిలో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నాయి. ఈ పథకం ప్రతి సంవత్సరం సుమారు 6 కోట్ల మంది భారతీయులు వైద్య ఖర్చుల వల్ల పేదరికంలోకి జారిపోకుండా రక్షిస్తోంది.

సవాళ్లు, పరిష్కారాలు: ముందడుగు వేస్తూ గొప్ప లక్ష్యంతో ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ అమలులో కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, నాణ్యమైన వైద్య సదుపాయాల కొరత, ముఖ్యంగా నిపుణులైన వైద్యులు, అధునాతన పరికరాల లభ్యత ఒక సమస్య. ప్రైవేట్ ఆసుపత్రుల పూర్తిస్థాయి భాగస్వామ్యం ఇంకా ఆశించిన స్థాయిలో లేదు. నిధుల విడుదల, మోసాల నివారణ, తీవ్రమైన వ్యాధుల చికిత్సలు పథకం పరిధిలోకి రాకపోవడం, పట్టణ-గ్రామీణ వ్యత్యాసాలు ఇతర సవాళ్లు.

**పరిష్కారాలు:** ఈ సవాళ్లను అధిగమించడానికి పరిష్కార మార్గాలు కూడా స్పష్టంగా ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంచడానికి స్థానిక భాషల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. వైద్య సదుపాయాలను మెరుగుపరచడానికి పెట్టుబడులు పెంచి, టెలిమెడిసిన్ వంటి సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించాలి. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకాలు అందించి, వారి భాగస్వామ్యాన్ని పెంచాలి. మోసాలను అరికట్టడానికి సాంకేతికత ఆధారిత నిఘా, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. అవసరమైన అన్ని చికిత్సలను పథకం పరిధిలోకి తీసుకురావడానికి నిరంతరం సమీక్షించాలి. ఆసుపత్రుల పనితీరును అంచనా వేస్తూ, నాణ్యమైన వైద్యం అందించేలా కఠిన ప్రమాణాలు అమలు చేయాలి. పథకం అమలును పర్యవేక్షించడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఒక బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**ఆరోగ్య భారతావని కల సాకారం దిశగా..**
ఆయుష్మాన్ భారత్ యోజన భారతదేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక చారిత్రాత్మక పథకం. దీనికి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ తోడవ్వడం ఆరోగ్య సంరక్షణను మరింత సులభతరం, పారదర్శకం, అందుబాటులోకి తెస్తుంది. ఈ పథకం యొక్క పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలి. సవాళ్లను అధిగమిస్తూ, లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకు సాగితే, ఆర్థిక భారం లేని ఆరోగ్య భారతావని కల త్వరలోనే సాకారమవుతుంది. ఆయుష్మాన్ భారత్ దివాస్ సందర్భంగా, ఈ మహత్తర యజ్ఞంలో మనందరం భాగస్వాములమవుదాం, ఆరోగ్యకరమైన, సుసంపన్నమైన భవిష్యత్తుకు బాటలు వేద్దాం.


**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

## ఉపాధ్యాయుల హక్కుల కోసం యూనియన్లు గళం ఎక్కడ పోయింది?



ఉపాధ్యాయులు సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని కలిగి ఉంటారు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే చోదకశక్తిగా పనిచేస్తారు. అయినప్పటికీ, వారి హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో ఉపాధ్యాయ యూనియన్ల గళం ఎందుకు నిశ్శబ్దంగా ఉందనే ప్రశ్న తలెత్తుతోంది. తెలంగాణలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ౹ డియర్‌నెస్ అలవెన్స్ (డి.ఏ.) బకాయిలు, పే రివిజన్ కమిషన్ (పి.ఆర్.సి.) సిఫారసుల అమలు, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఒ.పి.ఎస్.) పునరుద్ధరణ, ఉద్యోగ భద్రత, జీతభత్యాలు, పదోన్నతులు, పని పరిస్థితులు ౹ చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడంలో యూనియన్ల పాత్ర బలహీనంగా ఉండడం ఉపాధ్యాయుల ఆవేదనను మరింత తీవ్రతరం చేస్తోంది.తెలంగాణలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) బకాయిల సమస్యను ఎదుర్కొంటున్నారు. 2024 అక్టోబర్ 30న జారీ చేసిన జీఓఎంఎస్ నెం.120 ప్రకారం, డీఏ 22.75% నుంచి 26.39%కి పెంచబడింది, ఇది 2022 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ పెంపు 2024 నవంబర్ జీతంతో (డిసెంబర్ 1, 2024) చెల్లించబడుతుంది. అయితే, 2022 జూలై నుంచి 2024 అక్టోబర్ వరకు బకాయిలు నగదుగా చెల్లించకుండా, జీపీఎఫ్ ఉద్యోగుల బకాయిలు జీపీఎఫ్ ఖాతాలలో జమ చేయబడతాయి, 2025 మార్చి 31లోపు రిటైర్ అయ్యేవారికి 17 వాయిదాలలో చెల్లించబడతాయి. సీపీఎస్ ఉద్యోగులకు 10% బకాయిలు పీఆర్ఏఎన్ ఖాతాలలో జమ చేయబడి, మిగిలిన 90% 2025 జనవరి నుంచి 17 వాయిదాలలో చెల్లించబడతాయి. జీపీఎఫ్ లేని కాంటింజెంట్ ఉద్యోగులకు కూడా 17 వాయిదాలలో చెల్లింపు జరుగుతుంది.

ఈ విధానం ఉద్యోగులలో అసంతృప్తిని కలిగించింది, ఎందుకంటే వారు తక్షణ నగదు చెల్లింపు ఆశించారు. ఉద్యోగ సంఘాలు ఐదు డీఏ బకాయిల పూర్తి చెల్లింపు కోసం డిమాండ్ చేస్తున్నాయి, కానీ బలమైన ఒత్తిడి తేలేకపోయాయి. 2025 ఏప్రిల్ 9న ఒక ఎక్స్ పోస్ట్‌లో సంక్షేమ గురుకుల ఉద్యోగులు ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డీఏ పెంపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, జిల్లా పరిషత్, మునిసిపల్, విశ్వవిద్యాలయ సిబ్బంది మొదలైన వారికి వర్తిస్తుంది. జీఓ ఆధారంగా,



ఈ సమస్య ఉద్యోగులకు ప్రధాన సవాలుగా మిగిలిపోయింది. పి.ఆర్.సి. సిఫారసుల అమలు మరో ప్రధాన సమస్య. 2023 అక్టోబర్లో తెలంగాణ ప్రభుత్వం 11వ పి.ఆర్.సి.ను ఏర్పాటు చేసింది, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్. అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్‌గా, బి.రామయ్య సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ కమిటీ 2023 జూలై 1 నుంచి జీత సవరణలను సిఫారసు చేయాలి, ఆరు నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించబడింది. అయితే, 2020 పి.ఆర్.సి. సిఫారసు చేసిన 7.5% ఫిట్‌మెంట్ ఉద్యోగుల అసంతృప్తికి కారణమైంది, వారు 65% ఫిట్‌మెంట్ డిమాండ్ చేశారు. చివరకు, 2021 మార్చిలో 30% ఫిట్‌మెంట్ ప్రకటించబడింది, కానీ దీని అమలు 2021 ఏప్రిల్ నుంచి మాత్రమే జరిగింది. ఈ ఆలస్యం, తక్కువ ఫిట్‌మెంట్ ఉపాధ్యాయులలో నిరాశను కలిగించాయి. ప్రస్తుత పి.ఆర్.సి. నుంచి గణనీయమైన జీత పెంపును ఆశిస్తున్న ఉపాధ్యాయులకు యూనియన్లు బలమైన నాయకత్వం అందించలేకపోయాయి.ఒ.పి.ఎస్. పునరుద్ధరణ ఉపాధ్యాయుల మరో కీలక డిమాండ్. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు వర్తించే సి.పి.ఎస్. పెన్షన్ భద్రతను తగ్గిస్తుందని విమర్శలు ఉన్నాయి. ఒ.పి.ఎస్. పునరుద్ధరణ కోసం ఉద్యోగ సంఘాలు 2023 జూలై 16 నుంచి ఆందోళనలు చేపట్టాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఒ.పి.ఎస్.ను పునరుద్ధరించిన నేపథ్యంలో, తెలంగాణ ఉద్యోగులు ఇదే డిమాండ్‌ను బలంగా లేవనెత్తుతున్నారు. అయితే, ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించడం లేదు, యూనియన్లు ఐక్యతగా పోరాడలేకపోవడం వల్ల ఈ డిమాండ్ బలహీనంగా మిగిలిపోయింది.ఈ సమస్యలతో పాటు, సమగ్ర శిక్ష ఉపాధ్యాయుల ఉద్యోగ రెగ్యులరైజేషన్, విద్యాశాఖలో విలీనం, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత వంటి అంశాలు కూడా ఉపాధ్యాయుల ఆందోళనలకు కారణమవుతున్నాయి. 2025 జనవరిలో సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగారు.

ప్రభుత్వం సమ్మెను ఆపకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడంతో, ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. యూనియన్లు ఈ సందర్భంలో సమర్థవంతమైన నాయకత్వం అందించలేకపోయాయి, ఫలితంగా ఉపాధ్యాయుల ఆందోళనలు అణగారిపోయాయి. కానీ యూనియన్లు ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించలేకపోయాయి.యూనియన్లు ఈ సమస్యలను సమర్థవంతంగా ఎందుకు పరిష్కరించలేకపోతున్నాయి? ఒక ప్రధాన కారణం రాజకీయ ప్రభావం. వివిధ రాజకీయ పార్టీలతో అనుబంధం ఉన్న యూనియన్లు తమ సభ్యుల హక్కుల కంటే రాజకీయ లక్ష్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కొన్ని యూనియన్లు ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూ, డి.ఏ., పి.ఆర్.సి., ఒ.పి.ఎస్. వంటి సమస్యలను బలంగా లేవనెత్తడంలో విఫలమవుతున్నాయి. రెండవది, యూనియన్లలో ఐక్యత లోపం. సమగ్ర శిక్ష, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉపాధ్యాయులు తమ సమస్యలను వేర్వేరుగా లేవనెత్తడం వల్ల ఒక బలమైన ఉమ్మడి గొంతుక ఏర్పడలేదు. మూడవది, ఆర్థిక సమస్యలు. యూనియన్లు సబ్‌స్క్రిప్షన్ ఫీజులపై ఆధారపడతాయి, కానీ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు తక్కువ జీతాలతో జీవిస్తున్నందున, ఆర్థిక సహాయం అందించడం కష్టంగా మారింది. దీంతో, పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించడం లేదా సభ్యులను సమీకరించడం సమర్థవంతంగా జరగడం లేదు.సాంకేతికత కూడా యూనియన్ల పాత్రను మార్చింది. సోషల్ మీడియా ద్వారా ఉపాధ్యాయులు తమ సమస్యలను స్వతంత్రంగా లేవనెత్తుతున్నారు, కానీ ఈ ఆందోళనలు తాత్కాలిక ఒత్తిడిని తెచ్చినప్పటికీ, దీర్ఘకాలిక పరిష్కారాలను సాధించడంలో విఫలమవుతున్నాయి. ఉదాహరణకు, 2024 అక్టోబర్‌లో ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సి.) ముఖ్యమంత్రితో సమావేశమై డి.ఏ. బకాయిలపై చర్చించింది, కానీ ఈ చర్చలు ఫలితవంతం కాలేదు, ఎందుకంటే యూనియన్లు బలమైన ఒత్తిడి తేలేకపోయాయి. సోషల్ మీడియా ఆందోళనలు డి.ఏ., పి.ఆర్.సి., ఒ.పి.ఎస్. సమస్యలను హైలైట్ చేసినప్పటికీ, యూనియన్ల సమన్వయం లేకపోవడం వల్ల ఈ ప్రయత్నాలు పరిమిత ఫలితాలను ఇస్తున్నాయి.యూనియన్లు ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలంటే, సంస్కరణలు అవసరం. మొదట, రాజకీయ ప్రభావం నుంచి విముక్తి పొంది, డి.ఏ., పి.ఆర్.సి., ఒ.పి.ఎస్., ఉద్యోగ భద్రత వంటి సమస్యలపై మాత్రమే దృష్టి సారించాలి. రెండవది, అన్ని ఉపాధ్యాయ వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాలి, ఉమ్మడి డిమాండ్లను బలంగా లేవనెత్తాలి. మూడవది, సోషల్ మీడియా వంటి సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి, సభ్యులను సమీకరించడం అవగాహన కల్పించడం చేయాలి. ఉదాహరణకు, రాజస్థాన్‌లో ఒ.పి.ఎస్. పునరుద్ధరణ కోసం యూనియన్లు సోషల్ మీడియా ద్వారా విస్తృత ఉద్యమాన్ని నిర్మించాయి, ఇది తెలంగాణ యూనియన్లకు ఆదర్శంగా నిలుస్తుంది.ప్రభుత్వం కూడా ఈ సమస్యలను తీవ్రంగా పరిగణించాలి. డి.ఏ. బకాయిలను తక్షణ నగదు రూపంలో చెల్లించడం, పి.ఆర్.సి. సిఫారసులను వేగంగా అమలు చేయడం, ఒ.పి.ఎస్. పునరుద్ధరణను పరిశీలించడం ద్వారా ఉపాధ్యాయులలో విశ్వాసాన్ని పెంచవచ్చు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం, ఉపాధ్యాయులతో సమర్థవంతమైన చర్చలు జరపడం ప్రభుత్వ బాధ్యత. ఉపాధ్యాయుల ఆర్థిక వృత్తిపరమైన భద్రత విద్యా వ్యవస్థ నాణ్యతకు కీలకం. ఉదాహరణకు, డి.ఏ. బకాయిల ఆలస్యం ఉపాధ్యాయుల ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది, ఇది వారి బోధనా నాణ్యతపై ప్రభావం చూపుతుంది.ఉపాధ్యాయులు కూడా తమ హక్కుల కోసం చురుకుగా పాల్గొనాలి. యూనియన్లు బలహీనంగా ఉన్నప్పటికీ, ఉపాధ్యాయులు ఐక్యతగా నిలబడి, తమ డిమాండ్లను బలంగా వినిపించాలి. సమాజంలో వారి పాత్రను గుర్తించి, డి.ఏ., పి.ఆర్.సి., ఒ.పి.ఎస్. వంటి సమస్యలపై ఉమ్మడి పోరాటం చేయాలి. యూనియన్లు తమ గత బలాన్ని తిరిగి పొందాలంటే, రాజకీయ ప్రభావం నుంచి విముక్తి, ఐక్యత, సాంకేతికత ఉపయోగం అవసరం. డి.ఏ., పి.ఆర్.సి., ఒ.పి.ఎస్. వంటి సమస్యలు ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలను నేరుగా ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వం, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయి. విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే ఉపాధ్యాయుల హక్కులను కాపాడడం తప్పనిసరి. ఉపాధ్యాయ సంఘాలు నిద్రావస్థ నుంచి బయటికొచ్చి, గతంలో మాదిరిగా గొప్ప పోరాట స్ఫూర్తితో ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాన్ని ప్రారంభిస్తే, మిగతా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా వారిని అనుసరిస్తారు. అలా ఉద్యమం ముందుకు సాగితే సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

**-మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి డైలీ**
**మహబూబాబాద్**

## స్వధర్మంతో సమన్వయం

భక్తి



భగవద్గీతలో అత్యంత ప్రాచుర్యం పొందిన అంశాల్లో స్వధర్మం గురించి అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ ప్రధానమైనది. 'ఏది స్వధర్మం? దాన్ని ఎందుకు ఆచరించాలి? దాని నుంచి దూరం కావడం వల్ల ఏం జరుగుతుంది?' లాంటి విషయాలను శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో స్పష్టంగా తెలియజేశాడు. యుద్ధం చేయడానికి కురుక్షేత్రంలోకి అడుగుపెట్టిన అర్జునుడి ఆలోచనలకు, మాటలకు, చర్యలకు మధ్య పొందన లేకపోవడాన్ని శ్రీకృష్ణుడు గమనించాడు. వాటిని సమన్వయపరుచుకొనే మార్గాన్ని అర్జునుడికి చూపించే ప్రయత్నం చేశాడు. అర్జునుడు తన స్వధర్మం ప్రకారం యుద్ధం చేయడమే... సమన్వయం. యుద్ధాన్ని నివారించాలనుకోవడం దానికి విరుద్ధం. ఇటువంటి అయాచితమైన యుద్ధం స్వర్గానికి ద్వారాలు తెరుస్తుందని, దాని నుంచి పారిపోవడం వల్ల స్వధర్మం, కీర్తి నశిస్తాయని, పాపం కలుగుతుందనీ శ్రీకృష్ణుడు చెప్పాడు. యుద్ధ క్షేత్రంలో అర్జునుడికి ఆయన ఇచ్చిన ఈ సలహాలు నిర్దిష్టమైన సందర్భాలకే పరిమితమని అర్థం చేసుకోవాలి. నిజానికి ఇక్కడ శ్రీకృష్ణుడు మాట్లాడుతున్నది... స్వధర్మంతో సామరస్యం, సమన్వయం గురించే తప్పయుద్ధం గురించి కాదు.

సామరస్యం అంటే...సృష్టిలోని చిన్న ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల నుంచి పెద్ద పెద్ద నక్షత్ర మండలాలు, గ్రహాల వరకూ అన్నీ సామరస్యంతోనే ఉంటాయి. అందుకే సామరస్యతే ఈ సృష్టిని పరిపాలిస్తుంది. ఒక రేడియో స్టేషన్‌తో రేడియోకు సామరస్యత (ట్యూనింగ్) ఉన్నప్పుడు మనం అందులో వచ్చే సంగీతాన్ని ఆస్వాదించగలుగుతాం. సామరస్యానికి మానవ దేహాన్ని మించిన ఉదాహరణ లేదు. ఇందులో అనేక అవయవాలు, రసాయనాలు సమన్వయంతో పని చేసి మనకు జీవితాన్ని ఇస్తాయి. ఇక్కడ సామరస్యం అంటే యథాతథంగా ఉండే వస్తువులు, పరిస్థితులు, అంతే తప్ప మనం కోరుకొనే విధంగా అభిప్రాయాలు, ఆశించే విలువల ప్రకారం ఉండేవి కావు. మనం చేసిన మంచి పనులు మనం మరణించేక స్వర్గానికి, చెడ్డపనులు నరకానికి తీసుకువెళ్తాయని బాల్యం నుంచీ మనకు బోధిస్తూ ఉంటారు. స్వర్గం, నరకం అనేవి మరణం తరువాత చేరుకొనే ప్రదేశాలు కావనీ, ఒకరి సామర్థ్యాన్నిబట్టి, అవకాశాలు దొరకడాన్ని బట్టి అవి ఇక్కడే, ఇప్పుడే ఉంటాయని శ్రీకృష్ణుడు సూచిస్తున్నాడు. ఇతరుల స్వధర్మాన్ని మనం అర్థం చేసుకున్నప్పుడు... కుటుంబాలలో, పని చేసే ప్రదేశాలలో అనుబంధాల మధ్య సామరస్యత నెలకొంటుంది. అది స్వర్గంతో సమానం. అలా లేకపోతే నరకం. మన కోరికలు తీరడం లేక తీరకపోవడాన్ని బట్టి మనం సుఖాన్నో లేదా దుఃఖాన్నో అనుభూతి చెందుతాం. స్వధర్మంతో అంతర్గత సామరస్యత సాధించినట్టయితే... బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా జీవితం స్వర్గతుల్యంగా ఉంటుంది.



## ఈ నూనెలతో రొమ్ము క్యాన్సర్

వృక్షాధారిత నూనెల్లో ఉండే లినోలిక్ ఆమ్లం రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలకు తోడ్పడుతుందని న్యూయార్క్‌లోని వీల్ కార్నెల్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. సా?ధారణ క్యాన్సర్లతో పోల్చితే, లినోలిక్ ఆమ్లం కారక రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరించడంతో పాటు, ఈ క్యాన్సర్‌తో ప్రాణాలతో బయటపడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని ఈ మెడికల్ స్కూల్ చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ అయిన లినోలిక్ ఆమ్లం, సోయాబీన్,



పొద్దుతిరుగుడు నూనెలతో పాటు, పోర్క్‌లో కూడా ఉంటుంది. ఈ ఆమ్లం చికిత్సకు లొంగని ట్రిపుల్ నెగిటివ్ రొమ్ము క్యాన్సర్ పెరుగుదలను ప్రోత్సహిస్తుందని పరిశోధకులు కనిపెట్టారు. ఈ పరిశోధన, ఆహార కొవ్వులు, క్యాన్సర్‌ల మధ్య సంబంధాన్ని స్పష్టం చేయడానికి సహాయపడడమే కాకుండా, నిర్దిష్ట పోషకాహారం నుంచి క్యాన్సర్ రోగులు అదనపు ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుపుతుంది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | బుధవారం | 30 । ఏప్రిల్ । 2025


# అతివల సారథ్యంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం



అంబేద్కర్ ఆకాంక్షలకు అనుగుణంగా స్త్రీ సాధికారతకు ప్రతిబింబంగా యూనివర్శిటీకి విసి సహా కీలక స్థానాల్లో 19 మంది మహిళలు సారథ్యం వహిస్తున్నారు. అంతేకాదు బోధనలోనూ పాలనలోనూ రాణిస్తున్నారు. అవకాశాలు ఇస్తే అందిపుచ్చుకోగలగడమే కాదు.. అందరూ మెచ్చేలా.. ఆదర్శనీయంగా నిలుస్తారని నిరూపిస్తున్నారు. పురుషులకు ధీటుగా ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. మహిళలు శక్తి సామర్థ్యాలను తక్కువచేసే భావజాలాన్ని పటాపంచలు చేస్తూ ఎంత శక్తిమంతులో నిరూపిస్తున్నారు. ఉన్నత విద్యారంగంలో కీలక స్థానాల్లో నాయకత్వం వహిస్తూ ఏకంగా ఒక యూనివర్శిటీనే నడిపిస్తున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని ప్రగతిబాట పట్టిస్తున్నారు. మహిళా సాధికారత అంటూ మాటలు చెప్పే నేతలకు అసలు సిసలైన సాధికారత అంటే ఏమిటో ఆచరణలో చూపిస్తున్నారు. యూనివర్సిటీకి కొత్త రూపు, పాలనలో సమూల మార్పులు, బోధనలో తమకంటూ ఒక ప్రత్యేకతను చాటుతున్నారు. అంబేద్కర్ పేరుతో నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీలో అంబేద్కర్ ఆకాంక్షించిన మహిళా సాధికారత కొంతైనా ఇక్కడ ద్యోతకమవడం యాధృచ్ఛికమే అయినా కొంత ఊరటనిచ్చిన అంశమే.

పిజి సెంటర్‌గా 1976-77 నుంచి ఉన్న ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం 2008లో యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు కలిపి మొత్తం 120 మంది పనిచేస్తున్నారు. వారిలో మొత్తం 25 మంది మహిళలు ఉండడం విశేషం. వారిలో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ఆఫీస్ సూపరింటెండెంట్ (ఒఎస్‌డి), ప్రత్యేక అధికారి, ఆర్ట్స్, కామర్స్, లా, ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్, అకడమిక్ అఫైర్స్ డీన్, అసిస్టెంట్ ఛీఫ్ వార్డెన్ వంటి హోదాలతో పాటు పలు విభాగాలకు సమన్వయకర్తలు, ఫ్యాకల్టీ మెంబర్లు మహిళలే కావడం ఇక్కడి విశేషం. అన్నింటి కంటే ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ హోదాలో ఒక మహిళ పదవిని అధిష్టించడం రికార్డు అనే చెప్పాలి. ఇప్పటివరకు పది మంది వైస్ ఛాన్సలర్లుగా పనిచేయగా, అందులో ప్రొఫెసర్ కె.ఆర్. రజని ఒక్కరే తొలి మహిళా వైస్ ఛాన్సలర్. అంతేకాదు ఫిలాసఫీలో అఖిలభారత స్థాయిలో తొలి మహిళా వైస్‌ఛాన్సలర్‌గా ఆమె ఘనతకెక్కారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న




ప్రొఫెసర్ పి. సుజాత కూడా యూనివర్సిటీకి తొలి రిజిస్ట్రార్ కావడం విశేషం. ఇలా అనేక విషయాల్లో పలు ప్రత్యేకతలు సంతరించుకుంది అంబేద్కర్ యూనివర్సిటీ. ఉన్నత స్థానాల్లో బాధ్యతలు నిర్వరిస్తున్న వీరికి విధుల నిర్వహణ అంత తేలిగ్గా ఏమీ లేదు. అయినా సమిష్టిగా పనిచేస్తూ, అనేక సవాళ్లను అధిగమిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు. యూనివర్సిటీ పురోగతిలో అనేక మైలురాళ్లను సాధిస్తున్నారు. మహిళా సాధికారతకు ఒక రోల్ మోడల్‌గా పనిచేస్తున్నారు.

**అధిగమిస్తూ అభివృద్ధి పథంలో..**

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ కె.ఆర్.రజని ఎన్‌టిఆర్ జిల్లా, తిరువూరు మండలం మల్లెల సొంత గ్రామం. ఆమె ఆంధ్రా యూనివర్సిటీ ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 1994లో చేరారు. తర్వాత 2000 నుంచి 2008 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2008 నుంచి 2019 వరకు ప్రొఫెసర్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. చదువులో మంచి ట్రాక్ రికార్డు ఈమె సొంతం చేసుకున్నారు. 1992లో ఎంఎ ఫిలాసఫీలో యూనివర్సిటీలో ప్రథమ ర్యాంకు, ఎంఎ రెలీజియస్ స్టడీస్‌లో 1995లో ప్రథమర్యాంకు సాధించారు. ది ఐడియల్ హ్యూమానిటీ అంశంలో 1990లో ఆమెకు పిహెచ్‌డి అవార్డు దక్కింది. ప్రొఫెసర్ కె.ఆర్. రజని 2024, జనవరి 18న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. యూనివర్శిటీ ప్రగతిలో తనదంటూ ముద్ర వేస్తున్నారు. ఈమె వచ్చిన తర్వాత సెంట్రల్ ఫర్ ఉమెన్ స్టడీస్, విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. రుసా ద్వారా మంజూరైన రూ.20 కోట్లతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వాటితో అకడమిక్ భవనాల నిర్మాణం, ఆధునికీకరణ, ఇంజినీరింగ్ కళాశాలకు ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు మొదలుపెట్టారు. వచ్చే ఏడాది ఫార్మసీ కళాశాల కోర్సు, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, ఇంజినీరింగ్‌లో ఎఐ కోర్సు, జియో సైన్స్ కోర్సుల ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఖేల్ ఇండియా భాగస్వామ్యంతో స్పోర్ట్స్ మైదానం కోసం ప్రయత్నిస్తున్నారు. యూనివర్శిటీ పాలనలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్న రజనికి కుటుంబం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. అయితే విశ్వవిద్యాలయంలో కొన్ని వెనక్కిలాగే శక్తులూ లేకపోలేదు, వాటిని అధిగమిస్తూ ఆమె ముందుకు సాగుతున్నారు.

**నానమ్మే నాకు స్ఫూర్తి!**

మా నాన్న గారు కాలంగి బాలసుందరం, అమ్మ మార్తమ్మ ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేశారు. మేం నలుగురం అక్కాచెల్లెళ్లం. మా తాత కాలంగి జాకబ్, నానమ్మ కాలంగి ఎలీస్ ఇద్దరూ ఉపాధ్యాయులే. నానమ్మ మహిళా సాధికారత ఆకాంక్షించే గొప్ప వ్యక్తి. ఆమె స్ఫూర్తితోనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. నా భర్త ప్రొఫెసర్ గంటా సుభాకర్ ఆంధ్రా యూనివర్శిటీలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి, రిటైర్ అయ్యారు. నేనూ, ఆయన ఒకేసారి ఎయులో ప్రొఫెసర్లుగా చేరాం. నాకు ఆయన సహకారం సంపూర్ణంగా ఉంది. మహిళ నాయకత్వం వహించే ప్రతిచోటా వెనక్కిలాగే శక్తులు ఉంటాయి. నాకు కొన్ని స్వీయ అనుభవాలు ఎదురయ్యాయి. మహిళ, అందులో ఓ దళిత మహిళ ఏం చేయగలదు? అనే పరిస్థితులనూ చవిచూశాను. పనిలో సమన్వయం చేసుకుని, సమస్యలను అధిగమించలేకపోతే మనకున్న జ్ఞానం వ్యర్థమని నా అభిప్రాయం. విద్యావంతులు, పనిచేసే తత్వం, అనుభవం అంశాల ఆధారంగా సిబ్బందిని ఎంపిక చేసుకుని, ముందుకు వెళు తున్నాను. మహిళా సాధికారతకు విద్యే ప్రధానం. పిల్లలను ఎంతమందిని కనాలో పురుషులే నిర్దేశిస్తున్నారు. మహిళలకు తన శరీరం మీద కూడా నియంత్రణ లేని పరిస్థితిని చూస్తున్నాం. ఇక మహిళల ఆలోచనలకు ఇంకేం ప్రాధాన్యం ఇస్తారు. మహిళలపై కుటుంబం, సమాజం ఆలోచించే విధానం మారాలి. స్త్రీ విద్య ద్వారానే మహిళా సాధికారత సాధ్యపడుతుంది.

కె.ఆర్. రజని, వైస్ ఛాన్సలర్



**నాన్న ప్రభావంతోనే..**

యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పి. సుజాత మరో కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఆంధ్రా యూనివర్శిటీలో 2010లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రస్థానం ప్రారంభించి, గీతం యూనివర్శిటీతో పాటు అమెరికాలోని పది ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఆమె పనిచేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రెండేళ్ల పాటు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుజాత పనిచేశారు. విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా, పలు విభాగాలకు డీన్‌గా ఆమె విధులు నిర్వర్తించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, సర్వీస్ మేటర్స్ వంటి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారు. పాలనను స్ట్రీమ్‌లైన్ చేసే పనిలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. భర్త మూర్తి, కుటుంబసభ్యుల ప్రోత్సాహం, సిబ్బంది సహకారంతో ముందుకు సాగుతున్నానంటున్నారు. 'మా కుటుంబంలో మా నాన్న వెంకట్రావు మహిళా సాధికారత కోసం ఆలోచించే వ్యక్తి. ఆయన ప్రభావంతో ఈ రోజు విధుల్లో రాణించగలుగుతున్నా!' అని ఆమె తన అభిప్రాయం వ్యక్తం చేశారు.



పి. సుజాత, రిజిస్ట్రార్

**ఇంటర్‌లోనే పెళ్లి.. ప్రిన్సిపల్ స్థాయికి చేరాను..**

యూనివర్శిటీ ఆర్ట్స్, కామర్స్ లా అండ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.అనురాధ 2008లో టీచింగ్ అసోసియేట్‌గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో చేరారు. ఇంటర్ చదువుతుండగానే ఆమెకు వివాహం చేసినా పట్టుదలతో తన విద్యాభ్యాసాన్ని ఆ తర్వాతా కొనసాగించారు. భర్త అచ్యుతరావు, అత్త, ఆడపడుచుల సహకారంతోనే తానీ స్థాయికి చేరుకున్నానని ఆమె చెప్పారు. పెళ్లయిన తర్వాత చాలామంది మహిళలకు చదువుకునేందుకు కుటుంబసభ్యులు అంగీకరించే పరిస్థితులు ఉండడం లేదన్నారు. 'మా యూనివర్శిటీకి వస్తున్న వివాహిత మహిళలు చదువుకోవాలని ఆసక్తి చూపుతున్నా, చాలా మంది అంగీకరించడం లేదు. మా కుటుంబసభ్యుల మాదిరిగానే మహిళలకు చదువుకునేందుకు అవకాశం ఇస్తే స్త్రీలు ఉన్నతస్థాయికి చేరుకుంటారు. కుటుంబంతో పాటు సమాజమూ అభివృద్ధి చెందుతుంది!' అంటున్నారు.

**డాక్టర్ ఎం.అనురాధ. ఆర్ట్స్, కామర్స్, లా అండ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్**



**మేడమ్స్ మాకు స్ఫూర్తి..** యూనివర్శిటీలో మహిళలే కీలక స్థానాల్లో ఉండడం చాలా మంది యువతకు ఆదర్శంగా నిలిచింది. ఇక్కడ సోషల్ వర్క్‌లో పిజి చేసిన జి.నవీన సెట్, నెట్ పరీక్షలు రాసి నెట్‌లో నాలుగో ర్యాంకు సాధించారు. 2024లో సైబర్ క్రైమ్ ఇన్ యూత్ కోర్సులో పిహెచ్‌డిలో చేరారు. ఒకవైపు చదువుతూనే శ్రీకాకుళం నగరంలోని మహిళా కళాశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయినిగా చేరారు. తన చదువుకు, ఉపాధికి వైస్ ఛాన్సలర్ కె.ఆర్. రజని, కావ్య మేడమ్ స్ఫూర్తి అని ఆమె అంటున్నారు. యూనివర్శిటీలో ఇంజినీరింగ్ మెకానిక్ కోర్సులో మూడో సంవత్సరం చదువుతున్న వి.నరేంద్ర మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విసి మేడమ్‌తో నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. ల్యాబ్‌లో సమస్యలు మేడమ్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కారమవుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. యూనివర్శిటీ విద్యార్థులకు విసి మేడమ్ చొరవతోనే చాలా తక్కువ ఛార్జీలతో బస్సు సౌకర్యం వచ్చిందంటూ జి.ప్రవీణ్ అనే విద్యార్థి సంతోషం వ్యక్తం చేశారు.

# ఆ సంఘటనే బౌన్సర్‌గా మార్చింది



బౌన్సర్... దాదాపుగా పురుషులదే ఆధిపత్యమైన ఈ వృత్తిని ఎంచుకోవడమే కాదు, అందులో రాణిస్తూ ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు అను కుంజుమన్. ఫొటోగ్రాఫర్‌గా వృత్తి జీవితం ప్రారంభించిన ఆమె కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా గుర్తింపు పొందారు. నటిగానూ అవకాశాలు అందుకుంటున్నారు. 'నటుడు మోహన్‌లాల్ పర్సనల్ బాడీగార్డ్' అంటూ తన గురించి జరిగిన ప్రచారం అవాస్తవం అంటున్న 37 ఏళ్ళ అను కథ ఇది.

"కొన్నాళ్ళ క్రితం ఒక ఆంగ్ల వార్తా సంస్థ మహిళా బౌన్సర్ల గురించి కథనం రూపొందిస్తూ... నన్ను ఇంటర్వ్యూ చేసింది. వారికి నా వీడియోలు కొన్ని పంపించాను. మోహన్‌లాల్‌తో నేను కలిసి ఉన్న వీడియో ఒకటి వైరల్ అయింది. నేను ఆయనకు వ్యక్తిగత బాడీగార్డ్ అనీ, సెక్యూరిటీ హెడ్ అనీ ప్రచారం జరిగింది. అది నిజం కాదు. కొచ్చిలో ఆయన పాల్గొన్న ఒక కార్యక్రమంలో నేను బౌన్సర్‌గా పని చేశానంతే. ఏదైతేనేం... నేను ఊహించని ప్రచారం వచ్చింది. వార్తా పత్రికలు, టీవీ ఛానెల్స్ నా గురించి ఆరా తీయడం మొదలుపెట్టాయి.

అమ్మకు చేదోడుగా...


బౌన్సర్ వృత్తిలోకి నేను అనుకోకుండా వచ్చాను. నేను పుట్టి పెరిగింది కేరళలోని ఎర్నాకుళం జిల్లాలోని ఒక గ్రామంలో. నా చిన్నప్పుడే నాన్న మాకు దూరమయ్యారు. నన్ను, నా సోదరిని పెంచడానికి మా అమ్మ ఎన్నో కష్టాలు పడింది. వాటికి మేమూ అలవాటు పడ్డాం. అవే నన్ను రాటుదేల్చాయనుకుంటాను. చదువు పూర్తయ్యాక... చిన్న చిన్న పనులు చేస్తూ అమ్మకు ఆర్థికంగా చేదోడుగా ఉండేదాన్ని. అప్పుడే ఫొటోగ్రఫీ నేర్చుకున్నాను. పెళ్ళిళ్ళ లాంటి ఈవెంట్లకు పని చేసేదాన్ని. క్రమంగా పెద్ద కార్యక్రమాలకు కూడా అవకాశాలు వచ్చాయి. ఆ సమయంలో ఎదురైన ఒక సంఘటన... నా జీవితాన్ని మలుపు తిప్పింది.

కొత్త అధ్యాయం ప్రారంభించాను...కొచ్చిలో ఒక ఉత్పత్తి ప్రచార కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్‌గా వెళ్ళాను. అక్కడికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. వారిలో ఒకరి బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను తన బృందంతో కలిసి వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత కొన్ని కార్యక్రమాల్లో వాళ్ళు కలుస్తూ ఉండేవారు. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. మీరు ఫిట్‌గానే ఉన్నారు కాబట్టి ప్రయత్నించండి. దేశంలో ఎక్కువమంది మహిళా బౌన్సర్లు లేరు. కానీ అవసరం చాలా ఉంది" అని చెప్పారు. లేడీ బౌన్సర్ కావాలని అప్పుడే నిశ్చయించుకున్నాను. అందుకు అవసరమైన సూచనలు, సలహాలు వారి దగ్గరే తీసుకున్నాను. ఆ నిర్ణయానికి నా కుటుంబం కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అలా కేరళలో తొలి మహిళా బౌన్సర్‌గా కొత్త అధ్యయాన్ని ప్రారంభించాను. మొదట్లో చిన్న చిన్న కార్యక్రమాలకు అవకాశాలు వచ్చేవి. గత మూడేళ్ళుగా పెద్ద ఈవెంట్స్‌కు బౌన్సర్‌గా వెళ్తున్నాను. వాటిలో సెలబ్రిటీల ఫంక్షన్ల నుంచి ఆడంబరంగా ఉండే పబ్ పార్టీల వరకూ ఉంటాయి. అంతేకాదు... మహిళా సెలబ్రిటీలకు, వ్యాపార ప్రముఖులకు కూడా ఎస్కార్ట్‌గా వెళ్తూ ఉంటాను. ఇప్పుడు ఈ వృత్తిలోకి వచ్చే మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

నిజాయితీ, నిబద్ధతతో...నా కథ విన్నాక ఎంతోమంది మహిళలు నన్ను సంప్రతిస్తున్నారు. బౌన్సర్ కావాలనుకుంటున్నామని చెబుతున్నారు. ఇది నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. బౌన్సర్ అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న వృత్తి. దీనికి శరీర దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా ఉండాలి. కొందరు దీన్ని గౌరవనీయమైన వృత్తిగా పరిగణించరు. కానీ బతకడానికి ఆదాయం ఇచ్చేదీ, చట్టవిరుద్ధం కానిదీ అయిన పనిని నిజాయితీగా, నిబద్ధతతో చేస్తే... గౌరవం దానంతట అదే వస్తుంది. నా వరకూ వ్యక్తిగతంగా ఎలాంటి చేదు అనుభవాలూ ఎదురు కాలేదు. అయితే పబ్‌లలో, పార్టీల్లో, సెలబ్రిటీ ఈవెంట్లలో తరచూ ఉద్రిక్తతలు చోటు చేసుకుంటాయి. జనం వారిపై ఎగబడడం వల్ల తొక్కిసలాటలు, ఘర్షణలు సాధారణం. అలాంటి సమయాల్లో సయమనం కోల్పోకుండా... సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ఆగ్రహావేశాలు పెరగకుండా ఆపాలి. ఎవరి సూచనల కోసమో ఎదురుచూస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయి. అదృష్టవశాత్తూ... నేను స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనేలా మా అమ్మ పెంచింది. అందుకే భిన్నమైన సందర్భాలను ధైర్యంగా ఎదుర్కొంటాను. నాకు ఇద్దరు పిల్లలు. ప్రతి విషయంలో వాళ్ళు నాకు అండగా ఉంటారు. ప్రతిరోజూ బౌన్సర్‌గా పని ఉండదు కాబట్టి... ఫొటోగ్రాఫర్‌గానూ కొనసాగుతున్నాను. అంతేకాదు... నటన అంటే నాకు ఆసక్తి. 'విశేషం', 'పూరమ్ పూరాడమ్ పూరుడతి' అనే సినిమాల్లో చిన్న పాత్రలు వేశాను. మరిన్ని అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాను."కొచ్చిలో ఒక కార్యక్రమానికి కొందరు సెలబ్రిటీలు వచ్చారు. ఒక బౌన్సర్ నన్ను తోసేయడంతో... పక్కకు పడిపోయాను. అతను వచ్చి క్షమాపణ చెప్పాడు. అలా వారితో పరిచయం ఏర్పడింది. బౌన్సర్లుగా మహిళలు ఎందుకు ఉండరని వారిని అడిగాను. "ఫిట్‌నెస్ ఉంటే మహిళలు కూడా బౌన్సర్లు కావచ్చు. ప్రయత్నించండి" అని చెప్పారు.

# పెర్ఫ్యూమ్స్ రోజంతా వాసన రావాలంటే ఏంచేయాలి?





పెర్ఫ్యూమ్స్ వాడడం చాలా మందికి అలవాటు. రోజంతా మనం ఎన్నో పనులు చేస్తుంటాం. దీంతో చెమట వాసన వస్తుంది. అలా రాకుండా ఉండేందుకు పైగా రోజంతా తాజాగా ఉండేందుకు చాలా మంది పెర్ఫ్యూమ్స్ వాడతారు. ఇది డెయిలీ రొటీన్‌లో భాగమనే చెప్పొచ్చు. అయితే, పెర్ఫ్యూమ్స్ ఎలా అంటే మనం స్ప్రే చేసినప్పుడే ఎక్కువ స్మెల్ వస్తాయి. ఆ తర్వాత స్మెల్ తగ్గుతుంది. అలా కాకుండా రోజంతా ఎక్కువగా పెర్ఫ్యూమ్ స్మెల్ రావాలంటే ఏ టిప్స్ ఫాలో అవ్వాలో తెలుసుకోండి.

**స్కిన్ టోన్**

ఏంటి స్కిన్ టోన్ ఎఫెక్ట్ ఉంటుందా అని ఆశ్చర్యపోవద్దు. చాలా తక్కువమందికే ఈ విషయం తెలిసి ఉంటుంది. డార్కర్ స్కిన్ టోన్స్ వారికి పెర్ఫ్యూమ్స్ ఎక్కువసేపు ఉంటాయి. వీరి శరీర రంగు కారణంగా పెర్ఫ్యూమ్స్‌లోని నేచురల్ ఆయిల్స్‌ని అబ్జార్బ్ చేసుకుంటాయి. ఇక కాస్తా లైట్ స్కిన్ ఉండేవారు పెర్ఫ్యూమ్ స్మెల్ ఎక్కువసేపు రావాలంటే ముందుగా మాయిశ్చరైజింగ్ క్రీమ్‌ని రాసి ఆ తర్వాత స్ప్రే చేయాలి.

**క్లాత్, పల్స్ పాయింట్స్‌పై స్ప్రే**

పెర్ఫ్యూమ్ అప్లికేషన్ అనేది రిస్ట్, మెడకి పక్కలా, భుజాలు, అండర్ ఆర్మ్ వంటి భాగాల్లో స్ప్రే చేయాలి. బాడీలోని ఈ భాగాల్లో స్ప్రే చేస్తే ఎక్కువసేపు పెర్ఫ్యూమ్ స్మెల్ వస్తుంటుంది. కాబట్టి, దీనిని స్ప్రే చేయడం మంచిది.

**ముంజేతులని రుద్దడం**

కొంతమంది ముంజేతులపై పెర్ఫ్యూమ్ స్ప్రే చేసి రుద్దుతుంటారు. దీని వల్ల అప్పటికప్పుడు స్మెల్ ఎక్కువగా వచ్చినట్టు అనిపించినా త్వరగా స్మెల్ ఆవిరైపోతుంది. ఇది సాధారణంగా అనిపించినప్పటికీ టాప్ టిప్ అని చెప్పొచ్చు. మీరు స్నానం చేసిన వెంటనే కాస్తా తడిఆరగా వాష్‌రూమ్‌లో స్పేస్ ఉంటే అక్కడే కాస్తా తడి ఆరగానే పెర్ఫ్యూమ్ స్ప్రే చేయండి.

**స్టోర్ చేయడం**

మనం వాడే పర్ఫ్యూమ్స్‌ని చల్లని ప్రదేశంలో స్టోర్ చేయండి. దీంతో కెమికల్ కంపోజిషన్ జరగకుండా ఉంటుంది. పర్ఫ్యూమ్స్ ఆవిరవ్వకుండా ఉంటాయి. కాబట్టి, ఎప్పటికీ ఈ పెర్ఫ్యూమ్స్‌ని వార్డ్‌రోబ్, వానిటీ డ్రాయర్స్‌లో స్టోర్ చేయండి.

**ఎక్కువసేపు రావడానికి**

పెర్ఫ్యూమ్ స్మెల్ ఎక్కువగా రావడమనేది ఒక్కొక్కరి బాడీని బట్టి వేర్వేరుగా ఉంటుంది. పెర్ఫ్యూమ్ వాడకాన్ని బట్టి, స్కిన్ టైప్, వాతావరణ పరిస్థితులని బట్టి దాని వాసన ఎంత సేపు స్మెల్ వస్తుందనే అంశం ఆధారపడి ఉంటుంది. దీనికోసం కొన్ని ఈజీ చిట్కాలు ఫాలో అయితే పర్ఫ్యూమ్ ఎక్కువసేపు వాసన వస్తుంటుంది.

**ఏ పర్ఫ్యూమ్స్**

అదే విధంగా, కొన్ని పెర్ఫ్యూమ్స్ మంచి స్మెల్ వస్తుంటాయి. వాటిని నోట్ చేసుకోండి. ఉదాహరణకి మస్క్, సినమన్, ఉడ్స్ వంటివి చాలా వరకూ మంచి స్మెల్ వస్తుంటాయి. ఏదిఏమైనా సిట్రస్ ఫ్లేవర్స్ కూడా ఎక్కువగానే స్మెల్ వస్తుంటాయి. అదే విధంగా, పెర్ఫ్యూమ్‌ని ఓ బాటిల్ నుంచి మరో బాటిల్‌లోకి మార్చొద్దు.

# మొటిమలు ఎందుకు ఎక్కువ అవుతాయంటే..

రాత్రిపూట మనం పడుకునేటప్పుడు చేసే చిన్న పొరబాట్ల వల్ల ముఖం మీద మొటిమలు ఒక్కసారిగా పెరుగుతూ ఉంటాయి. దీనివల్ల ముఖం అందవికారంగా తయారవడమే కాదు... నొప్పి, అసౌకర్యం కూడా కలుగుతుంది. కనుక ఆ పొరపాట్లు ఏమిటో తెలుసుకొని, జాగ్రత్తలు పాటిస్తే మొటిమల బారి నుంచి తప్పించుకోవచ్చని అంటున్నారు నిపుణులు. రాత్రిపూట ముఖాన్ని శుభ్రం చేసుకోకుండా పడుకుంటే చర్మం మీద చేరిన దుమ్ము, చర్మం ఉత్పత్తి చేసే నూనెతో కలసి చర్మ రంధ్రాలను మూసివేస్తుంది. దీంతో ముఖం మీద మొటిమలు ఏర్పడతాయి. ముఖం మీద వేసుకున్న మేక్‌పను తొలగించకుండా పడుకున్నా ఆ ఉత్పత్తుల్లోని రసాయనాల కారణంగా మొటిమలు ఎక్కువ అవుతాయి. దిండు గలీబులను వారాల తరబడి ఉతకకుండా వాటిపైనే నిద్రించడం వల్ల చెంపలు, ముక్కు, నుదుటి భాగాల్లో చర్మంపై హానికరమైన బ్యాక్టీరియా చేరుతుంది. దీంతో మొటిమలు ఎక్కువ అవుతాయి. ముఖంపై తల వెంట్రుకలు పడుతూ ఉన్నా, చేతులతో ముఖాన్ని తరచూ తాకుతూ ఉన్నా ముఖంపై మలినాలు చేరి మొటిమలు ఎక్కువగా వస్తాయి.

చెంపలను దిండుకి అదిమిపెట్టి పడుకోవడం వల్ల ముఖం మీద చర్మం అత్యధికంగా నూనెని ఉత్పత్తి చేస్తుంది. ఇలా రాత్రి సమయంలో కొన్ని గంటలపాటు చర్మ రంధ్రాలు నూనెతో నిండి ఉండడం వల్ల మొటిమల సమస్య పెరుగుతుంది. రాత్రిపూట సరిగా నిద్రించకపోవడం వల్ల హార్మోన్ల సమతౌల్యం దెబ్బతింటుంది. ఫలితంగా మొటిమలు ఎక్కువ అవుతాయి.

సాధారణంగా రాత్రిపూట ముఖానికి రాసుకునే నైట్ క్రీమ్‌లు, మాయిశ్చరైజర్లు చర్మ రంధ్రాలను పూర్తిగా మూసివేస్తాయి. దీనితో చర్మానికి ఆక్సిజన్ అందక సమస్య మరింత తీవ్రమవుతుంది. పడుకునే గదిలో వెంటిలేషన్ సరిగా లేకపోతే చర్మం మీద చెమట, దుమ్ము, బ్యాక్టీరియా చేరి మొటిమలు వస్తాయి.




## ప్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**ముంబై- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,396.92 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,122.02 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 80,661.31 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 70.02 పాయింట్లు పెరిగి.. 80,288.38 వద్ద ముగిసింది. నిఫ్టీ 7.45 పాయింట్లు పెరిగి 24,335.95 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1766 షేర్లు లాభపడ్డాయి. మరో 2012 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, ట్రెంట్ లాభాలను ఆర్జించాయి. సన్ ఫార్మా, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రంగాల వారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ 0.5శాతం నుంచి ఒకశాతం దాకా పెరిగాయి. మెటల్, పవర్, టెలికాం, ఫార్మా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి.

## సామాన్యులకు ఊరట.. రూ. 100, రూ. 200 నోట్లపై ఆర్బీఐ కీలక ఆదేశాలు!




**న్యూఢిల్లీ-నవభూమి:** చిల్లర కోసం ఇబ్బంది పడే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుభవార్త చెప్పింది. ఇకపై ఏటీఎంలలో కేవలం రూ.500, రూ.2000 నోట్లే కాకుండా, రూ. 100, రూ. 200 నోట్లు కూడా విరివిగా లభించనున్నాయి. సామాన్య ప్రజల రోజువారీ అవసరాలకు ఎక్కువగా ఉపయోగపడే ఈ చిన్న నోట్ల లభ్యతను పెంచేందుకు ఆర్బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు ఈ ఆదేశాలను దశలవారీగా అమలు చేయాల్సి ఉంటుంది."ప్రజలు తరచుగా ఉపయోగించే నోట్ల లభ్యతను పెంచే ప్రయత్నంలో భాగంగా, అన్ని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు తమ ఏటీఎంలలో రూ. 100, రూ. 200 నోట్లను క్రమం తప్పకుండా అందుబాటులో ఉంచాలని నిర్ణయించడమైనది.." అని ఆర్బీఐ తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

ఈ ఆదేశాల ప్రకారం, 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశంలోని మొత్తం ఏటీఎంలలో కనీసం 75 శాతం ఏటీఎంలు ఒక క్యాసెట్ ద్వారా అయినా రూ. 100 లేదా రూ. 200 నోట్లను తప్పనిసరిగా అందించాలి. ఆ తర్వాత, 2026 మార్చి 31 నాటికి ఈ లక్ష్యాన్ని 90 శాతానికి పెంచాలని ఆర్బీఐ ఆదేశించింది.

**చిన్న నోట్ల కొరతకు చెక్!**

గత కొంతకాలంగా ఏటీఎంలలో పెద్ద నోట్లు మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉంటున్నాయి. దీంతో సామాన్య ప్రజలు చిన్న మొత్తాల్లో డబ్బు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా దుకాణాల్లో లేదా ఇతర చిన్న అవసరాలకు చిల్లర కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. ఆర్బీఐ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

**రూ. 100, రూ. 200 నోట్ల ప్రాముఖ్యత..**

రూ. 100, రూ.200 నోట్లు సాధారణ ప్రజల రోజువారీ లావాదేవీలకు చాలా ముఖ్యమైనవి. కూరగాయలు కొనాలన్నా, చిన్న మొత్తంలో ఏదైనా కొనుగోలు చేయాలన్నా ఈ నోట్లు ఎక్కువగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా, పెద్ద నోట్లు తీసుకున్న తర్వాత చిల్లర కోసం ఎదురుచూడాల్సిన అవసరం కూడా తప్పుతుంది.

**బ్యాంకులు, ఏటీఎం ఆపరేటర్లకు గడువు:**

ఆర్బీఐ ఈ ఆదేశాలను అమలు చేయడానికి బ్యాంకులకు, ఏటీఎం ఆపరేటర్లకు స్పష్టమైన గడువు విధించింది. ఈ గడువులోగా వారు తమ ఏటీఎంలలో అవసరమైన మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ఆర్బీఐ ఈ చర్య ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించడంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా భావించవచ్చు. రాబోయే రోజుల్లో ఏటీఎంలలో చిన్న నోట్ల లభ్యత గణనీయంగా పెరగనుంది..

## ఇండస్ ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సీఈవో పదవికి అరుణ్ ఖురానా రాజీనామా..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండస్ ఇండ్ బ్యాంక్ డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానా తన పదవీకి రాజీనామా చేశారు. ఇటీవల బ్యాంకు అకౌటింగ్‌లో అవకతవకలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. బ్యాంక్ ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ బాధ్యతలను చూసుకునేవారు. మార్చి 2025తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.1960కోట్ల నష్టాన్ని చవిచూసిన నేపథ్యంలో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. కంపెనీ ఖాతాలపై అంతర్గత డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో.. ఇటీవలి దురదృష్టకర పరిణామాల దృష్ట్యా, ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ ఫంక్షనరీ, హోల్ టైమ్ డైరెక్టర్, డిప్యూటీ సీఈఓ, బ్యాంక్ సీనియర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తన పదవికి తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ఖురానా బ్యాంక్ బోర్డుకు పంపిన తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.సోమవారం సాయంత్రం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఇండస్ఇండ్ బ్యాంక్.. ఖురానా రాజీనామా ఏప్రిల్ 28 నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. ఖురానా తన రాజీనామా లేఖలో తనపై విశ్వాసం ఉంచి.. బ్యాంకులో తనకు బాధ్యతలు అప్పగించినందుకు బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు భవిష్యత్ బాగుండాలని ఆకాంక్షించారు. ఏప్రిల్ 15న డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో నికర విలువపై రూ.1,979 కోట్ల ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని ఇండస్ఇండ్ బ్యాంక్ మరొక ఇంటర్నల్ ఏజెన్సీ బేస్ నివేదికను వెల్లడించింది. ప్రైవేట్ రంగ రుణదాత గత నెలలో దాని డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ అవకతవకలు నివేదించింది. ఇది డిసెంబర్ 2024 నాటికి బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం చూపుతుందని అంచనా.

## మరింత మంది ట్రైనీలపై ఇన్ఫీ వేటు.. ఈ ఏడాది ఇది నాలుగోసారి

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఉద్యోగులకు లేఆఫ్స్, ఫ్రెషర్స్ విషయంలో సంస్థ తీరు, శాలరీ హైక్‌లు వంటి కారణాలతో నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఇప్పుడు తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇటీవలే కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్ లో శిక్షణ పొందుతున్న వందలాది మంది ట్రైనీలను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరింతమంది ట్రైనీలపై వేటు వేసింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో వారిని తొలగించినట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.దాదాపు 195 మంది ట్రైనీలను తొలగించినట్లు మనీకంట్రోల్ నివేదించింది. ఈ మేరకు ఇవాళ ఈమెయిల్ ద్వారా ఆయా ట్రైనీలకు తొలగింపు సమాచారాన్ని అందించినట్లు పేర్కొంది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజనీర్ విభాగంలోని ట్రైనీలు తొలగింపుకు గురైనట్లు తెలిపింది. వరుసగా మూడు సార్లు అంచనా పరీక్షల్లో విఫలమైన కారణంగా వారిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఇలా ట్రైనీలను తొలగించడం ఈ ఏడాది ఇది నాలుగోసారి కావడం గమనార్హం.


# ఒకేసారి చేతికి రూ.1 కోటి.. కేంద్ర పథకం




**హైదరాబాద్ - నవభూమి:** పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థిక స్వావలంబన వైపు నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు రకాల చిన్న మొత్తాల పొదుపు పథకాలను తీసుకొచ్చింది. తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా అందులో ఇన్వెస్ట్ చేయవచ్చు. అసంఘటిత రంగంలోని వారు సైతం పీఎఫ్ వంటి బెనిఫిట్స్ పొందేలా తీసుకొచ్చిన పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్. మీరు నెలకు కొంత పొదుపు చేసుకుంటూ పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు మీ పెట్టుబడి సురక్షితంగా ఉండాలనుకుంటే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని ఎంచుకోవచ్చు. ప్రభుత్వ హామీ ఉండడంతో పాటు ఇందులో వచ్చే వడ్డీ మార్కెట్ పరిస్థితులకు లోబడి ఉండదు. స్థిరమైన వడ్డీ లభిస్తుంది.దీర్ఘకాలం పాటు పొదుపు చేయాలనుకునే వారికి ఇది ఒక బెస్ట్ పథకంగా చెప్పవచ్చు. క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటూ వెళ్తే దీర్ఘకాలంలో పెద్ద నిధిని ఏర్పాటు చేసుకోవచ్చు. మీరు పీపీఎఫ్ పథకంలో నెలకు రూ.12,500 పెట్టుబడి పెట్టినట్లయితే ఒకేసారి రూ.1 కోటికిపైగా అందుకోవచ్చు. అందుకు మీరు 25 సంవత్సరాల పాటు పొదుపు చేస్తూ ఉండాలి. ప్రస్తుతం ఈ పథకంలో వడ్డీ రేటు 7.1 శాతంగా ఉంది. అయితే, మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను సమీక్షిస్తుంటుంది. కొన్నిసార్లు మార్చవచ్చు లేదా స్థిరంగా ఉంచవచ్చు. ప్రస్తుతం వస్తున్న 7.1 వడ్డీ ప్రకారం లెక్కిస్తే మెచ్యూరిటీ నాటికి మీ చేతికి రూ.1,03,08,015 వరకు అందుతాయి. అయితే మీరు 25 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తూ ఉండాలి.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. బ్యాంకులు లేదా పోస్టాఫీసు ద్వారా ఇందులో చేరవచ్చు. ఈ స్కీమ్ మెచ్యూరిటీ గడువు 15 సంవత్సరాలు ఉంటుంది. ఆపైన 5 సంవత్సరాల చొప్పున ఎన్నిసార్లైనా పొడిగించుకోవచ్చు. ఇందులో పెట్టుబడి మొత్తం, వడ్డీ, మెచ్యూరిటీ సొమ్ము మూడింటికి ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. అలాగే ఈ పథకం ద్వారా సెక్షన్ 80సీ కింద ఏడాదికు రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.500గా ఉంది. ఆపైన గరిష్ఠంగా

## ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు.. ఆంధ్రప్రదేశ్ సహా ఆ రాష్ట్రాలు టాప్




**హైదరాబాద్ - నవభూమి:** దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రి ఖర్చులు భారం కాకుండా ఉచిత ఆరోగ్య బీమా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన పథకాన్ని అందిస్తోంది. అదే ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఆయుష్మాన్ భారత్). ఈ పథకాన్ని సెప్టెంబర్ 2018లో ప్రారంభించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల విలువైన హెల్త్ కార్డును ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటికే ఈ పథకంలో లక్షల మంది చేరి లబ్ధి పొందినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన స్కీమ్ కింద ఇప్పటి వరకు సుమారు రూ.1.29 లక్షల కోట్లు మేర ఉచిత హాస్పిటల్ ప్రయోజనాలు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపింది.పీఎంజేఏవై పథకం ద్వారా దాదాపు 9 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందినట్లు కేంద్రం తెలిపింది. 2018 నుంచి దేశంలోని 10.7 కోట్ల కుటుంబాలు ఈ పథకంలో చేరినట్లు తెలిపింది. సుమారు 40 శాతం మంది పేద ప్రజలు ఈ పథకం పరిధిలో ఉన్నట్లు పేర్కొంది. ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు 62 శాతం మేర ఆసుపత్రి ఖర్చులు సొంతంగా భరించడంతో లక్షల మంది భారతీయులు ప్రతిఏడాది పేదరికంలోకి వెళు తున్నట్లు అంచనా వేశారు. అయితే ఈ పథకం తీసుకొచ్చిన తర్వాత ఆసుపత్రి ఖర్చులు తగ్గి పేదరికంలోకి వెళ్లకుండా నివారించినట్లు కేంద్రం చెబుతోంది.ఆంధ్రప్రదేశ్ సహా ఆ రాష్ట్రాలు టాప్..

ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా అత్యధికంగా లబ్ధి పొందిన రాష్ట్రాల జాబితాను కేంద్రం వెల్లడించింది. అందులో తమిళనాడుల, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఉన్నాయి. లబ్ధిదారుల సంఖ్య చూసుకుంటే ఈ రాష్ట్రాల నుంచే ఎక్కువ మంది ఉన్నట్లు తెలిపింది.

**సీనియర్లకు రూ.5 లక్షలు..**

సెప్టెంబర్ 2024 నుంచి కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల ఉచిత హెల్త్ కవర్ అందిస్తోంది. అంటే కుటుంబానికి రూ. 5 లక్షలు ఇస్తూనే 70 ఏళ్ల వయసు దాటిన వృద్ధులకు అదనంగా రూ. 5 లక్షల కవరేజీ ఉంటుంది. ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్లు దాటిన వారందరికీ రూ. 5 లక్షల కవరేజీ ఇస్తోంది. సుమారు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఈ స్కీమ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నట్లు కేంద్రం చెబుతోంది.

## ట్రంప్ దెబ్బకు కుప్పకూలుతున్న చమురు ధరలు



ప్రపంచ వాణిజ్య యుద్ధం ముదురుతుండటంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో ప్రకంపనలు మొదలయ్యాయి. డిమాండ్‌పై దీని ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో బలహీన సంకేతాలు కనిపిస్తుండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలను చైనా దీటుగా తిప్పికొడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 65 డాలర్ల దిగువకు పడిపోయింది. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ కూడా 62 డాలర్ల కంటే తక్కువగా ట్రేడవుతోంది.అమెరికా తయారీ రంగం గణనీయంగా బలహీనపడటం, ట్రంప్ సుంకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో చమురు మార్కెట్లు ఆందోళన చెందుతున్నాయి. రానున్న వారంలో విడుదలయ్యే మరిన్ని ఆర్థిక గణాంకాలు పరిస్థితిపై మరింత స్పష్టతనిచ్చే అవకాశం ఉంది. మరోవైపు, చైనా అగ్ర దౌత్యవేత్త వాంగ్ యీ మాట్లాడుతూ, అమెరికా సుంకాల బెదిరింపులకు లొంగిపోవద్దని ఇతర దేశాలకు సూచించారు. బ్రిక్స్ దేశాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లొంగిపోతే "గుండాయిజం" చేసేవారిని మరింత ప్రోత్సహించినట్లవుతుందని అన్నారు. అమెరికా సుంకాలను ఎదుర్కోవడానికి సంఘటితంగా ఉండాలని ఆయన బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు.ట్రంప్ ప్రభుత్వం అమెరికా, దాని వాణిజ్య భాగస్వాముల మధ్య సుంకాలను వేగంగా పెంచడం, అలాగే ఒపెక్ దేశాలు ఉత్పత్తిని పునరుద్ధరించాలని యోచిస్తుండటంతో బ్రెంట్ క్రూడ్ ధర 2021 తర్వాత అతిపెద్ద నెలవారీ నష్టాన్ని చవిచూసే దిశగా పయనిస్తోంది. చాలా దేశాలు వాషింగ్టన్‌తో వాణిజ్య చర్చలు జరుపుతున్నప్పటికీ, బీజింగ్ మాత్రం చర్చలకు దూరంగా ఉంటోంది.మరోవైపు, స్పెయిన్, పోర్చుగల్ గత కొన్నేళ్లలోనే అత్యంత దారుణమైన విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొన్నాయి, దీనివల్ల స్పెయిన్‌లోని అనేక చమురు శుద్ధి కర్మాగారాలు ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరాను క్రమంగా పునరుద్ధరిస్తున్నారు.

భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు..

ప్రస్తుతం భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దేశంలోని వివిధ నగరాల్లో ధరలు వేర్వేరుగా ఉంటాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గుతున్న క్రమంలో.. ఇక్కడ కూడా తగ్గించాల్సి ఉంది కానీ గతంలో నష్టాల్ని పూడ్చుకునేందుకు చమురు కంపెనీలు అందుకు ససేమిరా అంటున్నాయి. దీంతో గత కొంతకాలంగా ధరల్లో పెద్దగా మార్పు లేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, దేశీయంగా మాత్రం ఆ ప్రభావం వెంటనే కనిపించడం లేదు. ఈరోజు (ఏప్రిల్ 29, 2025) హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద, లీటర్ డీజిల్ ధర రూ. 95.70 వద్ద స్థిరంగా ఉంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయా లేదా అనేది వేచి చూడాలి.

## విదేశాల నుంచి టాక్స్ లేకుండా
# ఎంత బంగారం తేవొచ్చు?



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రవాస భారతీయులకు కచ్చితంగా తెలుసుకోవాల్సిన విషయం ఇది. మీరు విదేశాల నుంచి బంగారాన్ని భారతదేశానికి తీసుకురావాలని యోచిస్తున్నారా? అయితే, మీరు తప్పనిసరిగా కొన్ని నియమ నిబంధనల గురించి తెలుసుకోవాలి. లేకపోతే, మీరు భారీగా సుంకాలు చెల్లించాల్సి రావచ్చు లేదా మీ బంగారం సీజ్ అయ్యే ప్రమాదం కూడా ఉంది! విదేశాల్లో నివసించే భారతీయులు తిరిగి వచ్చేటప్పుడు బంగారాన్ని తీసుకురావడానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆ పరిమితులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం!విదేశాల్లో ఏడాదికి పైగా నివసించి తిరిగి వచ్చే పురుషులు 20 గ్రాముల వరకు లేదా రూ. 50 వేల విలువైన బంగారు ఆభరణాలను మాత్రమే వెంట తెచ్చుకోవడానికి అనుమతిస్తారు. మహిళల విషయానికి వస్తే, వారు 40 గ్రాముల వరకు లేదా రూ. 1 లక్ష విలువైన ఆభరణాలను తీసుకురావచ్చు. అయితే, మీరు 6 నెలలకు మించి విదేశాల్లో నివసిస్తూ, 1000 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను తెచ్చుకుంటే, అప్పుడు మీరు వాటి విలువపై 16 శాతం సుంకాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు పైన పేర్కొన్న కనీస కాలావధిలో విదేశాల్లో నివసించకపోయినా లేదా మీరు అనుమతించిన దానికంటే ఎక్కువ, అంటే ఒక కిలో కంటే ఎక్కువ బంగారాన్ని భారతదేశానికి తీసుకువచ్చినా, మీరు దాని విలువపై ఏకంగా 44 శాతం సుంకాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇది చాలా పెద్ద మొత్తం, కాబట్టి ఈ నిబంధనలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం.చాలా మంది ప్రవాస భారతీయులు తాము నివసించిన దేశాల నుండి జ్ఞాపికలుగా లేదా పెట్టుబడి ప్రయోజనాల కోసం బంగారాన్ని తీసుకురావాలని భావిస్తారు. అయితే, సరైన సమాచారం లేకపోవడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కాబట్టి, మీరు లేదా మీ బంధువులు ఎవరైనా విదేశాల నుంచి బంగారాన్ని తీసుకురావాలని ఆలోచిస్తుంటే, ఈ పరిమితులను వారికి తెలియజేయడం చాలా ముఖ్యం.ఈ నియమాలు కేవలం బంగారు ఆభరణాలకే కాకుండా, ఇతర రూపాల్లోని బంగారంపై కూడా వర్తిస్తాయి. కాబట్టి, మీరు ఏ రూపంలో బంగారం తెచ్చినా, దాని పరిమితులు, వర్తించే సుంకాలను ముందుగానే తెలుసుకోవడం మంచిది. లేకపోతే, మీ విలువైన బంగారం మీ చేతికి అందకుండా పోయే ప్రమాదం ఉంది.ఈ పరిమితులు బంగారు ఆభరణాలకే వర్తిస్తాయి. బంగారు బిస్కెట్లు లేదా ఇతర రూపాల్లో తెచ్చే బంగారంపై కస్టమ్స్ నిబంధనలు వేరుగా ఉంటాయి. ఒకవేళ మీరు అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ బంగారం తెస్తే, దానిని కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా ప్రకటించాలి. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి, ప్రయాణించే ముందు కస్టమ్స్ నిబంధనలను పూర్తిగా తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాబట్టి, ప్రవాస భారతీయులారా! మీ బంగారు ప్రయాణం సజావుగా సాగాలంటే, ఈ పరిమితులను తప్పక గుర్తుంచుకోండి!

## భారీ ధర పలుకుతున్న బంగారం..! అక్షయ తృతీయ రోజున భారీ కొనుగోళ్లు జరిగేనా..?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయు లకు బంగారం ఎంటే ఎంతో మక్కువ. వివాహాలు, ఇతర శుభాకార్యాల సమయంలో పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా అక్షయ తృతీయ రోజున పెద్ద ఎత్తున పసిడిని కొనుగోలు చేస్తుంటారు. అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు సెంటిమెంట్‌గా మారింది. ప్రస్తుతం, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత కొద్దిరోజులుగా ధరలు గణనీయంగా తగ్గుతూ వచ్చాయి. వ్యాపారులు లాభాల స్వీకరణకు దిగడం, డాలర్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నాయి. అయినప్పటికీ అక్షయ తృతీయ రోజున భారతీయులు పెద్ద సంఖ్యలో బంగారం కొంటారని బులియన్ మార్కెట్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు అవసరానికి అనుగుణంగా ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారని.. తేలికపాటి ఆభరణాల నుంచి గోల్డ్ ఈటీఎఫ్స్, డిజిటల్ గోల్డ్, బార్‌లతో సహా కాయిన్స్ వరకు వివిధ రకాలుగా బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ నెల 30న అక్షయ తృతీయ రోజున ధరలను పరిశీలించి బంగారం కొనాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవచ్చని ఆభరణాల వ్యాపారులు పేర్కొంటున్నారు.

**ధరలు అధికంగా ఉన్నా బంగారంపై సెంటిమెంట్ బలంగానే..**

పీఎన్‌జీ జ్యువెల్లర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ గాడ్గిల్ మాట్లాడుతూ.. బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ.. వినియోగదారుల సెంటిమెంట్ బలంగానే ఉందని పేర్కొన్నారు. అక్షయ తృతీయ రోజున బంగారం అమ్మకాలు పెరుగుతాయని తాము ఆశిస్తున్నామని తెలిపారు. అయితే, అధిక ధరలు గత సంవత్సరంతో పోలిస్తే వాల్యూమ్ వృద్ధిని తగ్గించవచ్చని.. విలువ పెరుగుదల కారణంగా ఇది భర్తీ చేయబడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అమ్మకాలపై ఎలాంటి ఒత్తిడిని కనిపించడం లేదని, దాంతో పాటు ముఖ్యంగా ప్రపంచ అనిశ్చితి దృష్ట్యా బంగారాన్ని సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడిగా చూస్తున్నారన్నారు. ఈ పండగ సీజన్‌లో బలమైన అమ్మకాలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నాణేలు, బార్ బుకింగ్ చాలాకాలం కిందట జరిగిందని ఇండియన్ బులియన్ అండ్ జ్యువెలరీ అసోసియేషన్ జాతీయ ప్రతినిధి కుమార్ జైన్ చెప్పారు. కానీ, గత సంవత్సరం కంటే చాలా తక్కువ. అయినప్పటికీ, అక్షయ తృతీయ నాడు అమ్మకాలు ఉండవచ్చని ఆశిస్తున్నారు. జవేరి బజార్‌లోని బీడీ బ్యాంగిల్స్ శ్రేయాస్ కొఠారి మాట్లాడుతూ.. ఈ సందర్భంగా వినియోగదారులు షాపింగ్ చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. అధిక బంగారం ధరల కారణంగా తేలికైన ఆభరణాల కొనుగోలు ఉంటుందని.. పాత ఆభరణాల స్థానంలో కొత్త ఆభరణాలతో మార్పిడి ఉంటుందని అంచనా. ఆభరణాల తయారీపై డిస్కౌంట్స్ అందిస్తున్నామని.. కొనుగోలుదారుల కోసం అనేక ఆఫర్లను తీసుకువస్తున్నట్లు తెలిపారు.

**జనవరి నుంచి ప్రపంచ ధరలు 25 శాతం పెరిగాయి..**


వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా రీజనల్ సీఈవో సచిన్ జైన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది బంగారానికి కీలకమైందని పేర్కొన్నారు. జనవరి నుంచి ప్రపంచ ధరలు 25శాతం పెరిగాయి. దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు పది గ్రాములకు రూ. లక్షకు చేరుకుంది. సురక్షితమైన పెట్టుబడి, మంచి రాబడి కారణంగా బంగారంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ.. ఈ అక్షయ తృతీయ రోజున కొనుగోళ్లు ఉంటాయని ఆయన చెప్పారు. బంగారం ఈటీఎఫ్స్, డిజిటల్ బంగారం, నాణేలు, గోల్డ్ బార్స్‌లు వివిధ రకాల బంగారంపై కొనుగోలుదారులు బలమైన ఆసక్తిని చూపిస్తున్నారని వర్గాలు తెలిపాయి. బంగారం ఆభరణాల రిటైలర్లు తగినంత స్టాక్స్‌ని కలిగి ఉండగా.. పండుగలతో పాటు వివాహాల సీజన్‌లో ప్రారంభమవుతున్నందున కొనుగోళ్లు ఆశాజనకంగా ఉండొచ్చని ఆశిస్తున్నారు.

**ఆశాజనకంగా ఉండొచ్చు..!**

లైట్ వెయిటెడ్ ఆభరణాలను తయారు చేసే అన్ని బ్రాండ్లు అక్షయ తృతీయ రోజున అమ్మకాలను పెంచేందుకు వినియోగదారులకు వివిధ ఆఫర్లు, డిస్కౌంట్లను అందిస్తున్నాయి. ఇందులో ప్రత్యేక కొనుగోళ్లపై 0.5 గ్రాముల బంగారు నాణెం ఉచితంగా ఇస్తున్నది. వజ్రాల ఆభరణాలపై 60 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నది. అదే సమయంలో బంగారు ఆభరణాల తయారీపై వినియోగదారులకు 100 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నది. అక్షయ తృతీయ నాడు అమ్మకాలను పెంచేందుకు క్యారెట్లేన్ నుంచి షాపింగ్ చేసేటప్పుడు వినియోగదారులు 0.5 గ్రాముల బంగారు నాణెం ఉచితంగా ఇస్తున్నట్లు క్యారెట్లేన్ సీఈవో సౌమెన్ భౌమిక్ చెప్పారు. ఇది అక్షయ తృతీయ రోజున కొనుగోలును మరింత ప్రత్యేకంగా చేస్తుందని.. ఈ సందర్భంగా అనేక ఆఫర్లు, ఫాస్ట్ డెలివరీ సౌకర్యం అందుబాటులో ఉన్నాయన్నారు. తనిష్క్ మియా బిజినెస్ హెడ్ శ్యామల రామనన్ మాట్లాడుతూ.. మియా అక్షయ తృతీయకు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామని.. అక్షయ తృతీయకే పరితమైన వజ్రం, వెండి బంగారు ఆభరణాలపై భారీ తగ్గింపులు ఇస్తున్నట్లు వివరించారు.

**గతేడాది అక్షయ తృతీయ బంగారం ధరలు..**

గతేడాది అంటే 2024లో అక్షయ తృతీయన మే 10న ఉండగా.. బంగారం ధరలు పది గ్రాములకు రూ.73,240గా ఉంది. అప్పటి నుంచి బంగారం ధరల్లో ఈ పెరుగుదల కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం పది గ్రాములకు రూ. 95,420 పలుకుతున్నది. గత 11 నెల్లలో బంగారం ధరల్లో 31శాతం పెరిగింది. గత సంవత్సరం అక్షయ తృతీయ రోజున బంగారం అమ్మకాలు 20శాతానికిపైగా పెరిగాయి. ప్రస్తుత కాలంలో బంగారం ధరల మెరుగుదలను అంచనా వేయడం కష్టమని సౌరభ్ గాడ్గిల్ పేర్కొన్నారు.



## గుళ్లకు వెళ్లినంత మాత్రానా బీజేపీలో చేరినట్లు కాదు: ప్రీతీ జింతా




**న్యూఢిల్లీ-నవభూమి:**గుడులకు వెళ్లినంత మాత్రాన బీజేపీలో చేరినట్లు కాదు అని నటి ప్రీతీ జింతా అన్నారు. విదేశాలకు వెళ్లిన తర్వాత స్వదేశం విలువ మరింత తెలిసి వచ్చిందన్నారు. ఏడేళ్ల బ్రేక్ తర్వాత ప్రీతీ జింతా మళ్లీ హిందీ సినిమాలో నటించనున్నారు. రాజ్‌కుమార్ సంతోషి తీస్తోన్న లాహోర్ 1947లో ఆమె నటిస్తోంది. అయితే ఇటీవల మహాకుంభమేళాకు వెళ్లిన ఆమె అక్కడ పుణ్యస్నానాలు చేశారు. ఆ తర్వాత వారణాసిలో ఉన్న కాశీ విశ్వేశ్వరుడిని మహాశివరాత్రి నాడు దర్శించుకున్నారు. అయితే సోషల్ మీడియాలో ఓ వ్యక్తి ప్రీతీకి ప్రశ్న వేశారు. బీజేపీలో చేరుతున్నారా అని ఆమెను అడిగారు. సోమవారం రాత్రి ఆ ప్రశ్నకు ప్రీతి జింతా బదులిచ్చారు. సోషల్ మీడియా జనంతో ఇదే సమస్య అని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ద్వారానే నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గుడికి వెళ్లినా, కుంభమేళాకు వెళ్లినా.. తన ఐడెంటీ పట్ల గర్వంగా ఫీలవుతున్నానని, దీని ఉద్దేశంతో రాజకీయాల్లో చేరుతున్నట్లు కాదన్నారు. విదేశాల్లో ఉన్న సమయంలో.. భారత దేశ ఔనత్యం తెలిసివచ్చిందన్నారు. అందరి తరహాలోనే తాను కూడా భారత దేశాన్ని అభినందిస్తున్నాన్నారు. విదేశాల్లో జీవిస్తున్న ఓ తల్లిగా.. తన పిల్లలకు భారతీయ విలువలు నేర్పుస్తున్నట్లు చెప్పారు. భారతీయ మూలాలు ఉన్న విషయాన్ని మరిచిపోకుండా చేస్తున్నాన్నారు.

## ప్రధాని మోదీని తిడితేనే కాంగ్రెస్ నేతలకు తిన్నది అరుగుతుంది..!



**శ్రీనగర్--నవభూమి:**పహల్గాం ఉగ్రదాడి సమయంలో ప్రధాని నరేంద్రమోదీ సౌదీఅరేబియాలో ఉన్నారు. దాంతో దాడి జరిగిన వెంటనే ప్రధాని ఆదేశాల మేరకు హెూంమంత్రి అమిత్ షా నే అన్ని వ్యవహారాలు చూసుకున్నారు. ఈ సందర్భాన్ని ఉద్దేశించి ప్రధానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ 'గాయబ్ అనే టెక్స్‌తో ఒక గ్రాఫిక్ ఇమేజ్‌ను పోస్టు చేసింది. కీలక సమయంలో ప్రధాని మాయమయ్యాడనే ఉద్దేశంతో ఈ పోస్టు పెట్టింది. పలువురు కాంగ్రెస్ నేతలు కూడా మోదీ సమయానికి అందుబాటులో లేకపోవడంపై విమర్శలు చేస్తున్నారు.దీనిపై ఆర్ఎస్ఎస్ నేత ఇంద్రేశ్ కుమార్ స్పందించారు. ప్రధాని నరేంద్రమోదీని తిట్టకపోతే కాంగ్రెస్ నేతలకు తిన్నది అరగడం లేదని, అందుకే వాళ్లు రోజూ ప్రధానిని దూషిస్తారని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రం ఒకవేళ పాకిస్థాన్‌పై మిలిటరీ యాక్షన్‌కు సిద్ధపడినా కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని ఆరోపించారు. ఆర్మీ యుద్ధానికి సిద్ధపడితే కాంగ్రెస్ పార్టీ ఆర్మీ కమాండర్‌ను వ్యతిరేకిస్తుందని విమర్శించారు. సమాజంలో కాంగ్రెస్ నేతలు ఏ ఒక్క మంచిపని చేయరని, పైగా మంచిపని చేసేవాళ్లను కించపరుస్తారని ఆరోపించారు. ఇదే వారి రాజకీయ విధానంగా మారిపోయిందని అన్నారు.


## సింధూ జలాల ఒప్పందం రద్దుతో.. చీనాబ్ నదిలో పాకిస్థాన్‌కు తగ్గిన నీటి ప్రవాహం.. శాటిలైట్ చిత్రాలు రిలీజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందాన్ని( భారత్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీని ఫలితంగా చీనాబ్ నదిలో నీటి ప్రవాహం తగ్గినట్లు గుర్తిస్తున్నారు. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టమైంది. ఇండియా నుంచి పాకిస్థాన్‌లోకి చీనాట్ నది ప్రవహిస్తుంది. పాకిస్తాన్‌లోని సియాల్‌కోట్ వద్ద ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని శాటిలైట్ చిత్రాల ద్వారా పసికట్టారు. ఒప్పందాన్ని సస్పెండ్ చేయడానికి ముందు ఏప్రిల్ 21వ తేదీన ఉన్న నీటి స్థాయిని, ఆ తర్వాత ఏప్రిల్ 26వ తేదీన బ్యారేజీ వద్ద ఉన్న నీటి స్థాయిని శాటిలైట్ చిత్రాల ద్వారా రిలీజ్ చేశారు.

ఏప్రిల్ 26 తర్వాత బ్యారేజ్ వద్ద ఎక్కువగా బురుద, రాళ్లు పేరుకుపోయినట్లు గుర్తించారు. మరలా హెడ్‌వర్క్స్ వద్ద కొన్ని ప్రాంతాల్లో నీటి స్థాయి పూర్తిగా పడిపోయిందని, శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం స్పష్టం అవుతున్నట్లు కల్నల్ వినాయక్ భట్ తెలిపారు. శాటిలైట్ చిత్రాలను విశ్లేషించే ఆయన వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత ఇండియాలో చీనాబ్ నది నీటి స్టోరేజీ పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.చంద్ర, భాగా నదులు కలిసిన తర్వాత చీనాబ్ నదిగా మారుతుంది. మనాలీ, లేహ్ రూట్లో ఉన్న బరాలాచా లా పాస్ వద్ద ఆ నదులు కలుస్తాయి. చంబా మీదుగా నార్త్ వెస్ట్ రూట్లో చీనాబ్ నీరు జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశిస్తుంది. కిస్టావర్, దోడా, రాంబన్, రియాసీ, జమ్మూ జిల్లాల మీదుగా ఆ నది ప్రవహిస్తుంది. ఆ తర్వాత పాకిస్థాన్‌లోని బవల్‌పుర్‌లో సట్లజ్ నదిలో కలుస్తుంది. ఈ నదిపై హైడ్రో పవర్‌ను అధిక స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు. భారత్ వైపునే సుమారు ఏడు వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు.పాకిస్థాన్ వైపు చీనాబ్ నదిపై ఉన్న మరలా హెడ్‌వర్క్స్ బ్యారేజీ.. అక్నూర్ సెక్టార్‌లోని అంతర్జాతీయ బోర్డర్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనిపై ప్రధానంగా రెండు ఇరిగేషన్ లింకు కెనాల్స్ ఉన్నాయి. మరలా-రావి లింక్ కింద సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఇక బంబన్‌వాలా-రావి-బెడియాన్-దీపాల్‌పుర్ కెనాల్ కింద సుమారు 4200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. ఈ కెనాల్‌నే ఇచోగిల్ కెనాల్ అని కూడా పిలుస్తారు.హెడ్‌వర్క్స్, ఎంఆర్ఎల్ బ్యారేజీలను బ్రిటీష్ కాలంలో నిర్మించారు. 1906 నుంచి 1912 మధ్యలో వీటిని కట్టారు. పాకిస్థాన్‌లో ఉన్న గుర్జన్‌వాలా ప్రాంతానికి నీరు వెళ్తుంది. ఇక్కడ ప్రవహించే నీటికి మిలిటరీ ప్రాముఖ్యత కూడా ఉంటుంది. పాకిస్థాన్‌లో ఉన్న ఎక్కువ ఆర్మీ యూనిట్లు అన్నీ ఇక్కడ కెనాల్స్‌పై ఆధారపడుతుంటాయని రక్షణశాఖ నిపుణులు వెల్లడిస్తున్నారు. నీటి ప్రవాహం తగ్గడం వల్ల అది సైనిక సత్తాపై నేరుగా ప్రభావం పడే అవకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

## బాలికపై సామూహిక అత్యాచారం.. ముగ్గుర్ని అరెస్టు చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ-నవభూమి:**జారండ్‌లో ఓ బాలికను సామూహిత్యంగా అత్యాచారం చేసిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేశారు. రాంచీలో ఆ నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. నామ్‌కుమ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన కొన్ని రోజుల క్రితం జరిగినట్లు తెలుస్తోంది. బాలిక తండ్రి ఏప్రిల్ 27వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని, రేప్‌కు పాల్పడిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు రాంచీ ఎస్పీ సుమిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు. నేరానికి పాల్పడినట్లు ఆ ముగ్గురూ అంగీకరించినట్లు ఆయన చెప్పారు. నిందితుల్ని జగదీశ్ స్వాన్సి, విష్ణు ముండ, దీపక్ ముండాగా గుర్తించారు. బాధిత బాలికకు, విష్ణు అనే వ్యక్తికి గతంలో పరిచయం ఉన్నది. వాళ్లు సోషల్ మీడియాలో టచ్‌లో ఉన్నారు. మార్కెట్‌కు వెళ్లి ఇంటికి వస్తున్న అమ్మాయిని విష్ణు అనే వ్యక్తి ఓ కొండ ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఫిర్యాదు ద్వారా తెలిసింది. ఆ కొండ వద్ద విష్ణు మిత్రులు అక్కడే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక ముగ్గురు కలిసి ఆ అమ్మాయిని రేప్ చేశారని ఎస్పీ వెల్లడించారు.

# పాక్ రక్షణ మంత్రికి ఇండియా బిగ్ షాక్



**శ్రీనగర్--నవభూమి:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో.. పాక్-భారత్ దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ముఖ్యంగా 26 మంది అమాయక పర్యటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందిన వాళ్లు కావడంతో.. ఆ దేశంపై పగ తీర్చుకునేందుకు ఇండియా కఠిన చర్యలు తీసుకుంటోంది. వీటిని ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్న పాక్ మంత్రులు.. భారత్‌పై అక్కసును వెళ్లగక్కుతూనే ఉన్నారు. ముఖ్యంగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అయితే తరచుగా నోరు పారేసుకుంటున్నారు. దీంతో అతడికి ఇండియా బిగ్ షాక్ ఇచ్చింది. మరోసారి నోరు విప్పకుండా చర్యలు చేపట్టింది.పహల్గాం ఉగ్రదాడి తర్వాత నుంచి భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాక్‌పై దౌత్యపరమైన చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా సింధూ నదీ జలాల ఒప్పందం రద్దుతో పాటు ఆ దేశ పౌరులను తిరిగి వెనక్కి పంపించి వేస్తోంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్.. ఇండియాపై అక్కసును వెళ్లగక్కుతున్నారు. మొదట్లో తమకు ఈ దాడితో ఏ సంబంధమూ లేదని చెప్పిన ఈయనే.. ఆ తర్వాత ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో షాకింగ్ కామెంట్లు చేశారు. తామే అమెరికా, పశ్చిమ దేశాల కోసం గత 30 ఏళ్లుగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వివరించారు. నేరుగా ఆయనే ఇదంతా ఓ చెత్త పని అని కూడా ఒప్పుకున్నారు. ఆ తర్వాత ఇండియా తమపై ఎప్పుడైనా దాడి చేయొచ్చని.. అందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు కూడా ప్రకటించారు. 130 అణుబాంబులు ఎక్కిపెట్టి ఉన్నాయని.. వాటిని ఎప్పుడైనా వాడుతామన్నారు. ఇలా తరచుగా మేకపోతు గాంభీర్యం చూపిస్తూ.. ఇండియాకు హెచ్చరికలు జారీ చేస్తున్న ఈయనకు తాజాగా భారత్ గట్టి షాక్ ఇచ్చింది. ముఖ్యంగా పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి నోరు పారేసుకోకుండా ఆయన ఎక్స్ ఖాతాపై నిషేధం విధించింది. అయితే యాలోనే ఈయన ఎక్స్ ఖాతాపై నిషేధం ఉండబోతుంది. ముఖ్యంగా ఆయన జమ్ము కశ్మీర్‌పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో ఈ చర్యలు తీసుకుంది. ఈపని చేయడానికి కొన్ని గంటల ముందే పాకిస్థాన్ అధికారిక ఎక్స్ ఖాతాను సైతం మన దేశంలో కేంద్రం నిలిపివేసింది. ఇవి మాత్రమే కాకుండా ఆ దేశానికి చెందిన కొంతమంది జర్నలిస్టుల ఖాతాలను సైతం నిషేధించింది. అంతేకాదండోయ్.. సోమవారం రోజే తప్పుడు, రెచ్చగట్టే, సున్నితమైన, మతపరమైన అంశాల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయని ఆరోపిస్తూ.. కేంద్రం 16 పాకిస్థాన్ యూట్యూబ్ ఛానెళ్లపై నిషేధం విధించింది. ఇందులో డాన్ న్యూస్, జియో న్యూస్, సమా టీవీ సునో న్యూస్, ది పాకిస్థాన్ రెఫరెన్స్ తదితర యూట్యూబ్ ఛానెళ్లు ఉన్నాయి.

## ఐరాసలో పాక్ పరువు తీసేసిన భారత్



**శ్రీనగర్--నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజ్ మొహమ్మద్ అసిఫ్ భారత్ తమపై ఏక్షణమైనా ప్రతీకార దాడి చేయొచ్చని, తాము అణ్వాయుధాలను సిద్ధం చేసుకున్నామని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఈ తరుణంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి అసిఫ్ 'ఉగ్రవాదులకు శిక్షణ, నిధులు సమకూర్చినట్టు' బహిరంగంగా అంగీకరించడంతో ఐక్యరాజ్య సమితిలో భారత్ తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ డిప్యూటీ శాశ్వత ప్రతినిధి యోజనా పటేల్ మాట్లాడుతూ.. 'ఉగ్రవాదులకు శిక్షణ, నిధులు సమకూర్చినట్టు బహిరంగంగా అంగీకరించడం ఆశ్చర్యకరమైన విషయం కాదని, ఇది పాకిస్థాన్‌ను ప్రపంచ ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే ద్రోహిగా నిలిపింది' అని దుయ్యబట్టారు. ఐరాస ఉగ్రవాద బాధితుల సంఘం నెట్‌వర్క్ (%ఙూూూచీ%) ప్రారంభం కార్యక్రమంలో పటేల్ మాట్లాడుతూ.. 'ఈ వేదికను (ఐక్యరాజ్యసమితి) ఒక ప్రత్యేక ప్రతినిధి గుంపు (పాకిస్థాన్) దుర్వినియోగం చేసి, భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి ప్రయత్నించడం దురదృష్టకరం. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఇటీవల టీవీ ఇంటర్వ్యూలో తమ దేశం ఉగ్రవాద సంస్థలకు మద్దతు, శిక్షణ, నిధులు సమకూర్చిన చరిత్రను బహిరంగంగా ఒప్పుకున్న విషయాన్ని మొత్తం ప్రపంచం విందే.. ఈ బహిరంగ ఒప్పుకోలు ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇది పాకిస్థాన్‌ను ప్రపంచ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న ద్రోహి అని బయటపెట్టింది' అని ఆమె విమర్శించారు. "'ప్రపంచం ఇకపై కళ్లు మూసుకోరాదు' అని పటేల్ మరోసారి హితవు పలికారు. నెట్‌వర్క్ అనేది ఉగ్రదాడుల బాధితులకు, ప్రత్యక్ష సాక్షులకు ఒక సురక్షిత వేదికను అందించడం, అలాగే వారిని న్యాయ, శాంతి సాధన పోరాటకారులుగా ప్రోత్సహిం చడమే లక్ష్యంగా పెట్టుకుంది.

భయపడేది లేదు.. పహల్గామ్‌కు మళ్లీ పర్యాటకుల తాకిడిపహల్గామ్ ఉగ్రదాడికి కచ్చితంగా ప్రతీకార తీర్చుకోవాల్సిందేనన్న డిమాండ్లు భారత్ వైపు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. పహల్గామ్‌లోని పరిస్థితులు, సైన్యం తీసుకున్న భద్రతా చర్యల గురించి ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రతిదాడి గురించి ఏదైనా మాట్లాడారా? అనే చర్చ జరుగుతోంది.అదే సమయంలో భారత్ ఏ దాడి చేసినా తాము ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామంటూ పాక్ ప్రగల్భాలు పలుకుతోంది. అయితే భారత్‌తో యుద్ధం అంటే కనీసం పోటీ ఇచ్చే పరిస్థితుల్లో లేకున్నా పాక్ నాయకులు మాటలు కోటలు దాటుతున్నాయి. మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ.. తమ అజ్ఞానాన్ని ప్రపంచ దేశాల ముందు చూపిస్తున్నారు.

## కెమెరాలో రికార్డయిన వేధింపుల ఘటన... ఇన్ఫ్లుయెన్సర్ చర్యకు నెటిజన్లు ఫిదా!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల కాలంలో మహిళలు ఆన్‌లైన్‌లో వేధింపులకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. అయితే, కొందరు ధైర్యంగా వాటిని ఎదుర్కొంటున్నారు. తాజాగా, ఓ ఇన్ఫ్లుయెన్సర్ తనను వేధించిన వ్యక్తికి ఊహించని విధంగా బుద్ధి చెప్పిన వీడియో వైరల్ అవుతోంది. సోషల్ మీడియా ఇన్ఫ్లు యెన్సర్ మాన్సీ సురవాసే ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ షేర్ చేసింది. ఆమె తన అపార్ట్‌మెంట్ భవనంలో రీల్ తీస్తుండగా జరిగిన వేధింపుల దృశ్యాన్ని వీడియో తీసింది. ఎరుపు రంగు స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించిన మాన్సీ, మెట్లపై తన లుక్ సరిచేసుకుంటుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చాడు. గులాబీ, తెలుపు రంగు చారల టీ-షర్ట్, నీలం రంగు ప్యాంటు ధరించిన ఆ వ్యక్తి మెట్లు ఎక్కుతుండగా, మాన్సీ మర్యాదగా పక్కకు జరిగింది. అయితే, అతను కేవలం దాటి వెళ్ళకుండా ఆమెను అసభ్యకరంగా టచ్ చేశాడు. వెంటనే రియాక్ట్ అయిన మాన్సీ అతన్ని నిలదీసి గట్టిగా చెంప చెల్లుమనిపించింది. ఆ దృశ్యం కెమెరాలో రికార్డయింది. ఆ వ్యక్తి వెంటనే అక్కడి నుండి పారిపోతూ పదే పదే "సారీ, సారీ!" అంటూ క్షమాపణలు చెప్పాడు. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో మాన్సీ ఈ ఘటన తర్వాత తాను సాక్ష్యాలతో సహా ఆ వ్యక్తి కుటుంబ సభ్యులను నిలదీసినట్లు తెలిపింది. ఆ కుటుంబం అతనికి "మానసిక ఆరోగ్య సమస్యలు" ఉన్నాయని, అలాంటి ప్రవర్తన క్షమించమని కోరినట్లు తెలిపింది. ఈ వీడియో వైరల్ కావడంతో మాన్సీ ధైర్యానికి నెటిజన్ల నుంచి మంచి మద్దతు లభించినప్పటికీ, అధికారికంగా పోలీసు ఫిర్యాదు దాఖలు చేశారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

## ప్లీజ్ పాక్‌కు పంపొద్దు.. లేకుంటే చంపి శవాలను పార్శిల్ చేయండి..



**శ్రీనగర్--నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఆంక్షలు విధించిన భారత్.. వీసాలపై పాక్ నుంచి వచ్చిన పౌరులు, ఆ దేశస్థులు తక్షణమే విడిచి వెళ్ళాలని ఆదేశించింది. ఈ క్రమంలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పాకిస్థానీయులను గుర్తించి పంపుతున్నారు. దీంతో 2010 పునరావాస విధానం కింద జమ్మూ కశ్మీర్ వచ్చిన మాజీ ఉగ్రవాదుల భార్యలు ఆందోళన చెందుతున్నారు. తమను తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లగొట్టడం కంటే చంపేసి, శవాలను సంచుల్లో పంపించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తాము కశ్మీర్‌లోనే ఉంటామని, ఇక్కడ నుంచి వెళ్లబోమని తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. ఇక్కడే చనిపోతామని అంటున్నారు. తమను చంపి శవాలనైనా పాకిస్థాన్ పంపమని వేడుకుం టున్నారు. అయితే, గడువులోగా భారత్ విడిచి వెళ్లకుంటే భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పదని ప్రభుత్వం హెచ్చరించింది.2013లో కశ్మీర్‌కు చెందిన పాకిస్థాన్ మహిళ అలీజా రఫీక్ మాట్లాడుతూ.. 'నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నా చిన్న కూతురు, భర్త ఇక్కడే ఉంటారు. మమ్మల్ని వెళ్ళిపొమ్మంటున్నారు. మాకు ఇల్లు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు అన్నీ ఉన్నాయి. ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి రమ్మంది. మేం ఏం తప్పు చేశాం?' అని ప్రశ్నించారు. తమ పట్ల దయతో ఉండాలని, తమను ఇక్కడే ఉండనివ్వాలని ఆమె గవర్నర్‌ను వేడుకున్నారు. 'మా పట్ల క్రూరంగా ప్రవర్తించకండి. మేం ఏ పాపం చేయలేదు. దయచేసి మమ్మల్ని ఇక్కడే ఉండనివ్వండి లేదా మా మృతదేహాలను సరిహద్దు దాటించండి' అని ఆమె అన్నారు.జాహిదా బేగం అనే మరో మహిళ కూడా తన ఆవేదనను వ్యక్తం చేశారు. తాను 15 ఏళ్లుగా కశ్మీర్‌లో ఉంటున్నానని చెప్పారు. తనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కొడుకును ఇక్కడే వదిలి వెళ్లమంటున్నారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. 'కశ్మీర్‌లో 15 ఏళ్లుగా ఉంటున్నాం. అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయి. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడ్ని ఇక్కడే వదిలి వెళ్లమన్నారు. నేను ఇక్కడి నుంచి వెళ్లను. ఈ నిర్ణయం నా పిల్లల జీవితాలను నాశనం చేస్తుంది. నన్ను క్షమించండి' అని ఆమె వాపోయారు.పహల్గామ్ దాడితో ఆగిపోయిన భారత అబ్బాయి- పాక్ అమ్మాయి పెళ్లి..నౌరీన్ అనే మరో పాక్ మహిళ మాట్లాడుతూ.. కుటుంబంతో కలిసి కశ్మీర్‌లో నిశ్చింతగా బతుకుతున్న నాకు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లాలనే ఆలోచన భరించలేనిది అని కన్నీటిపర్యంత మయ్యింది. 'మేము ఇక్కడికి మెరుగైన జీవితాన్ని గడపడానికి వచ్చాం.. మళ్ళీ అదే గందరగోళాన్ని ఎదుర్కోవడా నికి కాదు.. ' అన్నారు. తన ఆధార్, ఎన్నికల కార్డులను కూడా చూపించి. ఈ ప్రాంతంతో తనకున్న లోతైన సంబంధాలను నొక్కి చెప్పింది."నేను వెళ్ళిపోవాలనుకోవడం లేదు. ఇది నా ఇల్లు. నేను నా పిల్లలను ఇక్కడే పెంచాను, ఇప్పుడు మేము నిర్మించుకున్న ప్రతిదానిని మా నుంచి దూరంగా తీసుకెళ్లాలనుకుంటున్నారు' అని ఆమె చెప్పింది. వీళ్లే కాదు.. కశ్మీర్‌లో ఇలాంటి మహిళలు చాలా మందికి ఇలాంటి పరిస్థితే.

## కెనడాకు కాబోయే ప్రధాని... ట్రంప్‌పై అలా - భారత్‌పై ఇలా!



**కెనడా-నవభూమి:** కెనడాలో అధికార లిబరల్ పార్టీ మరోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయమైంది. దీంతో... కెనడా నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేం దుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. భారత్ తో బలహీనపడిన బంధాలు, ట్రంప్ సుంకాల యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... కెనడాలో అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈ సమయంలో.. నూతన ప్రధానిగా మరోసారి మార్క్ కార్ని బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో... మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో పాలనలో గణనీయంగా దెబ్బతిన్న న్యూఢిల్లీ, ఒట్టావా మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో సాధ్యమైన మెరుగుదలను సూచిస్తుందని తెలుస్తోంది. క్రికెట్టే వైభవ్ జీవితం తాజాగా ప్రసంగించిన కార్నీ... ప్రజల్లో విభేదాలు సృష్టించి, విచ్ఛిన్నం చేసి కెనడాను సొంతం చేసుకోవాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ భావిస్తున్నారని.. ఆ ఉద్దేశంతోనే అమెరికా సుంకాలు, విలీనానికి సంబంధించిన బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అయితే... ఎట్టిపరిస్థితుల్లోనూ కెనడియన్లు ఐక్యంగా ఉండాలని.. అమెరికా బెదిరింపులకు భయపడకూడదని అన్నారు. మరోపక్క తన ప్రచారంలో కార్నీ.. భారత్ తో సంబంధాలను పునర్నిర్మించడం ప్రాధాన్యతగా గుర్తించారు. ఇందులో భాగంగా... భారత్ తో సంబంధాన్ని పునర్నిర్మించడానికి అవకాశాలు ఉన్నాయని.. ఆ వాణిజ్య సంబంధం చుట్టూ విలువల ఉమ్మడి భావన ఉండాలని.. తాను మరోసారి ప్రధాని అయితే దాన్ని నిర్మించే అవకాశం కోసం ఎదురుచూస్తానని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. 2023 జూన్ లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రేలోని గురుద్వార్ వెలుపల కెనడియన్ పౌరుడు, ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారతీయ ఏజెంట్ల పాత్ర ఉందని ట్రూడో ప్రభుత్వం సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరోపణలు భారత్ తీవ్రంగా ఖండించింది. నాటి నుంచి భారత్ - కెనడా సంబధాలు గతంలో ఎన్నడూ లేనంతగా దెబ్బతిన్నాయి. మరోపక్క... కెనడా తమలో విలీనం కావాలని ఇప్పటికే పలుమార్పు ట్రంప్ బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కెనడా ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఆయన మరోసారి ఈ విషయంపై స్పందిస్తూ... అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా చేరితే ఇప్పటివరకూ విధించిన సుంకాలను పూర్తిగా తొలగిస్తామని అన్నారు.

## ఖలీస్తానీ శక్తులకు చావుదెబ్బ.. కెనడా ఎన్నికల్లో జగ్మీత్ సింగ్ ఓటమి..



**కెనడా-నవభూమి:**కెనడా ఎన్నికల్లో ఖలిస్థాన్ అనుకూల శక్తులకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. భారత సంతతికి చెందిన జగ్మీత్ సింగ్ నాయకత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ (ఎన్‌డీపీ) దారుణ పరాజయం పాలైంది. ఖలిస్తాన్ వేర్పాటువాదుల పట్ల సానుభూతితో వ్యవహరించే జగ్మీత్ సింగ్ సైతం పరాజయం పాలయ్యారు. బ్రిటిష్ కొలంబి యాలోని బర్నబీ సెంట్రల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన ఆయన మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ ఎన్డీపీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు జగ్మీత్ ప్రకటించారు. ఇక, ఎన్‌డీపీ 12 స్థానాలకే పరిమితం కావడంతో హౌస్ ఆఫ్ కామన్స్‌లో నేషనల్ పార్టీ హోదాను సైతం కోల్పోయింది. ఈ ఎన్నికల్లో అధికార లిబరల్ పార్టీ నాలుగోసారి విజయం సాధించింది.

**కెనడా రాజకీయాల్లో బలమైన శక్తి..**

కెనడా జనాభాలో సిక్కులు 2 శాతం మాత్రమే ఉన్నారు. కానీ కెనడా రాజకీయాల్లో మాత్రం న్యూ డెమొక్రటిక్ పార్టీ బలమైన ముద్ర వేసింది. గత ఎన్నికల్లో 25 స్థానాలు గెలిచిన న్యూ డెమొక్రటిక్ పార్టీ.. కెనడాలో కింగ్ మేకర్ పాత్ర పోషించింది. ట్రూడో నాయకత్వంలోని మైనార్టీ ప్రభుత్వానికి జగ్మీత్ మద్దతు ఇచ్చారు. ఉగ్రవాది హర్దీప్ సింగ్ హత్య విషయంలో కెనడా ప్రధాని ట్రూడో భారత్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. జగ్మీత్‌ను మెప్పించడం కోసమే ట్రూడో సర్కారు భారత్ వ్యతిరేక వైఖరిని అనుసరించిందనే ప్రచారం జరిగింది. అయితే, కెనడా ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నట్టు గతేడాది సెప్టెంబర్లో జగ్మీత్ సింగ్ ప్రకటించారు. ఈసారి ఎన్నికల్లోనూ చెప్పుకోదగ్గ సీట్లలో విజయం సాధించి.. మరోసారి కింగ్ మేకర్ కావాలని జగ్మీత్ ఆశించారు. కానీ కెనడా ఓటర్లు ఎన్డీపీకి గట్టి షాకివ్వడంతో.. పార్లమెంట్‌లో పార్టీ హోదా సైతం గల్లంతయ్యింది. 2004 తర్వాత ఎన్డీపీ ఇంత తక్కువ స్థానాలు గెలుచుకోవడం ఇదే మొదటిసారి. అప్పటి ఎన్నికల్లో ఎన్డీపీ 15 సీట్లు గెలిచింది. 1983 ఎన్నికల్లోనూ ఎన్డీపీ నేషనల్ పార్టీ హోదా కోల్పోయింది. 2011లో 41 సీట్లు గెలిచిన ఎనీపీ.. 2015లో 44, 2019లో 24, 2021లో 25 స్థానాలు చొప్పున సొంతం చేసుకుంది.

**నేను ఎక్కడికి వెళ్లిపోను: జగ్మీత్**

"ఎన్‌డీపీకి నాయకత్వం వహించడం.. బర్నబీ సెంట్రల్ ప్రజలను ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో గొప్ప గౌరవం. మేం ఎక్కువ స్థానాల్లో గెలవకపోవడం నిరాశకు గురిచేస్తోంది. కానీ మా ఉద్యమం పట్ల నేను నిరాశ చెందడం లేదు.. పార్టీ భవిష్యత్తుపై నాకు నమ్మకం ఉంది.. ఎప్పుడూ భయం కంటే ఆశావాదంవైపు మొగ్గు చూపుతాం' అని జగ్మీత్ ట్వీట్ చేశారు. పార్టీ తరఫున ఎన్నికైన ఎంపీలు దేశ నిర్మాణంలో భాగస్వాములు అవుతారని, కెనడాను ఉత్తమంగా తీర్చుదిద్దుతారని తెలిపారు. అంతేకాదు, ఈ ఓటమి తర్వాత తాను ఎక్కడికీ వెళ్లిపోనని స్పష్టం చేశారు.

**లిబరల్ పార్టీ నాలుగోసారి..**

మార్క్ కార్నీ నేతృత్వంలోని లిబరల్ పార్టీ వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చింది. జస్టిన్ ట్రూడోపై వ్యతిరేకత పెరిగిన తర్వాత ఆయన స్థానంలో కార్నీ కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి.. ఎన్నికల్లో పార్టీని విజయవంతంగా నడిపించారు. పగ్గాలు చేపట్టిన రెండు నెలల్లోనే పార్లమెంట్‌ను రద్దుచేసి... ముందస్తు ఎన్నికలకు వెళ్లి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఎన్నికలకు మరో ఆరు నెలల గడువు ఉండగానే పార్లమెంట్‌ను రద్దు చేయడం ఆత్మహత్యాసదృశ్యం అవుతుందని విమర్శించారు. కానీ, అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఎన్నికల్లో విజయం సాధించి, మరోసారి ప్రధాని పదవి చేపట్టబోతున్నారు.

**మారిన కెనడా వైఖరి..**

భారత్ విషయంలో ట్రూడో చేసిన తప్పులను కార్నీ సరి చేసే ప్రయత్నాలు చేశారు. తన విదేశాంగ విధానాన్ని మారుస్తూ.. భారతదేశంతో మళ్లీ సంబంధాలను పునరుద్ధరించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిపై స్పందిస్తూ.. బాధితులకు కెనడా ప్రధాని కార్నీ సంతాపం తెలిపారు. ఇది భారత్ పట్ల కెనడా వైఖరిలో వస్తున్న మార్పునకు సంకేతంగా భావిస్తున్నారు.


# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

12 | హైదరాబాద్ | బుధవారం | 30 ఏప్రిల్ 2025


నవచిత్ర





## ఎన్టీఆర్-నీల్ మూవీ మరో క్రేజీ రూమర్‌తో భారీ హైప్

ఎన్టీఆర్ అభిమానులతో పాటు, పాన్ ఇండియా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రశాంత్ నీల్ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభం అయింది. ఇటీవలే ఎన్టీఆర్ షూటింగ్‌లో జాయిన్ అయిన విషయం తెల్సిందే. కర్ణాటకలో భారీ సెట్ నిర్మించిన ప్రశాంత్ నీల్ మెజార్టీ షూటింగ్ పార్ట్‌ను అక్కడే చేయబో తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ అంచ నాల నడుమ రూపొందుతున్న ఈ సినిమాలో ఒక ప్రత్యేక పాట ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఆ పాట కోసం ప్రముఖ హీరోయిన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని చాలా రోజులుగా సినీ వర్గాల్లో, మీడియా సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. నేషనల్ క్రష్ రష్మిక మందన్నను ఎన్టీఆర్-నీల్ మూవీలో భాగం చేసేందుకు గాను ప్రయత్నాలు జరుగుతున్నాయని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. శ్రీవల్లిగా రష్మిక మందనకి వచ్చిన క్రేజ్ ఏంటో అందరికీ తెలిసిందే. అలాంటి హీరోయిన్ ఇప్పుడు ఎన్టీఆర్-నీల్ కాంబో మూవీలో నటించడం ద్వారా కచ్చితంగా సినిమాకు మంచి బజ్ క్రియేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అది స్పెషల్ సాంగ్ అయినా కచ్చితంగా ఇప్పటికే ఉన్న అంచనాలు పెంచడం ఖాయం. ఈమధ్య కాలంలో స్టార్ హీరోయిన్స్ ఐటెం సాంగ్స్ మంచి ఆధరణ దక్కించుకుంటున్నాయి. అంతే కాకుండా సినిమాకు అదనపు హైప్‌ను తీసుకు వస్తున్నాయి. అందుకే ఈ సినిమాలో రష్మిక మందన్నతో ఐటెం సాంగ్ చేయించాలని మేకర్స్ భావిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. బ్యాక్ టు బ్యాక్ యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్న రష్మిక మందన్న ప్రస్తుతం పలు సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తోంది.

## ఆరెక్స్ బ్యూటీ వాటితోనే సరిపెడుతుందిగా..?

బాలీవుడ్ లో సీరియల్స్ చేస్తూ ఉన్న భామని ఆరెక్స్ 100 తో టాలీవుడ్ కి పరిచయం చేశాడు డైరెక్టర్ అజయ్ భూపతి. పాయల్ రాజ్ పుత్ చేసిన ఆరెక్స్ 100 సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఐతే పాయల్ కన్నా ముందు అజయ్ ఈ పాత్ర చేయాలని తెలుగులో అప్పటికే పాపులారిటీ సంపాదించిన కొందరు హీరోయిన్స్ ని అడిగాడు. కానీ వాళ్లంతా ఆ పాత్రని రిజెక్ట్ చేశారు. ఐతే పాయల్ మాత్రం ఇలాంటి సినిమాతో ఎంట్రీ బాగుంటుందని ఆలోచించి పిక్ చేసుకుంది. ఇక ఆరెక్స్ 100 సినిమా రిలీజ్ తర్వాత పాయల్ రాజ్ పుత్ టాలీవుడ్ లో మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో హీరోయిన్ పాత్ర పాయల్ తప్ప వేరే ఎవరైనా నాట్ సూటబుల్ అనేలా చేసింది. ఐతే ఆరెక్స్ 100 తర్వాత పాయల్ కి మళ్లీ అదే తరహా పాత్రలు రావడం జరిగింది. ఐతే ఒకటి రెండు పర్వాలేదు కానీ తనని అందరు అలానే చూస్తున్నారని పాయల్ ఫీలైంది. కొన్ని సినిమాల్లో మంచి రోల్స్ పడినా అవి సరిగా ఆడకపోవడంతో అమ్మడు కెరీర్ లో వెనకపడింది. ఐతే మళ్లీ ఆరెక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతితోనే మంగళవారం సినిమా చేసింది పాయల్ రాజ్ పుత్. ఆ సినిమాలో తన నటనతో మెస్మరైజ్ చేసింది అమ్మడు. అదేంటో పాయల్ లో కొత్త కోణాన్ని.. ఆమె లోని నటిని అజయ్ భూపతి మాత్రమే గొప్పగా చూపించగలుగుతున్నాడు. ఈ విషయంలో అజయ్ భూపతికి క్రెడిట్ ఇవ్వాల్సిందే. మంగళవారం సినిమాలో పాయల్ నటనతో ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ తర్వాత మళ్లీ కెరీర్ ఊపందుకుంటుందని అనుకోగా పెద్దగా ఛాన్స్ లు రాలేదు. ఐతే పాయల్ ఫ్రీ టైం లో ఎక్కువగా ఫోటో షూట్స్ చేస్తూ కాలం వెళ్లదీస్తుంది. అమ్మడు ఈమధ్య కాలంలో సినిమాల్లో కన్నా ఫోటో షూట్స్ లోనే ఎక్కువ కనిపిస్తుంది. అది పాయల్ ఫ్యాన్స్ కి కాస్త అసంతృప్తిగా ఉంది. అఫ్కోర్స్ సిల్వర్ స్క్రీన్ మీద చేసే గ్లామర్ షో కన్నా ఫోటో షూట్స్ తోనే ఫాలోవర్స్ ఎక్కువ ఎంటర్టైన్ అవుతున్నారు. అయినా కూడా పాయల్ ని మళ్లీ తర మీద చూడాలని ఉత్సాహ పడుతున్నారు. మంగళవారం 2 ఉంటుందని న్యూస్ వినిపిస్తున్నా అందులో పాయల్ ఉంటుందా లేదా కొత్త హీరోయిన్ ని తీసుకొస్తారా అన్న డౌట్ ఉంది.





## గ్యాప్‌ను పూరించాలని చూస్తోన్న సంయుక్త!

సినీ ఇండస్ట్రీలో ఎవరికి ఎప్పుడు ఎలా ఛాన్సులొచ్చి బిజీ అయిపోతారో తెలియదు. అందుకే అంటారు ఇండస్ట్రీలో ప్రతీ శుక్రవారానికి స్టార్లు మారుతూ ఉంటారని. అలా సడెన్ గా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లా నాయక్ సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చి ఆ సినిమాలో రానాకు జోడీగా నటించి అందరి కళ్లలో పడింది సంయుక్త మీనన్.

మొదటి సినిమానే పవన్ సినిమా కావడం, దానికి తోడు ఆ సినిమా హిట్ అవడంతో సంయుక్తకు ఆఫర్లు క్యూ కట్టాయి. రెండో సినిమాగా కళ్యాణ్ రామ్ తో బింబిసార చేసింది. ఆ సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఆ తర్వాత మూడో సినిమాగా సార్ సినిమాను ధనుష్ తో కలిసి చేసి మరో సూపర్ డూపర్ హిట్ ను అందుకుంది సంయుక్త. దీంతో కెరీర్ స్టార్టింగ్ లోనే బ్యాక్ టు బ్యాక్ విజయాలతో హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న లక్కీ హీరోయిన్ గా సంయుక్త మారిపోయింది. సార్ తర్వాత మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ తో కలిసి విరూపాక్ష సినిమా చేస్తే ఆ సినిమా అందరినీ ఆకట్టుకుంది. విరూపాక్షలో ఏకంగా నెగిటివ్ టచ్ ఉన్న పాత్ర చేసి అందరినీ ఆశ్చర్యపరించింది సంయుక్త. విరూపాక్ష తర్వాత సంయుక్త డిమాండ్, క్రేజ్ మరింత పెరిగాయి. దీంతో అమ్మడికి ఆఫర్లు కూడా బాగానే వచ్చాయి. విరూపాక్ష తర్వాత రెండోసారి కళ్యాణ్ రామ్ తో డెవిల్ సినిమా కోసం జతకడితే ఆ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే సంయుక్త నుంచి డెవిల్ తర్వాత మరో సినిమా వచ్చింది లేదు. సంయుక్త చేతిలో పలు ప్రాజెక్టులున్నప్పటికీ గతేడాది మాత్రం తన నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. గతేడాది వచ్చిన గ్యాప్ ను ఫుల్‌ఫిల్ చేయడానికి ఇప్పుడు సంయుక్త చాలా గట్టిగా ట్రై చేస్తోంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో ఆరు సినిమాలున్నాయి. ఆ ఆరు ప్రాజెక్టుల్లో మూడు మైథాలాజికల్ సినిమాలే అవడం విశేషం. వాటిలో నిఖిల్ తో చేస్తున్న స్వయంభు, బెల్లంకొండ శ్రీనివాస్ హైంధవ, బాలయ్యతో చేస్తున్న అఖండ2 ఉన్నాయి. ఇవి కాకుండా శర్వానంద్ తో నారీ నారీ నడుమ మురారీతో పాటూ బాలీవుడ్ లో మహారాగ్ని క్వీన్స్ ఆఫ్ క్వీన్స్, మలయాళంలో రామ్ అనే సినిమా కూడా చేస్తోంది సంయుక్త. వాటిలో నారీ నారీ నడుమ మురారి సినిమా ఈ సమ్మర్ లో రిలీజ్ కానుండగా, అఖండ2 సెప్టెంబరులో రిలీజ్ కానుంది. ఎంతలేదన్నా ఈ ఇయర్ సంయుక్త నుంచి మూడు సినిమాలు రావడం పక్కా అని ఆమె లైనప్ చూస్తుంటే అర్థమవుతోంది.

## అక్కడకి మకాం మార్చిన రష్మిక..!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫాం గురించి అందరికీ తెలిసిందే. మొన్నటిదాకా సౌత్ లో స్టార్ సినిమాలతో అదరగొట్టిన అమ్మడు ఇప్పుడు బాలీవుడ్ లో కూడా క్రేజీ హిట్లతో దూసుకెళ్తుంది. హిందీలో అడుగు పెట్టిన మొదటి రెండు సినిమాలు కాస్త డౌట్ అనిపించేలా రిజల్ట్ ఇచ్చినా యానిమల్ తో అమ్మడు బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అంతకుముందే పుష్ప 1 తో సూపర్ హిట్ అందుకున్న రష్మిక యానిమల్ తో డబుల్ క్రేజ్ తెచ్చుకుంది. ఇక ఆ నెక్స్ట్ పుష్ప 2 తో మరో బ్లాక్ బస్టర్ కొట్టేసింది. ఆ సినిమాల సక్సెస్ తో రష్మిక రేంజ్ నెక్స్ట్ లెవెల్ అనిపించేలా ఉంది. ఇక రీసెంట్ గా వచ్చిన ఛావా సినిమాతో అమ్మడు మరో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ లో రష్మిక సినిమాలో ఉంది అంటే సూపర్ హిట్ అన్నట్టే అనే లెక్క కనిపిస్తుంది. ఐతే రీసెంట్ గా సల్మాన్ ఖాన్ తో చేసిన సికందర్ మాత్రం నిరాశపరచింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం రష్మిక ధనుష్ తో కుబేర సినిమా చేస్తుంది. ఆ సినిమాతో పాటు గర్ల్ ఫ్రెండ్ సినిమాలో నటిస్తుంది. ఈ రెండు సినిమాలతో మరోసారి తన సత్తా చాటాలని చూస్తుంది. ఐతే రష్మిక తన సోషల్ మీడియా ఫాలోవర్స్ కి ఎప్పటికప్పుడు తన అప్డేట్స్ తో అలరిస్తుంది. అమ్మడు ప్రస్తుతం తన ఇన్ స్టా స్టేటస్ లో ఊటీలో కొన్నాళు ఉంటానని మెసేజ్ పెట్టింది. మరి రష్మిక షూటింగ్ కోసం అక్కడికి వచ్చిందా లేదా సమ్మర్ కాబట్టి హాలీడేస్ ఇక్కడ ఎంజాయ్ చేద్దామని వచ్చిందా అన్నది తెలియాల్సి ఉంది. రష్మిక నటిస్తున్న కుబేర సినిమా జూన్ లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా తో పాటు ది గర్ల్ ఫ్రెండ్ సినిమా కూడా ఇయర్ లోనే వచ్చేలా ఉంది. ఐతే కొత్తగా రష్మిక మరో రెండు సినిమాలకు సైన్ చేసిందని టాక్. సో రష్మిక నార్త్ సౌత్ అనే తేడా లేకుండా అక్కడ ఇక్కడ అదరగొట్టేస్తుంది. కేవలం పాన్ ఇండియా సినిమాలే కాదు తెలుగులో కొన్ని కాంబినేషన్స్ లో సినిమాలు చేయాలని రష్మిక ఫ్యాన్స్ కోరుతున్నారు. రష్మిక మాత్రం చేతినిండా సినిమాలతో సక్సెస్ ఫుల్ కెరీర్ తో ఫుల్ స్వింగ్ లో ఉంది.



## రాజమౌళి దృష్టిలో పడ్డాడంటే..?

రాజమౌళి ఏ స్టార్ తో సినిమా చేసినా ముందు అది రాజమౌళి సినిమా ఆ తర్వాతే ఆ సినిమాకు ఆ స్టార్ ఇమేజ్ యాడ్ అవుతుందని చెబుతుంటారు. అఫ్కోర్స్ ఆ విషయంలో హీరో ఫ్యాన్స్ కాస్త అప్సెట్ అయినా రాజమౌళితో చేసె సినిమాల వల్ల ఏర్పడే రికార్డులను ఆలోచించి జక్కన్నకే ముందు క్రెడిట్ ఇస్తారు స్టార్ ఫ్యాన్స్. తెలుగు సినిమా స్థాయిని ఇంటర్నేషనల్ లెవెల్ లో తీసుకెళ్లడానికి ఒక దారి వేసి చూపించాడు. అదే దారిలో ఇంకొన్ని అద్భుతాలు చేస్తూ వస్తున్నారు మిగతా దర్శకులు. అలాంటి రాజమౌళి దృష్టిలో పడటం అంటే అది మామూలు విషయం కాదు. ముఖ్యంగా తను ఊహించిన దాని కన్నా ఎక్కువ ముందుకెళ్లాడు అని న్యాచురల్ స్టార్ నాని గురించి చెప్పడం నాని సాధించిన సక్సెస్ ల కన్నా ఎక్కువ కిక్ ఇస్తుంది. ఏదో సినిమా ఈవెంట్ కి పిలిచారు కాబట్టి పొగిడే మాటలు కొన్ని ఉంటాయి. అవి అందరికీ తెలుస్తాయి. కానీ నాని హిట్ 3 ఈవెంట్ లో రాజమౌళి నాని గురించి మాట్లాడిన మాటలు అన్నీ నాని కష్టానికి దక్కాల్సినవే అనిపించాయి. అంతేకాదు రాజమౌళి డ్రీం ప్రాజెక్ట్ లో నాని తప్పనిసరిగా ఉంటాడు అనే సరికి నాని కూడా హమ్మయ్య మన సీటు కన్ఫర్మ్ అనేసుకుని ఉంటాడు. రాజమౌళి డైరెక్షన్ లో నాని ఈగ సినిమా చేశాడు. ఆ సినిమాలో నాని ఫస్ట్ హాఫ్ వరకే ఉండి ఆ తర్వాత ఈగగా మరో జన్మ తీసుకుంటాడు. ఐతే మహాభారతం సినిమా తర్వాత కానీ నానికి ఇప్పుడున్న ఇమేజ్ తో రాజమౌళి ఒక సోలో సినిమా చేసే అవకాశం ఏమైనా ఉందా అంటే ఏమో ఏమైనా జరగొచ్చు అని అంటున్నారు. ఎందుకంటే నాని గురించి రాజమౌళి ఊహించిన దానికన్నా అన్నాడు అంటే తప్పకుండా ఏదైనా కథ అది నానితో చేసే వర్క్ అవుట్ అవుతుంది అనుకుంటే మాత్రం రాజమౌళి చేస్తాడు. నాని కూడా రాజమౌళితో మరో సోలో అంటే ఈసారి ఈగ, దోమ అన్నట్టు కాకుండా తన ఫుల్ పొటెన్షియల్ చూపించే సినిమా ఏదైనా వస్తే చేయాలని ఉత్సాహంగా ఉన్నాడు. నాని సినిమా పట్ల చూపించే ప్రేమ.. గెలుపు కోసం పడే కష్టానికి తప్పకుండా ఇలాంటి ఒక గొప్ప అవకాశం రావాలని న్యాచురల్ స్టార్ ఫ్యాన్స్ మాత్రమే కాదు సగటు సినీ అభిమాని కూడా కోరుకుంటాడు.

## 40 ఏజ్‌లోను ఇషా గుప్తా స్టన్నింగ్ లుక్



అందాల ప్రదర్శన అనేది ఒక కళ.. అందం ఎంత ఉన్నా అందంగా ప్రదర్శించడం తెలియాలి! ఈ విషయంలో ఇషా గుప్తా ఇతర భామల కంటే, నాలుగు ఆకులు ఎక్కువే తింది. నేటితరం కథానాయికల నుంచి పోటీ ఎంత ఉన్నా కానీ, ఇండస్ట్రీలో తనదైన ప్రత్యేకతను నిలుపుకునేందుకు ఇషాజీ ఈ ఏజ్ లోను ఎంతగా పాకులాడుతుందో తన ఇన్ స్టా చూస్తే ఎవరైనా చెప్పగలరు. ఫ్యాషన్ ఇండస్ట్రీ దేవతగా పాపులరైన ఇషా గుప్తా అందాల పోటీల జడ్జిగాను గౌరవాన్ని అందుకున్నారు. భారతదేశంలో ప్రతిభావంతులైన మోడల్స్ ని తయారు చేయడంలోను తనకు అపారమైన అనుభవం ఉంది. అందుకే సినీపరిశ్రమలోను ఇషా గుప్తాకు ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. అయితే కొంతకాలంగా నటనా కెరీర్ పరంగా ఇషా గుప్తా స్పీడ్ తగ్గింది. చాలా రేర్ గా మాత్రమే తెరపై కనిపిస్తున్నారు. అయినా తన అభిమానులను నిరాశపరచకుండా, వరుస ఫోటోషూట్లను సోషల్ మీడియాల్లో షేర్ చేస్తున్నారు. ఇషా గుప్తా షేర్ చేసిన తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో ట్రెండింగ్‌గా మారింది. అంతగా ప్రత్యేకత ఏం ఉంది? అంటే... ఏజ్ లెస్ బ్యూటీ వయసు 40 బార్డర్ లో ఉన్నా కానీ, తనలో వేడి ఎంతమాత్రం తగ్గలేదని నిరూపిస్తోంది. ఇషా గుప్తా లేటెస్ట్ బోల్డ్ ఫోటోషూట్ తో ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తోంది. బాడీ హగ్గింగ్ ఇన్నర్ ని ధరించిన ఇషా బోలి లుక్ లో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ని యూత్ అంతర్జాలంలో వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్ చరణ్ సినిమాలో ఒక ఐటమ్ నంబర్ లోను నర్తించి తెలుగు వారికి సుపరిచితమై. కానీ తెలుగులో ఈంది ఈ భామ. కానీ ఇప్పుడు నటిగా అవకాశాలు రాలేదు. హిందీ చిత్రసీమలో హౌస్ ఫుల్ 5 లో నటిస్తోంది.

## కొడుకు కోసం భూమి అమ్మిన తండ్రి.. ఆ పిల్లోడే ఇప్పుడు ఐపీఎల్ సెన్సేషన్



**జైపూర్-నవభూమి:** వైభవ్ సూర్య వంశీ( .. ఐపీఎల్‌లో సెన్సేషన్ క్రియేట్ చేశాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో.. ఈ రాజస్థాన్ ప్లేయర్ ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టేశాడు. 14 ఏళ్ల వయసులోనే సెంచరీ చేసిన ఐపీఎల్ ప్లేయర్‌గా రికార్డుకెక్కాడు. బీహార్‌కు చెందిన ఈ చిచ్చరపిడుగు.. ఐపీఎల్ వేలంలోనే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈ పిల్లోడిని సొంతం చేసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ జట్టు కోటి వెచ్చించింది. వైభవ్‌ను క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు అతని పేరెంట్స్ చాలా కష్టపడ్డారు. చబ్బీ చబ్బీ బుగ్గలున్న ఈ కుర్రాడు ప్రస్తుతం 14 ఏళ్ల 32 రోజులు మాత్రమే ఉన్నాడు. అయితే గుజరాత్‌తో మ్యాచ్లో అతను 35 బంతుల్లోనే సెంచరీ కొట్టేశాడు. అతని వీర బాదుడుకు గుజరాత్ బౌలర్లు ముఖం తేలేశారు.

బీహార్‌లోని సమస్తిపుర్ ఇతని స్వస్థలం. అక్కడి నుంచి సూర్యవంశీ క్రికెట్ జర్నీ స్టార్ట్ అయ్యింది. టీ20 క్రికెట్‌కు కావాల్సిన ట్యాలెంట్ అతనిలో ఉంది. భారీ షాట్లు ఈజీగా ఆడేస్తున్నాడు ఈ చిన్నోడు. పవర్‌ఫుల్ సిక్సర్లను అలవోకగా బాదేస్తున్నాడు. పాట్నా క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో వైభవ్ చాలా శ్రమించాడు. పదేళ్ల వయసు నుంచే అతను రోజుకు 600 బంతులు ఆడేవాడు. 16 నుంచి 17 ఏళ్ల వయసున్న బౌలర్లను నెట్స్‌లో ఎదుర్కొనేవాడు. తండ్రి సంజీవ్ సూర్యవంశీ కొడుకు కోసం ఎక్స్‌ట్రా టిఫిన్ బాక్సులు తెచ్చేవాడు.

## మా అమ్మ రోజుకు మూడు గంటలే నిద్రపోయేది : యువ క్రికెటర్



**జైపూర్-నవభూమి:** తాను ఇప్పటివరకు సాధించిన ప్రతి విజయం వెనుక తన తల్లిదండ్రుల కష్టం ఉందని ఐపీఎల్ లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశి అన్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున ఆడుతున్న వైభవ్.. సోమవారం గుజరాత్ తో జరిగిన మ్యాచ్‌లో సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. 35 బంతుల్లో సెంచరీ బాది రాజస్థాన్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. వైభవ్ ఇన్నింగ్స్‌పై ప్రశంసలు వెల్లువెత్తాయి. పలువురు క్రీడారంగ ప్రముఖులు వైభవ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. అయితే ఇప్పుడు తాను అందుకుంటున్న ఈ అభినందనలు తనకంటే తన తల్లిదండ్రులకే ఎక్కువ చెందుతాయని వైభవ్ వ్యాఖ్యానించాడు. ఇప్పుడు తాను ఇలా ఉన్నానంటే.. అందుకు కారణం తన తల్లిదండ్రులేనని చెప్పాడు. తనకు కోసం అమ్మ వేకువజామునే నిద్ర లేచేదని గుర్తుచేశాడు. వేకువజామునే లేచి తన ప్రాక్టీస్ కోసం ఆహారం సిద్ధం చేసి పంపించేదని, ఆమె కేవలం మూడు గంటలు మాత్రమే నిద్ర పోయేదని వైభవ్ చెప్పాడు. తన కోసం తన తండ్రి ఉద్యోగాన్ని వదిలేశాడని తెలిపారు. కుటుంబం కోసం తన అన్నయ్య పని చేశాడని, తాము చాలా కష్టాలు పడ్డామని అతను గుర్తుచేసుకున్నాడు. ఎలాంటి సందర్భమైనా తన తండ్రి తనకు మద్దతుగా నిలిచాడని చెప్పాడు. ఇప్పుడు మీరంతా చూస్తున్న ఫలితం, విజయం కేవలం తన అమ్మానాన్నల వల్లే వచ్చిందని వైభవ్ అన్నాడు. వైభవ్ మాట్లాడిన వీడియోను ఐపీఎల్ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

నవక్రీడ

## మనోళ్లు 21 మంది బాక్సింగ్ పసిడి పోరుకు



**అమ్మాన్ (జోర్డాన్)-నవభూమి:** జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్సలో భారత బాక్సర్లు దుమ్ము రేపుతున్నారు. ఆరుగురు మహిళలు సహా మొత్తం ఏడుగురు బాక్సర్లు అండర్-17 ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. ఈ చాంపియన్‌షిప్స లో భారత్ ఇప్పటికే 43 పతకాలు ఖాయం చేసుకోగా అండర్-15, అండర్-17 విభాగాలలో 21 మంది బాక్సర్లు స్వర్ణం కోసం తలపడనున్నారు. అండర్-17 మహిళల కేటగిరీలో అహాన శర్మ (50కి.), ఖుషీచంద్ (44-46కి.), జనత్ (54కి.), సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హరిస్కా (63కి.), అన్షిక (80oకి.) ఫైనల్లో ప్రవేశించారు.

పురుషుల అండర్- 17 కేటగిరీలో దేవాన్ష్ (80కి.) పసిడి పతక పోరుకు చేరాడు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**